- 'బయానిక్‌'తో అంధులకు చూపు
- చైనా మహిళకు రెండు గర్భాశయాలు
- ఆఫీసులోనే గుండెపోటుతో ఐటీ ఉద్యోగి మృతి
- సునీతను తీసుకొచ్చేందుకు స్పేస్‌ఎక్స్ ప్రయోగం
- పాకిస్థాన్‌లో ఆరు మంత్రిత్వశాఖల మూసివేత

..లోపలి పేజీల్లో

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

సోమవారం MONDAY 30.9.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 116 ‖ వెల (Price) రూ.6.50 | త్రయోదశి

సోమవారం, సూర్యోదయం: 6-06, సూర్యాస్తమయం: 6-05. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం కృష్ణ పక్షం తిథి: త్రయోదశి రాత్రి 7-08 వరకు. నక్షత్రం: మఖ ఉదయం 6-18 వరకు, తదుపరి పూర్వఫల్గుణి. వర్జ్యం: పగలు 3-18 నుంచి సాయంత్రం 5-06 వరకు. రాహుకాలం: ఉదయం 7-36 నుంచి ఉదయం 9-06 వరకు. దుర్ముహూర్తం: పగలు 12-29 నుంచి పగలు 1-17 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 2-53 నుంచి పగలు 3-41 వరకు. అమృతకాలం: రాత్రి 2-04 నుంచి తెల్లవారుజామున 5-52 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline


కార్వాన్‌లోని మూసీ పరీవాహక దరియాబాగ్ బస్తీ వాసులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న శాసనమండలిలో ప్రతిపక్షనేత మధుసూదనాచారి



ఆదివారం హైదర్షాకోట్‌లోని మూసీ, హైడ్రా బాధితుల ఇండ్లను పరిశీలించి నిరసనలో పాల్గొన్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు వివేకానంద, సంజయ్, కౌశిక్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, కార్తీక్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్ తదితరులు


హైదరాబాద్ బండ చెరువు సమీపంలోని కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లి రాజశేఖర్‌రెడ్డి


హైడ్రాతో భయాందోళన చెందుతున్న వారికి భరోసా కల్పిస్తున్న సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి


చైతన్యపురి డివిజన్‌లోని ఫణిగిరిలో హైడ్రా బాధితుల గోడువింటున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

రాతి గుండె రేవంత్

పిచ్చోడి చేతిలో రాయిలా కాంగ్రెస్ పాలన

పేదల బతుకులు ఆగం చేసి సుందరీకరణా?.. రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా పనిచేస్తున్న సీఎంకు బుద్ధిచెప్తం

మూసీ అభివృద్ధి ముసుగులో రియల్ ఎస్టేట్ దందా.. 30 ఏండ్ల కింద కట్టిన ఇండ్లను కూలుస్తరా?

పేదల కండ్లలో రక్తం చూస్తున్న రేవంత్ సర్కార్ .. కాంగ్రెస్ చెయ్యి గుర్తు తీసేసి బుల్డోజర్ పెట్టుకోండి

లక్షన్నర కోట్లు ఎక్కడి నుంచి తెచ్చి పెడ్తరు?.. ఇండ్లు కూల్చి వరల్డ్ బ్యాంకుకు భూముల తాకట్టు: హరీశ్

మూసీ పరీవాహక ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ నేతల పర్యటన.. కూల్చివేతల బాధితులకు భరోసా

> *ఎవరి కోసం మూసీ సుందరీకరణ చేపడుతున్నారో.. ఇందులో ఎవరెవరి హస్తమున్నదో బట్టబయలు చేస్తం.. 30 ఏళ్ల క్రితం కట్టుకున్న పేదల ఇండ్లను కూల్చడానికి ఇదేం మీ అయ్య జాగీరు కాదు* - హరీశ్

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : ప్రజలకు రక్షణ ఇవ్వాల్సింది పోయి మూసీ సుందరీకరణ పేరిట కాంగ్రెస్ సర్కార్ పేదల బతుకులను ఆగం చేస్తున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. మూసీ వెంట బడుగు వర్గాలు కట్టుకున్న ఇండ్లను కూలగొట్టి ప్రపంచ బ్యాంకుకు భూములను కుదువపెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమయ్యారని విమర్శించారు. పేదల జీవితకాల కష్టార్జితాన్ని కూల్చివేసి కట్టించేవి రిసార్టులు, హోటళ్లా? అని ప్రశ్నించారు. మూసీ అభివృద్ధి పేరిట కాంగ్రెస్ సర్కార్ పేదల కండ్లలో రక్తం చూస్తున్నదని › 2వ పేజీలో



బావమరిదికి అమృతం పేదలకు విషమా?

లీగల్ నోటీసులతో నోరు మూయించలేవు

బావమరదికి టెండర్లు ముమ్మాటికీ నిజం

అశోక్‌చవాన్‌లాగా రాజీనామా తప్పదు

బీజేపీ దోస్తులు కూడా నిన్ను కాపాడలేరు

ముఖ్యమంత్రి రేవంత్‌కు కేటీఆర్ హెచ్చరిక

హైడ్రా, మూసీ బాధితులకు భరోసా › 2

అక్రమ నిర్మాణాలపైకి

బుల్డోజర్లు వెళ్తే తప్పా?



ప్రభుత్వం చూస్తూ ఊరుకోవాలా?

హైడ్రాకు ఎవరైనా ఒకటే: శ్రీధర్‌బాబు

ఆస్తులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత: భట్టి

› 2

మెట్రో.. వంకర టింకర

మళ్లీ మారిన రెండోదశ అలైన్‌మెంట్

పట్టాలెక్కకముందే మారిన మెట్రో-2 లెక్కలు

70 నుంచి 116.2 కి.మీ.కు ప్రతిపాదనలు

జనమే లేని ఫోర్త్‌సిటీ వైపు రూటు మళ్లింపు

కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో నిర్మాణం!

32,237 కోట్లకు పెరిగిన అంచనా వ్యయం



ఇప్పటివరకు రెండో దశలో మెట్రో కారిడార్లను ప్రతిపాదించినప్పుడు రెండు మార్గాల్లో మెట్రో కారిడార్‌ను ఎయిర్‌పోర్టు టర్మినల్ వరకు వెళ్లేలా ప్రతిపాదించారు. ఇందులో ఒకటి నాగోల్ నుంచి ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి, జల్‌పల్లి పీ7 రోడ్డు మీదుగా విమానాశ్రయం లోపలికి, అదేవిధంగా ఆరాంఘర్, కొత్తహైకోర్టు, శంషాబాద్ మీదుగా ఎయిర్‌పోర్టు లోపలికి ప్రతిపాదించారు. ఇదిలా ఉండగానే మళ్లీ మార్పులు చేసి నాగోల్ నుంచి ఇన్నర్ రింగు రోడ్డు మీదుగా ఆరాంఘర్, శంషాబాద్ మీదుగా ఎయిర్‌పోర్టు లోపలికి మెట్రో మార్గాన్ని తాజాగా ప్రతిపాదించామని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ప్రకటించారు.

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): రెండోదశ మెట్రోలో ప్రతిపాదిత కారిడార్లు అష్టవంకర్లు తిరుగుతున్నాయి. రోజుకో మాట, పూటకో పాట అన్నట్టుగా రెండో దశ మెట్రోను మార్పులు చేర్పులతో రేవంత్ సర్కారు కాలయాపన చేస్తున్నదే తప్ప... క్షేత్ర స్థాయిలో మెట్రోపనులు మాత్రం పట్టాలెక్కడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10నెలలు కావస్తున్నా..రెండోదశ మెట్రో కారిడార్లు ఇంకా ఫైనల్ కాలేదు. మొదటి దశ మెట్రో రైలు విజయవంతంగా నడుస్తుండగా, దానికి అనుబంధంగా నగరంలో పలుమార్గాల్లో మెట్రోను అందుబాటులోకి తీసుకురావాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం మాటలకే పరిమితమైంది. తాజాగా ఆదివారం మెట్రో రెండోదశ కారిడార్ల వివరాలను హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ప్రకటించారు. మొన్నటివరకు 70 కి.మీ. మేర రెండోదశ మెట్రో › 5వ పేజీలో

మంత్రి ఉత్తమ్‌కు పితృ వియోగం

అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన పురుషోత్తంరెడ్డి

భౌతికకాయానికి ప్రముఖుల నివాళి › 5

ఒకే హాల్‌టికెట్‌తో ఏడు పరీక్షలు

రోజుకో కొత్త హాల్‌టికెట్‌తో వెళ్తే అనుమతించరు › 9

అక్టోబర్ 21 నుంచి 27 వరకు గ్రూప్-1 మెయిన్ పరీక్షలు

రుణమాఫీ తర్వాతే రైతుభరోసా

మంత్రి తుమ్మల స్పష్టీకరణ.. మాఫీ పూర్తిపై స్పష్టత కరువు

మరో వారంలో వరికోతలు .. ఊసేలేని రైతు భరోసా



హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): ఎప్పుడో ఆగస్టు 15 వరకు పూర్తి చేస్తామన్న రుణమాఫీ ఇప్పటికీ పూర్తి కాలేదు. ఎప్పుడో జూలైలో ఇవ్వాల్సిన రైతు భరోసా పెట్టుబడిసాయం ఇప్పటికీ పైసా రాలేదు. ఇక ఇప్పుడు › 7వ పేజీలో

మాఫీ మరిచిన సర్కార్

క్రాప్‌లోన్ ఫ్యామిలీ గ్రూపింగ్ పూర్తి

4.25 లక్షల కుటుంబాల ఎదురుచూపులు

ఇంకా మిగిలిన 30 రకాల సమస్యలు

2 లక్షలపైన రుణాలపై తేల్చని ప్రభుత్వం

సర్వేలపై అధికారులు, బ్యాంకర్లకు అస్పష్టత

పంటరుణాలపై వీడని అయోమయం › 7



పొంగులేటి డాటాపై విశ్లేషణ

5 రకాల ఆర్థిక నేరాలపై లోతైన ఈడీ పరిశీలన

రెండ్రోజుల సోదాల్లో కీలక డాక్యుమెంట్లు, పలు దస్త్రాలు, డిజిటల్ సామగ్రి స్వాధీనం › 5

తనయుడి క్రిప్టో ఖాతాలు, లావాదేవీలపైనా దృష్టి

హర్యానా ఎన్నికలకు హైదరాబాద్ సొమ్ము › 5

రూ.650 కోట్లు తరలించేందుకు రంగం సిద్ధం

ఇప్పటికే హవాలా ద్వారా 100 కోట్లు తరలింపు?






9 ఏండ్ల బాలికపై లైంగికదాడి

నిందితుడి ఇంటికి గ్రామస్థుల నిప్పు › 10

సిద్దిపేట జిల్లా గురువన్నపేటలో ఉద్రిక్తత

గ్రామంలో 144 సెక్షన్.. పల్లా పరామర్శ



రాతి గుండె రేవంత్

బుల్డోజర్ రాజ్యం నడవదని రాహుల్ గాంధీ ప్రచారం చేస్తుంటే.. పేదల ఇండ్లపైకి రేవంత్‌రెడ్డి బుల్డోజర్లతో గూండా రాజ్యాన్ని అమలు చేస్తున్నడు.. కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తును తీసేసి బుల్డోజర్ గుర్తు పెట్టుకోండి -హరీశ్

మొదటిపేజీ తరువాయి...

ఆగ్రహం వ్యక్తంచేశారు. నగరంలోని మూసీ పరీవాహక ప్రాంతాలైన హైదర్‌షాకోట్, లంగర్‌హౌస్‌లోని హసీంనగర్ ప్రాంతాల్లో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, గంగుల కమలాకర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహమూద్ అలీ, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, స్వామిగౌడ్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నాయకుల బృందం ఆదివారం పర్యటించింది. బాధితుల భుజం తట్టి భరోసానిస్తూ ముందుకు కదిలింది. కాయకష్టం చేసి కట్టుకున్న పేదల ఇండ్లను కూల్చకుండా రేవంత్ సర్కార్‌ను నిలువరిస్తామని బాధితులకు అభయమిచ్చింది. వేలాది మంది బాధితులు కలిసి తీసిన ర్యాలీలో పాల్గొని వారికి సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ మూసీ పేరిట జరుగుతున్న రియల్ ఎస్టేట్ దందాలు, అక్రమణల కోసం పేదల బతుకులను ఆగం చేయవద్దని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా.. కనీసం మ్యానిఫెస్టోలో లేని విషయం కోసం పేదల ఇండ్లను కూల్చడం ఎందుకని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీల్లో ఒక్కటీ పరిపూర్ణంగా అమలు కాలేదని, పేదల బతుకులు కూల్చే మూసీ సుందరీకరణకు లక్షన్నర కోట్లు ఎక్కడి నుంచి తెస్తారని నిలదీశారు. హైదరాబాద్‌ను పునర్నిర్మాణానికి కేసీఆర్ చేయూతనిస్తే.. రేవంత్‌రెడ్డి కూలగొట్టే కార్యక్రమాలను ముందట వేసుకున్నారని మండిపడ్డారు. ఇక్కడున్న నిర్మాణాలకు కాంగ్రెస్ హయాంలోనే పట్టాలు, పర్మిషన్లు ఇచ్చారని, ప్రజలు అన్ని రకాల ట్యాక్సులు కడుతున్నారని, కేసులు పెట్టేదుంటే ఏ ప్రభుత్వమైతే అనుమతులిచ్చిందో దానిపై కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ బుల్డోజర్ రాజ్యం నడవదని ప్రచారం చేస్తుంటే.. రేవంత్‌రెడ్డి పేదల ఇండ్లపైకి బుల్డోజర్లు పంపుతూ గుండారాజ్యాన్ని అమలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తును తొలగించి బుల్డోజర్ గుర్తును పెట్టుకోవాలని ఎద్దేవా చేశారు. బాధితులెవరూ అధైర్యపడొద్దని, బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇండ్లపైకి వచ్చే బుల్డోజర్ల ముందు గులాబీ దండు ఉంటుందని స్పష్టం చేశారు. ఇండ్లను కూల్చాలంటే ముందు తమను దాటుకొని రావాలన్నారు.

బాధితులెవరూ అధైర్యపడొద్దు. బీఆర్ఎస్ అండగా ఉంటది. మీ ఇండ్లపైకి వచ్చే బుల్డోజర్ల ముందు గులాబీ దండు నిలబడుతది. మీ ఇండ్లను కూల్చాలంటే మమ్మల్ని దాటుకొని రావాలి. -హరీశ్

కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటీ పరిపూర్ణంగా అమలు కాలే.. మహిళలకు ఇచ్చేందుకు రూ.2500 లేవుగాని, లక్షన్నర కోట్లతో పేదల బతుకులు కూల్చే మూసీ సుందరీకరణ ప్రాజెక్టును ఎలా చేపడుతరు? పెన్షన్ డబ్బులు ఎప్పుడిస్తావని నిలదీస్తే పైసల్లేవని చేతులెత్తేసిన సీఎం రేవంత్ రెడ్డి.. మూసీకి లక్షన్నర కోట్లు ఎక్కడి నుంచి తెస్తరు? -హరీశ్



హైదర్షాకోటలో మూసీ బాధితులను పరామర్శించిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితారెడ్డి, మల్లారెడ్డి, గంగుల కమలాకర్‌తో తన గోడు వెళ్లబోసుకుంటున్న గర్భిణి. చిత్రంలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి, కార్తిక్‌రెడ్డి తదితరులు

సర్కార్‌పై మండిపడ్డ మాజీ మంత్రులు

అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌ను విడిచి కాంగ్రెస్‌లో చేరిన ప్రకాశ్‌గౌడ్‌ను ఉద్దేశించి మాజీ మంత్రి గంగుల కమలాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఓట్లేసి గెలిపించిన బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలు ఇబ్బందుల్లో ఉంటే ఆయన ఎందుకు బయటకు రావడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీని విడిచి ప్రజల మనిషి కాకుండా పోయాడని విమర్శించారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ మూసీ బాధితులకు డబుల్ బెడ్రూం ఇస్తామంటున్న సీఎం రేవంత్ రెడ్డి, అంతకు ముందే 60వేల మందికి అలాట్ చేశారని, ఏ ఒక్క ప్రాజెక్టులోనూ ఇండ్లు ఖాళీ లేవని, 16వేల మంది బాధితులకు ఇస్తామన్న ఇండ్ల వివరాలు చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ మూసీ పేరిట కాంగ్రెస్ చేస్తున్న ఆరాచకాలతో పేదల ఇండ్లు కూలిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. రోమ్ నగరం తగలబడుతుంటే చక్రవర్తి ఫిడేల్ వాయించిన చందంగా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు.

మూసీ వెంట ఆందోళనలు, ఆక్రందనలు

నగరంలో విస్తరించి ఉన్న మూసీ పరీవాహక ప్రాంతాల కాలనీలు, బస్తీలన్నీ ఆందోళనలు, ఆక్రందనలతో నిండిపోయాయి. కాంగ్రెస్ అనాలోచిత చర్యలతో పేదలు రోడ్డున పడుతున్నారు. ఈ క్రమంలో మూసీ వెంట పలు కాలనీల ప్రజలు స్వచ్ఛందంగా బయటకు వచ్చి సీఎం రేవంత్‌రెడ్డి తీరును ఎండగడుతున్నారు. రెక్కలు ముక్కలు చేసుకుని కట్టుకున్న ఇండ్లను బుల్డోజర్లతో కూలగొడుతున్న కాంగ్రెస్ సర్కార్‌కు వ్యతిరేకంగా పెద్దఎత్తున ఆందోళన చేస్తున్నారు.







చేతులెత్తి మొక్కుతాం.. మమ్మల్ని కాపాడండి: లంగర్‌హౌస్ హాషీమ్‌నగర్‌లో మూసీ బాధితులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

కూల్చడమే ప్రజాపాలనా?



పేదల ఇండ్లను కూల్చడమే ప్రజాపాలనా?. పేదలంటే కాంగ్రెస్‌కు ఎందుకింత కక్ష? మా ఇండ్లు కూల్చి మమ్మల్ని రోడ్డు పాలు చేయడమే సీఎం లక్ష్యంగా కనిపిస్తున్నది. పేదల ఇండ్లను కూల్చడం కాదు.. కబ్జాలు చేసి కట్టిన బడాబాబుల ఇండ్లను కూల్చాలి. **- జ్యోతి, ఫణిగిరి కాలనీ**

కబ్జాకోరులం కాదు



పైసా పైసా కూడబెట్టి కట్టుకున్న ఇల్లు మాది. మేమేం కబ్జా కోరులం కాదు. 20 ఏండ్లుగా ఇక్కడే ఉంటున్నం. అన్ని అనుమతులు తీసుకొని కట్టుకున్న ఇంటిని కూలుస్తామంటే ఎలా ? మా ప్రాణాలు పణంగా పెట్టయినా ఇండ్లను కాపాడుకుంటం. పది రోజులుగా మమ్మల్ని తీవ్ర ఇబ్బందులు పెడుతున్నరు. ఏ రాత్రి ఎవరు వచ్చి ఇండ్లు కూలగొడుతరోనని భయపడుకుంట బతుకుతున్నం. **- శైలజ, ఫణిగిరి కాలనీ**

భూములు అమ్ముకొని కట్టుకున్నం



పిల్లల భవిష్యత్తు, ఉన్నత చదువుల కోసం గ్రామాల నుంచి వలస వచ్చి బతుకుతున్నం. ఇక్కడ అద్దెలు కట్టలేక ఊర్లో ఉన్న భూములను అమ్ముకొని ఇక్కడ స్థలాలు కొన్నం. ఆ సమయంలోనే అన్ని అనుమతులు తీసుకొని ఇల్లు కట్టుకున్నం. మేం కట్టుకుంటున్న ఇల్లు బఫర్‌జోన్‌లోనో, ఎఫ్‌టీఎల్‌లోనో ఉంటే ఎలా అనుమతులు ఇచ్చిండ్రు? కష్టపడి కట్టుకున్న ఇంటికి ఇప్పుడు మార్కింగ్ చేసి ఖాళీ చేసి వెళ్లమంటే ఎక్కడికిపోవాలి? **- సత్యశ్రీ, ఫణిగిరి కాలనీ**

డబుల్ బెడ్రూం వద్దు



లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి కట్టుకున్న ఇంటిని ఖాళీ చేసిపోతే డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇస్తామంటున్నరు. మీరిచ్చే డబుల్ బెడ్రూం ఇల్లు మాకు అవసరం లేదు. మా ఇంటికి ఖాళీ చేసే ప్రసక్తే లేదు. అవసరమైతే ప్రాణాలు తీసుకుంటం కానీ ఇల్లు ఖాళీ చేయం. బలవంతంగా ఖాళీ చేయించాలని చూస్తే ప్రాణాలు తీసుకుంటం. పేదలను చంపి మూసీని అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నట్టున్నది. **- శ్రీనివాస్, ఫణిగిరి కాలనీ**

బామ్మర్దికి అమృతం.. పేదలకు విషమా?

- **లీగల్ నోటీసులకు బెదిరిపోయేది లేదు**
- **న్యాయవ్యవస్థపై సంపూర్ణ విశ్వాసం ఉంది**
- **రాష్ట్రంలో ఆడబిడ్డల రోదన మంచిదికాదు**
- **రేవంత్.. నీ రాజీనామా తప్పదు!**
- **బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): బావమరిదికి అమృతం పంచి, పేదలకు విషం ఇస్తుంటే చూస్తూ ఊరుకునేది లేదని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చిచెప్పారు. పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా కూడా ముఖ్యమంత్రి తన బావమరిది కంపెనీ (శోధ) రూ.1,137 కోట్లు టెండర్ కట్టబెట్టింది ముమ్మాటికీ నిజమేనని ఆయన ఎక్స్ వేదికగా స్పష్టంచేశారు. బావమరిదితో లీగల్ నోటీసు పంపితే ఇల్లీగల్ దందాల గురించి మాట్లాడటం బంద్ చేస్తా అనుకుంటున్నావా? అని ప్రశ్నించారు. సీఎం చట్టాన్ని ఉల్లంఘించారని, శోధ అనే కంపెనీ గత రెండేండ్లుగా రెండు కోట్లు మాత్రమే లాభం ఆర్జించిన చిన్న కంపెనీ అని కేటీఆర్ పేర్కొన్నారు. 'ఆదర్శ్ కుంభకోణంలో అశోక్ చవాన్‌లాగా నువ్వు దొరికావు.. రాజీనామా తప్పదు. ఢిల్లీలో ఉన్న నీ బీజేపీ దోస్తులు కూడా నిన్ను కాపాడడం కష్టమే' అని కేటీఆర్ హెచ్చరించారు. రూ.1.50 లక్షల కోట్ల సీఎం ధనదాహానికి లక్షల జీవితాలు బలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 'గూడు చెదిరి, గుండెపగులుతున్న ఆడబిడ్డల రోదనలు మంచిది కాదు మిస్టర్ చీఫ్ మినిస్టర్' అని ఆయన హెచ్చరించారు. ఆడబిడ్డకు కట్నంగా ఇచ్చిన ఇంటిని కూలుస్తరేమోనని ఆత్మహత్య చేసుకున్న తల్లి, భార్య కడుపుతో ఉంది కనికరించరా! అని ఒంటిపై పెట్రోల్ పోసుకున్న భర్త శాపనార్థాలు ఎవరికి తగులుతాయో ఆలోచించుకోవాలని పేర్కొన్నారు. 'మహానగర ప్రజలారా మీరు అధైర్యపడొద్దు, జరుగుతున్న విధ్వంసంతో తొందరపడి ప్రాణాలను బలి తీసుకోవద్దు, న్యాయ స్థానాలున్నాయి. మీకు మద్దతుగా బీఆర్ఎస్ ఉన్నది' అని కేటీఆర్ భరోసాను ఇచ్చారు.

నగరంలో నేడు, రేపు కేటీఆర్ పర్యటన

హైదరాబాద్ పరిధిలోని రాజేంద్రనగర్, అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో వరుసగా సోమ, మంగళవారాల్లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటించనున్నారు. '72 గంటల తర్వాత సాధారణస్థితికి వచ్చాను' అని ఆయన పేర్కొన్నారు.

భరోసా కోసం బీఆర్ఎస్ నీడకు..

తెలంగాణ భవన్‌కు కొనసాగుతున్న 'కూల్చివేతల' బాధితుల రాక

న్యాయం చేయాలని వేడుకోలు

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : మూసీ పరీవాహక ప్రాంతాల్లో సర్కారు కూల్చివేతల బాధితులు తెలంగాణ భవన్‌కు బారులు తీరుతున్నారు. కాంగ్రెస్ సర్కార్ తమ ఇండ్లను అకారణంగా కూల్చివేస్తూ తమను రోడ్డున పడేస్తున్నదని గోడు వెళ్లబోసుకుంటున్నారు. బాధితులకు అండగా ఉంటామని, న్యాయపోరాటం చేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ఇప్పటికే వెల్లడించారు. శనివారం నగరంలోని పలు కాలనీలు, బస్తీల నుంచి హైడ్రా బాధితులు పెద్దఎత్తున రాగా మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి అభయమిచ్చారు. కన్నీళ్లు పెట్టొద్దని ధైర్యం చెప్పారు. ఆదివారం హరీశ్‌రావు నేతృత్వంలో శాసనమండలిలో విపక్షనేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, గంగుల కమలాకర్, మహమూద్‌అలీ, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, మాణిక్‌రావు, కాలేరు వెంకటేశ్, పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సహా పలువురు పార్టీ నేతలు రాజేంద్రనగర్, సన్‌సిటీ, హైదర్‌షాకోట్, లంగర్‌హౌస్ హసీంనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు భరోసా కల్పించారు. మరోవైపు నగరంలోని పలు ప్రాంతాల నుంచి తెలంగాణ భవన్‌కు హైడ్రా బాధితులు తరలివచ్చారు. తమకు న్యాయం చేయాలని అర్థించారు. వచ్చిన వారి వివరాలను సిబ్బంది నమోదు చేసుకున్నారు. బాధితుల గోడు ఓపిగ్గా వింటున్నారు. బాధితులకు తగిన ఏర్పాట్లు చేయాలని కేటీఆర్ ఆదేశించటంతో తెలంగాణ భవన్ ఇన్‌చార్జి విస్తృత ఏర్పాట్లు చేశారు.

హైకోర్టు ఆదేశాలున్నా ఇండ్లు కూల్చిండ్రు

- **ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో లేకున్నా పడగొట్టిండ్రు**
- **మీడియా సమావేశంలో బాధితుల ఆవేదన**



మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న బాధితులు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 29 : ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో లేకున్నా హైడ్రా అన్యాయంగా తమ బతుకులను రోడ్డున పడేసిందని బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేటకు చెందిన బాధితులు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మీడియాతో మాట్లాడారు. కిష్టారెడ్డిపేటలోని సర్వే నంబరు 165, 166లో ప్లాట్ నంబర్ 90లో పొదులకూరి కల్యాణ్ అపార్ట్‌మెంట్‌ను నిర్మించగా, ప్లాట్ నంబర్ 92లో గణేశ్ కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన వెంకట్‌రెడ్డి పిల్లల వైద్యశాల నిర్మించాడని, ప్లాట్ నంబర్ 74లో ప్రధాన రహదారి పక్కనే 20 ఏండ్ల క్రితం స్థలం కొనుక్కొని కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించారని తెలిపారు. గత ఆదివారం హైడ్రా, తహసీల్దార్ పర్యవేక్షణలో ఆ మూడు భవనాలను కూల్చివేశారని, అప్పులు తెచ్చి కట్టుకున్న భవనాలను కండ్లముందే నేలమట్టం చేశారని కన్నీటిపర్యంతమయ్యారు. 1984లోనే లే అవుట్ అయ్యిందని, ఎల్ఆర్ఎస్ కూడా ఉన్నదని చెప్పారు. ఆర్నెళ్ల క్రితం తమ స్థలంలో ఉన్న గోడను తహసీల్దార్ కూల్చివేస్తే హైకోర్టును ఆశ్రయించామని తెలిపారు. ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకోవద్దని, యజమానుల ఇండ్లను కూల్చవద్దని కోర్టు ఆర్డర్ ఇచ్చిందని చెప్పారు. కొద్ది రోజులకే స్లాబ్ తొలగించడంతో కోర్టు ధిక్కరణ కేసు వేశామని, అప్పటి నుంచి అధికారులు కక్షగట్టారని కల్యాణ్, వెంకట్‌రెడ్డి, మధుసూదన్ వాపోయారు. అన్నిరకాల రుజువులు, సాక్ష్యాలను కోర్టులో సమర్పించగా, తమకు అనుకూలంగా తీర్పునిచ్చిందని తెలిపారు. కోర్టులో కేసు ఉండగా,గృహాలను కూల్చివేసి నిరాశ్రయులను చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారుల వ్యవహారంపై కోర్టుకు వెళితే హైడ్రా, తహసీల్దార్లకు మొట్టికాయలు వేస్తూ నోటీసులు జారీ చేసిందని, 30న హాజరు కావాలని ఆదేశించిందని తెలిపారు. కూల్చివేతలతో రూ. 5 కోట్ల నష్టం జరిగిందని, తమకు ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తంచేశారు.

ఓ అధికారికి రెండు కోట్ల ఇవ్వనందుకే!

మొదటి నుంచి ఓ అధికారి తమ నిర్మాణాలు ప్రభుత్వ స్థలంలో ఉన్నాయని, రూ.2 కోట్లు ఇస్తే పట్టించుకోమని చెప్పారని బాధితుడు వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ఎలాంటి సర్వే, డీమార్కింగ్ చేయలేదని, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో కూడా తమ నిర్మాణాలు లేవని, అన్ని అనుమతులు ఉన్న పట్టా భూమి అని, డబ్బులు ఇవ్వనందుకే తమపై కక్షగట్టి కూల్చివేశారని మీడియాకు తెలిపారు. సదరు అధికారే హైడ్రాను తప్పుదోవపట్టించి భవనాలు కూల్చివేయించారని ఆరోపించారు.

వంటావార్పుతో నిరసన

మన్సూరాబాద్, సెప్టెంబర్ 29: మూసీ పరీవాహక ప్రాంతమైన న్యూమారుతీనగర్ నార్త్ కాలనీలోని ప్రధాన కూడలి వద్దకు మహిళలు ఆదివారం పెద్దఎత్తున తరలివచ్చి రోడ్లపైనే వంటావార్పు నిర్వహించి ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. తమ ఇండ్లను కూల్చాలని చూస్తే తగినరీతిలో సీఎం రేవంత్‌రెడ్డికి బుద్ధి చెప్తామంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పాటలు పాడారు. ఇండ్లను కూల్చాలని వచ్చే వారికి ఎదురొడ్డి నిలబడతామని ప్రతిజ్ఞ చేశారు. ప్రజాపాలన.. మార్పు అంటూ వచ్చి తమను నట్టేట ముంచాలని చూస్తున్న ముఖ్యమంత్రికి మహిళాలోకం తలచుకుంటే ఏం చేస్తుందో చూపుతామని హెచ్చరించారు. ఇక నుంచి రోడ్లపైనే వంటావార్పు నిర్వహిస్తూ తమపై దాడికి వచ్చే వారికి తగిన బుద్ధి చెప్తామన్నారు. చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా సహకారంతో నిర్వహించిన వంటావార్పు కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి హాజరై సంఘీభావం తెలిపారు. మూసీ అభివృద్ధి పేరిట ప్రజలను రోడ్డు పాలు చేస్తామంటే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఇండ్లను కూల్చివేయొద్దని జరిగిన ఆందోళనలో మేము సైతం అంటూ పాల్గొన్న చిన్నారులు





న్యూమారుతినగర్ నార్త్ కాలనీలో వంట వార్పు కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, పక్కన ఇల్లు పోతుందనే బాధతో రోదిస్తున్న వృద్ధురాలు

అక్రమ నిర్మాణాలపై బుల్డోజర్లు వెళ్తే తప్పా?

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ): అక్రమ నిర్మాణాలను చూస్తూ ఊరుకోవాలా? బుల్డోజర్లు వెళ్తే తప్పా? అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సమర్థించుకున్నారు. సీఎల్పీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. హైడ్రాకు ఎవరైనా ఒక్కటేనని, అక్రమ నిర్మాణాలపై ఎవరినీ ఉపేక్షించేది లేదని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడికి కూడా నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు. మూసీ, హైడ్రా విషయంలో తమ ప్రభుత్వం చట్టబద్ధంగా, ప్రణాళికతో ముందుకెళ్తున్నట్టు చెప్పారు. హైడ్రా విషయంలో పేదలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని, పేదలు, మధ్యతరగతి వారి నివాసాల విషయంలో ప్రభుత్వం తొందరపడదని, అపార్ట్‌మెంట్ నిర్వాసితులకు ఎలా న్యాయం చేయాలన్న దానిపై ముఖ్యమంత్రి యోచిస్తున్నారని వివరించారు. ఎవరూ ఆందోళన చెందొద్దని, ఎవరికీ అన్యాయం జరగదని తెలిపారు. అడ్డగోలుగా అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు ఉంటాయని స్పష్టంచేశారు. మూసీ ప్రక్షాళన కోసమే మూసీ రివర్ ఫ్రంట్‌తో ముందుకెళ్తున్నట్టు తెలిపారు. మూసీ రివర్ బెడ్‌లోని అక్రమ నిర్మాణాలనే తొలగిస్తున్నట్టు తెలిపారు.

ఆస్తులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత

హైదరాబాద్ అంటేనే లేక్స్, రాక్స్, పార్క్స్: భట్టి



హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): ప్రజల ధన, మాన, ప్రాణాలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన శాన్‌ఫ్రాన్సిస్కోలో తెలుగు కమ్యూనిటీ మీట్ అండ్ గ్రీట్ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత సైతం ప్రభుత్వానిదేనని చెప్పారు. పేదలను అడ్డంపెట్టి కొందరు బిల్డర్లు అక్రమ నిర్మాణాలను చేపట్టి, వ్యాపారం చేస్తున్నారని మండిపడ్డారు. 'హైదరాబాద్ అంటేనే రాక్స్, లేక్స్, పార్క్స్.. అని పేర్కొన్నారు. ఇండ్ల నిర్మాణం పేరిట ఆ రాళ్లు కనుమరుగైపోయాయని, చెరువులను కబ్జాచేసి ఇండ్లు కట్టుకున్నారని, పార్కులు లేకుండా పోయాయని వివరించారు. మూసీ నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తామని, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, చదువులు, ఆరోగ్యానికి జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఇంధనశాఖ కార్యదర్శి రోనాల్డ్‌రోస్, స్పెషల్ సెక్రటరీ కృష్ణభాస్కర్, సింగరేణి సీఎండీ ఎన్ బలరాం పాల్గొన్నారు.

తొందరపడి కూల్చొద్దు


టీపీసీసీ జనరల్ సెక్రటరీ అద్దంకి దయాకర్



హైదరాబాద్, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ): హైడ్రా అధికారులు తొందరపడి బడుగు, బలహీనవర్గాల ఇండ్లను కూల్చొద్దని టీపీసీసీ జనరల్ సెక్రటరీ అద్దంకి దయాకర్ కోరారు. ఇది ప్రభుత్వంపై వ్యతిరేకతను పెంచుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన హైడ్రా, మూసీ వివాదంపై ట్విట్టర్ వేదికగా వీడియోలను పోస్ట్ చేశారు. ఎలాంటి నోటీసులు లేకుండా అధికారులు.. దళితులు, బలహీన వర్గాల వద్దకు వెళ్లినప్పుడు తొందరపడి నిర్ణయం తీసుకోవద్దని సూచించారు. హక్కులున్న ఎవరైనా తమ ఆస్తులు పోగొట్టుకుంటే వాటిని చట్టపరంగా పొందే హక్కు ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం కూడా ఇష్టానుసారంగా కూల్చివేతలు చేయదని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను రక్షించేందుకే ప్రభుత్వం కూల్చివేతలు చేపడుతున్నదని తెలిపారు. మూసీ ప్రాజెక్టులో భాగంగా కేవలం మార్కింగ్ మాత్రమే చేస్తుంటే.. కూల్చివేస్తున్నారంటూ ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు.

హైడ్రా.. సంగారెడ్డి జోలికి రావొద్దు

మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి హెచ్చరిక



సంగారెడ్డి, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): ప్రజలను భయాందోళలనకు గురిచేస్తున్న హైడ్రా సంగారెడ్డి నియోజకవర్గం జోలికి రావొద్దని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టీ జయప్రకాశ్‌రెడ్డి (జగ్గారెడ్డి) ఆదివారం ఓ ప్రకటనలో హెచ్చరికలు జారీ చేశారు. హైడ్రా పేరుతో ప్రజలను అనవసరమైన భయాందోళలనకు గురిచేయొద్దని సూచించారు. కూల్చివేతల పేరిట అధికారులు తన నియోజకవర్గంలో అత్యుత్సాహం ప్రదర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైడ్రా ఔటర్ రింగ్‌రోడ్డు లోపల మాత్రమే చర్యలు చేపడుతుందని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. రింగ్‌రోడ్డు వెలుపలి వైపు హైడ్రా యాక్షన్ ఉండదని సీఎం చెప్పడం జరిగిందని పేర్కొన్నారు. సీఎం మాటలను పక్కన పెట్టి హైడ్రా అధికారులు అత్యుత్సాహంతో చర్యలను పూనుకోవద్దని అన్నారు. సంగారెడ్డి నియోజక వర్గంలో హైడ్రా పేరుతో కూల్చివేతలు ఉంటాయని ప్రచారం జరుగుతుందని, దీంతో ప్రజలు ఆందోళనలకు గురవుతున్నట్టు పేర్కొన్నారు. సీఎం చెప్పినట్టుగా ఔటర్ రింగ్ రోడ్డుకు బయట ఉన్న సంగారెడ్డిలో ఎలాంటి కూల్చివేతలు లేకుండా చూడాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సూచించారు. ఒకవేళ ఈ నియోజకవర్గంలో హైడ్రా ఏమైనా చర్యలు తీసుకోవాలనుకుంటే ముందుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

రేవంత్‌రెడ్డీ.. మీ ప్రాధాన్యత దేనికి?

- పేద పిల్లలకు బుక్కెడు బువ్వకా? లక్షన్నర కోట్లతో మూసీ అభివృద్ధికా?
- కాళేశ్వరం కూలిందన్నవ్.. మరిప్పుడు కాళేశ్వరంతో గోదావరినీళ్లను మూసీలోకి ఎట్ల తెస్తా అంటున్నవ్?
- హాస్టళ్లకు మెస్ చార్జీలు ఇస్తలేరు
- స్కూళ్లలో టాయిలెట్స్ లేక బాలికలు క్యూ కడుతున్నరు
- గాంధీలో మందుల్లేక అవస్థలు
- సుందరీకరణ పేరుతో ప్రజలను భయపెట్టొద్దు
- మూసీ డీపీఆర్‌కే 1500 కోట్లట!
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్



మూసీ బాధితులను కలిసేందుకు వెళ్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు కాన్వాయ్‌ను తెలంగాణ భవన్ వద్ద అడ్డుకుంటున్న పోలీసులు

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : 'పేద పిల్లలకు అన్నం పెట్టేందుకు డబ్బులు లేవంటున్న సీఎం రేవంత్‌రెడ్డి మూసీ సుందరీకరణ కోసం లక్షా యాభై వేల కోట్లు ఎలా వెచ్చిస్తున్నారు.. మీ ప్రాధాన్యత దేనికి? పేద పిల్లలకు బుక్కెడు బువ్వ పెట్టడానికా? లక్షన్నర కోట్లు పెట్టి మూసీ సుందరీకరణ చేయడానికా?' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు నిలదీశారు. ఎస్సీ, బీసీ హాస్టళ్లలో పిల్లలకు అన్నం పెట్టేందుకు ఏడు నెలల నుంచి మెస్ చార్జీలు చెల్లిస్తలేరని మండిపడ్డారు. 'ఇవ్వాళ మీడియాలో చూస్తున్నం.. స్కూళ్లలో ఆడ పిల్లలకు టాయిలెట్స్ లేక వందల మంది లైన్లలో నిలబడుతున్నరు' అని ఆవేదన వ్యక్తం చేశారు. 'పేద పిల్లలకు టాయిలెట్స్ కట్టడం నీ ప్రాధాన్యతనా? లక్ష కోట్లు ఖర్చు చేసి మూసీ నదిని సుందరీకరణ చేయడం నీ ప్రాధాన్యతనా?' అని ప్రశ్నించారు. మూసీ రివర్ ఫ్రంట్ బాధితులను కలిసేందుకు వెళ్లేముందు ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మూసీ సుందరీకరణ పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దని రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి హితవు పలికారు. ముందుగా మూసీలోకి మురుగు నీరు రాకుండా చేయాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారానే గోదావరి నీళ్లను మూసీలోకి తెస్తామని రేవంత్‌రెడ్డి చెప్తున్నారని, కాళేశ్వరం ప్రాజెక్ట్ కూలిపోయిందని మాట్లాడిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు గోదావరి నీళ్లను మూసీలోకి ఎలా తెస్తారని ప్రశ్నించారు. తాను సబితా ఇంద్రారెడ్డితో కలిసి గాంధీ దవాఖానకు వెళ్లి చూస్తే రోగులు మందుల్లేక అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం డబ్బులు చెల్లించకపోవడంతో మందుల సరఫరా నిలిచిపోయిందని మండిపడ్డారు. కేసీఆర్ కిట్లు, న్యూట్రిషన్ కిట్లు బంద్ చేశారని, డబ్బుల్లేక నిలిపేశామని చెప్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది తుగ్లక్ ప్రభుత్వంగా, పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని దుయ్యబట్టారు.

ఇచ్చిన హామీలు నిలబెట్టుకోండి

ముందుగా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, తుక్కుగూడలో సోనియాగాంధీ ఇచ్చిన హామీలను అమలు చేసి మాట నిలుపుకోవాలని హరీశ్ హితవు పలికారు. మూసీ పరీవాహక ప్రాంతంలో ఉన్నవారి మెడ మీద కత్తి పెట్టి ఎందుకు మార్క్ చేస్తున్నారు? అని ప్రశ్నించారు. సుందరీకరణ పేరుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. ఫార్మాసిటీకి కేసీఆర్ 15 వేల ఎకరాల భూమిని సేకరిస్తే ఫార్మాసిటీని పక్కనబెట్టి రియల్ ఎస్టేట్ బ్రోకర్ల సాయంతో ఫోర్త్‌సిటీ నిర్మిస్తానని రేవంత్‌రెడ్డి అంటున్నారని మండిపడ్డారు. 'మూసీ డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ (డీపీఆర్)కే రూ.1500 కోట్లట! ప్రపంచంలో ఎక్కడా వినలేదు' అని ఎద్దేవా చేశారు. ఆ మొత్తం ఖర్చుచేసి పేద పిల్లలకు అన్నం పెట్టొచ్చు కదా? అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ హయాంలో మూసీలోకి మురుగునీరు రాకుండా 32 సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (ఎస్టీపీలు) నిర్మించిందని గుర్తుచేశారు.

పోలీసుల అడ్డగింత.. కాసేపు ఉద్రిక్తత

తెలంగాణభవన్ నుంచి ఆదివారం ఉదయం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందంతో మూసీ రివర్ ఫ్రంట్ బాధితులను కలిసేందుకు హైదర్‌షాకోట్‌కు బయలుదేరిన మాజీ మంత్రి హరీశ్‌రావును పోలీసులు అడ్డుకోబోయారు. బీఆర్‌ఎస్ నాయకులు వారితో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో కాసేపు ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకున్నది. అనంతరం పోలీసులు పక్కకు తప్పుకోవడంతో బీఆర్‌ఎస్ బృందం కాన్వాయ్ తెలంగాణభవన్ నుంచి బయలుదేరి వెళ్లింది.



హైడ్రాతో భయాందోళన చెందుతున్న వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

కూల్చివేస్తామంటే ఊరుకునేది లేదు

- మీ వెంట ఉండి సర్కార్‌పై పోరాడుతాం
- సద్దుల చెరువు బాధితులకు జగదీశ్‌రెడ్డి భరోసా

బొడ్రాయిబజార్, సెప్టెంబర్ 29 : హైడ్రా తరహాలో సూర్యాపేటలోనూ కూల్చివేతలు చేపడతామంటే ఊరుకునేది లేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువు ప్రాంతాల్లో అధికారులు సర్వే నిర్వహిస్తుండటంతో భయాందోళనలకు గురైన వందలాది కుటుంబాల వారు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి రాగా ఆయన వారికి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని పదేండ్లు కంటికి రెప్పలా కాపాడుకొని కేసీఆర్ అభివృద్ధి చేస్తే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలు ఇచ్చిన బాధ్యతలు, హామీలు మరిచి అరాచకం సృష్టిస్తున్నదని మండిపడ్డారు. ఎవరూ భయాందోళనలు చెందవద్దని, అవసరమైతే కొట్లాడుదామని పిలుపునిచ్చారు. ప్రజల జీవితాలతో ఆడుకుంటామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రజల పక్షాన పోరాడేది బీఆర్‌ఎస్ మాత్రమేనని స్పష్టంచేశారు. అధికారం ఇచ్చింది దోచుకోవడానికే అనుకొని ముఖ్యమంత్రి, మంత్రులు సోయి లేకుండా, బాధ్యత మరిచి ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఇకపై ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఇండ్లు కట్టకుండా చూడాలని మాజీ సీఎం కేసీఆర్ చెప్పినట్టు ఆయన పేర్కొన్నారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేసీఆరే కూలగొట్టాలని నాడు చెప్పాడని మాయ మాటలు చెప్తున్నాడని విమర్శించారు. కేసీఆర్ చెప్పిండని రైతు రుణమాఫీ, 4 వేల పెన్షన్, మహిళలకు రూ.2,500 వెంటనే ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ప్రజలకు అండగా ఉంటే, సీఎం రేవంత్‌రెడ్డి వారి జీవితాలతో ఆడుకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. అభివృద్ధి, సంక్షేమం మరిచిన కాంగ్రెస్ అరాచకాలు చేస్తుంటే ప్రజల్లో తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బండ చెరువు సమీపంలోని కాలనీల ప్రజలతో మాట్లాడుతున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

గ్యారెంటీలను గాలికొదిలి 'హైడ్రా'మా

- ప్రభుత్వ చర్యలతో ప్రజల్లో భయం పట్టుకుంది
- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

నేరేడ్‌మెట్, సెప్టెంబర్ 29: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలును గాలికి వదిలేసి హైడ్రా పేరుతో డ్రామాలు ఆడుతున్నదని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మండిపడ్డారు. వినాయకనగర్ డివిజన్ బండ చెరువు సమీపంలో మౌలాలి పరిధిలోని శంకరయ్య కాలనీ, సింహాద్రినగర్, ఎన్ఎండీసీ కాలనీ, శివానంద్‌నగర్‌కాలనీతో పాటు చుట్టుపక్కల కాలనీ ప్రజలు హైడ్రా చర్యలతో భయాందోళనకు గురవుతున్నట్టు తెలుసుకుని ఆదివారం ఆయా కాలనీల్లో పర్యటించి భరోసా కల్పించారు. పర్మిషన్లు తీసుకొని, పన్నులు చెల్లించి 30 ఏండ్ల క్రితం ఇండ్లు కట్టుకున్నామని వివిధ కాలనీల ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వమంటే ప్రజాసంక్షేమం కోసం పనిచేయాలని, అలా కాకుండా వారిని ఆవేదనకు గురిచేస్తున్నదని విమర్శించారు. ప్రజలు ఎంతో కష్టపడి పైసా పైసా కూడబెట్టుకొని అన్ని అనుమతులతో కట్టుకున్న ఇండ్లను ఒక్కసారిగా నేలమట్టం చేయడం దుర్మార్గమని, ప్రజలు భయాందోళనతో నిద్రలేని రాత్రులు గడుపుతూ అనారోగ్యాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, అన్ని వేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

బుల్డోజర్లు మమ్మల్ని దాటి రావాలి

- నేను బతికున్నంత వరకు ఇండ్లను కూల్చలేరు
- ఫణిగిరికాలనీ ప్రజలకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి భరోసా
- రేవంత్‌రెడ్డి కుట్రలను అడ్డుకోవాలని బాధితుల కన్నీళ్లు
- కావాలంటే జోలెపట్టి సీఎంకు డబ్బులిస్తామని ఆవేదన



ఇండ్లు కూల్చకుండా చూడాలంటూ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని వేడుకుంటున్న వృద్ధురాలు

మన్సూరాబాద్, సెప్టెంబర్ 29 : మూసీ పరీవాహక ప్రాంతాల్లో నివసిస్తున్నవారు ఎలాంటి భయభ్రాంతులకు గురికావద్దని, ఇక్కడ బుల్డోజర్లు పెట్టాలంటే తమను దాటి రావాలని.. తాను బతికున్నంత వరకు ఎవరి ఇంటిని కూల్చనివ్వనని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలో మూసీ పరీవాహక ప్రాంతమైన ఫణిగిరికాలనీలో బాధితులను ఆయన ఆదివారం కలిసి మాట్లాడి ధైర్యాన్నిచ్చారు. మార్కింగ్‌లు చేసినంత మాత్రాన ఎవరి ఇండ్లను కూల్చలేరని చెప్పారు. ఆరోగ్య సమస్యలతో కొన్ని రోజులుగా ప్రజలను కలవలేకపోయినట్టు తెలిపారు. అభివృద్ధి పేరుతో వేలాది మందిని నిరాశ్రయులను చేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. నివాసితులకు అన్యాయం జరగకుండా మూసీని అభివృద్ధి చేయాలని గత ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారని గుర్తుచేశారు. ప్రజల ఇండ్లకు ఎలాంటి నష్టం జరకుండా చూసేందుకే తనను ఎంఆర్‌డీసీ చైర్మన్‌గా నియమించారని చెప్పారు. మూసీని ప్రక్షాళన చేసేందుకు కంకణం కట్టుకున్న కేసీఆర్, నది పరీవాహక ప్రాంతంలో 32 సీవరేజ్ ట్రీట్‌మెంటు ప్లాంట్లు ఏర్పాటు చేశారని తెలిపారు. నాగోల్‌లో రూ.400 కోట్లతో ఎస్టీపీని నిర్మించామని చెప్పారు. మరో ఎనిమిది ప్లాంట్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ అభివృద్ధి పేరిట వేలాది మంది జీవితాలతో చెలగాటమాడుతున్నదని మండిపడ్డారు. చట్టబద్ధంగా స్థలాలు కొని రిజిస్ట్రేషన్లు చేయించుకొని, బ్యాంకుల ద్వారా లోన్లు తీసుకుని ఇండ్లు కట్టుకున్నారని, రెండు కోట్లతో కట్టిన ఇంటికి 30లక్షల పరిహారం ఇస్తామంటే ఎవరైనా ఒప్పుకుంటారా? అని ప్రశ్నించారు. 2013లో కేంద్రం తెచ్చిన భూసేకరణ చట్టం ప్రకారం ఎవరి నుంచైనా భూములు, ఇండ్లు స్వాధీనం చేసుకోవాలంటే మూడు వంతుల నష్ట పరిహారం చెల్లించి తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. మూసీ పరీవాహక ప్రజలకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని తెలిపారు. పేదల ఇండ్లను కాపాడేందుకు అన్ని పార్టీలు కలిసిరావాలని కోరారు.

ఎమ్మెల్యే వద్ద గోడు వెళ్లబోసుకున్న బాధితులు

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వచ్చిన సమయంలో స్థానికంగా ఉద్విగ్న భరిత వాతావరణం నెలకొంది. కొన్నేండ్ల కింద కట్టుకున్న తమ ఇండ్లను కూల్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న కుట్రలకు అడ్డుకోవాలని ప్రజలు కన్నీటి పర్యంతమయ్యారు. ఊర్లల్లో వ్యవసాయ భూములను అమ్ముకుని వచ్చి ఫణిగిరికాలనీ, న్యూమారుతీనగర్ నార్త్ కాలనీ, సత్యానగర్, వినాయక్‌నగర్, భవానీనగర్ కాలనీల్లో ఇండ్లు కట్టుకున్నామని తెలిపారు. అన్ని అనుమతులు తీసుకున్నామని, పన్నులు కడుతున్నామని, బ్యాంకు లోన్లు ఉన్నాయని చెప్పారు. ఎప్పుడో 25 ఏండ్ల క్రితం కట్టుకున్న ఇండ్లు ఇప్పుడు మూసీ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్నాయని మార్కింగ్ చేసి వెళ్లడం దారుణమని ఆవేదన వ్యక్తంచేశారు. మార్పు.. మార్పు అని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తెచ్చిన మార్పు ఇదేనా? అని ప్రశ్నించారు. 'మమ్మల్ని చంపి మా శవాల మీదినుంచి బుల్డోజర్లను తీస్కపోవాలె తప్ప మా ఇండ్లను కూల్చనిచ్చే ప్రసక్తేలేదు' అంటూ ఆక్రోశం వెళ్లగక్కారు. కోర్టులకు వెళ్లి స్టే తెచ్చుకోవడం కష్టంగా ఉన్నదని, ఎమ్మెల్యే చొరవ చూసి స్టే తెచ్చి తమను కాపాడాలని వేడుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి డబ్బులు కావాలంటే తామంతా జోలె పట్టి తిరిగి విరాళాలు జమచేసి ఇస్తామని, తమ ఇండ్ల జోలికి మాత్రం రావద్దని వేడుకున్నారు. నాలుగైదు రోజులుగా నిద్రాహారాలు మాని ఇండ్లను రక్షించుకునేందుకు జాగారం చేస్తున్నామని, రాత్రి వేళల్లో ఏ వాహనం వచ్చినా భయమవుతున్నదని ఆందోళన వ్యక్తంచేశారు.



కార్వాన్‌లోని మూసీ పరీవాహక ప్రాంతమైన దరియాబాగ్ బస్తీవాసులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

ప్రభుత్వ దాష్టీకాలను అడ్డుకుంటాం

- పేదలకు అండగా బీఆర్‌ఎస్ ఉంటది
- ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

కార్వాన్, సెప్టెంబర్29: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదపై చేస్తున్న దాష్టీకాలను అడ్డుకొని తీరుతామని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పేర్కొన్నారు. కార్వాన్‌లోని మూసీ పరీవాహక ప్రాంతమైన దరియాబాగ్‌లోని పేదల బస్తీలో ఇండ్ల తొలగింపు కోసం అధికారులు మార్కింగ్ చేయగా ప్రజలు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి ఆదివారం దరియాబాగ్ బస్తీకి చేరుకొని స్థానికులతో మాట్లాడారు. ఎవరూ ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు. పేదలకు లేనిపోని ఆశలు కల్పించి అధికారంలోకి వచ్చి.. ఇప్పుడు పేదల ఇండ్లనే కూల్చుతుండడం కాంగ్రెస్ ప్రభుత్వ రాక్షసత్వానికి నిదర్శమని మండిపడ్డారు. దరియాబాగ్ ప్రజల ఇండ్లపైకి బుల్డోజర్లు వస్తే కూల్చకుండా తాము అడ్డుకుంటామని చెప్పారు. ఆయనవెంట బీఆర్‌ఎస్ నాయకులు ముత్యాల భాస్కర్, పట్లూరి రఘు, యాద శ్రీనివాస్ గుప్తా ఉన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచాలి

- ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి
- రాహుల్‌గాంధీకి బహిరంగ లేఖలో ఆర్ కృష్ణయ్య



హైదరాబాద్, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల్లో బీసీలకు కల్పిస్తున్న రిజర్వేషన్లను 42శాతానికి పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ లోక్‌సభ పక్షనేత రాహుల్‌గాంధీకి రాసిన బహిరంగలేఖను ఆయన ఆదివారం మీడియాకు విడుదల చేశారు. బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతామని అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఇప్పటి వరకు కులగణన ప్రక్రియ ప్రారంభం కాలేదని లేదని నిప్పులు చెరిగారు. జాతీయ స్థాయిలో కుల గణన చేయాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేస్తున్నారని, చిత్తశుద్ధి ఉంటే అధికారంలో ఉన్న తెలంగాణలో కుల గణన చేపట్టాలని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం 50శాతం సీలింగ్ ఉన్నదని చెప్పి తప్పించుకునేందుకు యత్నించొద్దని చురకలంటించారు. అసెంబ్లీలో చట్టం చేసి 42శాతం రిజర్వేషన్లను పెట్టొచ్చని, అన్ని పార్టీలు సహకరిస్తాయని తెలిపారు.

మూడు ఎమ్మెల్సీ ఎన్నికలకు రంగం సిద్ధం

- కరీంనగర్ గ్రాడ్యుయేట్, టీచర్.. నల్లగొండ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలపై నజర్
- ఓటరు నమోదుపై వివిధ పార్టీల దృష్టి
- అర్హులంతా ఓటు నమోదు చేసుకోవాల్సిందే
- 30 నుంచే ఓటరు నమోదుకు అవకాశం

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో మరో మూడు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు ఆయా చోట్ల ఓటరు నమోదుకు రాజకీయ పార్టీలు సిద్ధమవుతున్నాయి. రాష్ట్రంలోని కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ స్థానాలు, నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల స్థాయి ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీల పదవీ కాలం వచ్చే మార్చి 29వ తేదీతో ముగియనున్నది. ఆయా స్థానాల్లో ఎన్నికల కోసం ఈనెల 30 నుంచి ఓటరు నమోదు ప్రారంభంకానున్నది. ఆయా స్థానాల నుంచి ప్రస్తుతం టీ జీవన్‌రెడ్డి, రఘోత్తంరెడ్డి, నర్సిరెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఫిబ్రవరి నెలాఖరులో ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉన్నదని అంచనా వేస్తున్నారు. దీని కోసం డిసెంబర్ నెలాఖరు కల్లా ఓటరు జాబితాను ప్రకటించడానికి ఎన్నికల సంఘం ఇప్పటికే షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఓటరు నమోదుకు నవంబర్ 1 కటాఫ్ తేదీగా నిర్ణయించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తిరిగి ఓటరుగా నమోదు చేసుకోవాల్సిందే. గతంలో ఓటు ఉన్నా మరోసారి ఓటు నమోదు చేసుకోవాల్సిందేనని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. 2019లో ఆయా స్థానాలకు ఎన్నికలు జరగ్గా అప్పుడు తక్కువగా ఓట్లు నమోదయ్యాయి. 4 ఉమ్మడి జిల్లాల్లో కలిపి కేవలం 1.96 లక్షల మంది పట్టభద్రులే ఓటర్లు నమోదు చేసుకున్నారు. అదే ఏడాది కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గంలో 23 వేల మంది, నల్లగొండ టీచర్ నియోజకవర్గంలో 21 వేల మంది ఓటర్లు ఉన్నారు. ఈసారి మూడు నియోజకవర్గాల్లో ఓటర్ల నమోదు సంఖ్య పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

2019 ఎన్నికల సమయంలో గ్రాడ్యుయేట్, టీచర్ నియోజకవర్గ ఓటరు వివరాలు

జిల్లాలు	ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు
కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ (గ్రాడ్యుయేట్)	1,96,321	313
కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ (టీచర్)	23,214	253
నల్లగొండ, ఖమ్మం, వరంగల్ (టీచర్)	20,888	181



మురికివాడల జోలికి వెళ్లొద్దు: దానం



ఖైరతాబాద్, సెప్టెంబర్ 29 : పేదలు నివసించే మురికివాడల జోలికి వెళ్లొద్దని హైడ్రా, మూసీ రివర్ ఫ్రంట్ అధికారులకు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కోరారు. ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో జీవిస్తున్న వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండానే వారి భవనాలను కూల్చివేయడం సరికాదని తెలిపారు. గ్రేటర్‌లో ఎన్నో పెద్ద పెద్ద భవంతులు ఉన్నాయని, వాటి జోలికి పోకుండా పేదల ఇండ్లను కూల్చివేయడేమిటని ప్రశ్నించారు. ఇండ్లకు రెడ్‌మార్క్ పెట్టడం తొందరపాటు చర్యగా అభివర్ణించారు. బాధితులకు ముందుగా వసతి కల్పిస్తే మంచిదని సూచించారు.



అఫీషియల్ లిక్విడేటర్ కార్యాలయం
1వ అంతస్తు, ''కార్పొరేట్ భవన్'', బండ్లగూడ, నాగోల్, హైదరాబాద్-500068,
ఫోన్ నం.లు 040-29803086/3186,
ఇ-మెయిల్ : ol.hyderabad@mca.gov.in

గౌరవనీయ ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానంలో: అమరావతి వద్ద (ప్రారంభ అధికారపరిధి)
కంపెనీల చట్టం, 1956 విషయంలో
M/s. శ్రీ పూజిత చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో కలదు) **విషయంలో**
కంపెనీ పిటీషన్ నం. 28/2010
ఇ-వేలం ద్వారా అసెట్లు/ఆస్తుల అమ్మకం కొరకు ప్రకటన

గౌరవనీయ ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం, అమరావతి వద్ద తేది: 29.08.2024 గల ఉత్తర్వులు ప్రకారం, కాగోరు కొనుగోలుదారులు నుండి ''**ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా మరియు అక్కడ ఏమున్నదో అదే ప్రాతిపదిక**''పై కంపెనీ (లిక్విడేషన్‌లో కలదు) యొక్క దిగువ అసెట్లు/ఆస్తులు అమ్మకానికి సంబంధించి ఇ-టెండర్లు కోరబడుచున్నవి.
అసెట్లు/ఆస్తులు, రిజర్వు ధర, బయానా మరియు బిడ్ పెంపుదల మొత్తం యొక్క వివరాలు దిగువ విధంగా ఉన్నవి:

అసెట్లు/ఆస్తుల యొక్క వివరణ	రిజర్వు ధర (రూ.)	బయానా (EMD) (రూ.)	బిడ్ పెంపుదల విలువ (రూ.)
ఆంధ్రప్రదేశ్, NTR జిల్లా, విజయవాడ, గవర్నర్‌పేట్, మ్యూజియం రోడ్, అమ్మన ఎస్టేట్స్, డోర్ నం. 29-36-37, అప్పర్ గ్రౌండ్ ఫ్లోర్ వద్దగల 1923 చ.అడుగుల (కామన్ ఏరియా కలుపుకుని) విస్తీర్ణంగల ఫ్లాట్ (RCC రూఫ్డ్ కమర్షియల్ బ్లాక్), మెషినరీ,ఎక్విప్‌మెంట్ మరియు ఫర్నిచర్, విండో/స్ప్లిట్A/C,సేఫ్టీ లాకర్, కంప్యూటర్, ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్ & ఆఫీస్ ఎక్విప్‌మెంట్ మొదలగువాటితో సహా	1,19,50,000	11,95,000/- (వడ్డీ లేకుండా)	1,00,000/-

గమనిక: i) 18.10.2024 & 19.10.2024 తేదీలలో ఉ. 11.00 గం. నుండి సా. 5.00 గం.మధ్య అప్పర్ గ్రౌండ్ ఫ్లోర్, డోర్ నెం.29-36-37, అమ్మన ఎస్టేట్స్, మ్యూజియం రోడ్, గవర్నర్‌పేట్, విజయవాడ, ఎన్‌టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్ వద్ద గల పై అసెట్లు/ఆస్తులను తనిఖీ చేసుకోవచ్చు.
ii) ఆన్‌లైన్ ఇ-వేలంలో పాల్గొనుటకు టెండరుదారులు **అఫీషియల్ లిక్విడేటర్ అకౌంట్** అనగా **"EMD ACCOUNT", కరెంట్ అకౌంట్ No.0207002100146966, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ట్రూప్ బజార్, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్, IFS కోడ్: PUNB0020700**లో RTGS/NEFT విధానం ద్వారా **రూ. 2,000/- (రూపాయలు రెండు వేలు మాత్రమే)** వాపసు ఇవ్వబడని మరియు సర్దుబాటు చేయబడని ఇ-వేలం పార్టిసిపేషన్ రుసుము మరియు పైన తెలిపిన **బయానా మొత్తం (వడ్డీ లేదు)** చెల్లించాల్సి వుంటుంది. పార్టిసిపేషన్ రుసుము మరియు బయానా మొత్తం డిపాజిట్ చేయుటకు ఆఖరి తేదీ **05.11.2024న సా. 4.00 గం. వరకు** మరియు మద్దతు డాక్యుమెంట్లుతో పాటు ఆన్‌లైన్ ఆఫర్ /బిడ్ ఫారం దాఖలు చేయుటకు ఆఖరి తేది **06.11.2024న సా. 4.00 గం.వరకు.**
iii) టెండరుదార్లు వెబ్‌సైట్: **https://ol.auctiontiger.net** ద్వారా తమ ఆన్‌లైన్ ఆఫర్ దాఖలు చేయాలి. అఫీషియల్ లిక్విడేటర్ వారు ఇంటర్నెట్ కనెక్టివిటీ సమస్య, నెట్‌వర్క్ సమస్య, సిస్టమ్ క్రాష్ డౌన్, విద్యుత్ వైఫల్యం మరియు అటువంటి ఇతర కారణాలకు బాధ్యత వహించరు.
iv) ఇ-వేలం గురించి వివరాలు/ సహాయం/విధానం/ఆన్‌లైన్ శిక్షణ కొరకు కాగోరు బిడ్డర్లు **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఆక్షన్ టైగర్)** కస్టమర్ కేర్ నంబర్‌పై సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించవచ్చును. **మొబైల్ నం. +91 9722778828.**
v) పై ఆస్తుల/ అస్సెట్ల ఇ-వేలం/ బిడ్డింగ్ అర్హత గల బిడ్డర్ల మధ్య ఆన్‌లైన్ ఇంటర్-సె-బిడ్డింగ్ ద్వారా నిర్వహించబడును. సదరు బిడ్డర్లు ''బిడ్ ఇంక్రిమెంట్ అమౌంట్'' ద్వారా వారి ఆఫర్‌ను పెంచవచ్చును.
vi) ఇ-వేలం వెబ్‌సైట్ **https://ol.auctiontiger.net** ద్వారా ఇ-వేలం అమ్మకం పూర్తి అయ్యేముందు చివరి నిమిషంలో బిడ్ వేయబడితే ప్రతిసారీ 10 నిమిషాల ఆటోటైమ్ ఎక్స్‌టెన్షన్‌తో **08.11.2024న ఉ. 11.30 గం. నుండి మ. 2.30 గం.** మధ్య నిర్వహించబడుతుంది.
vii) అమ్మకం గౌవరనీయ ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం, అమరావతి యొక్క నిర్ధారణకు లోబడి ఉంటుంది. అఫీషియల్ లిక్విడేటర్ మరియు గౌరవనీయ ఉన్నత న్యాయస్థానం ఎటువంటి కారణాలు తెలుపకుండా ఏదైనా ఆఫర్‌ను అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు వారి హక్కులు కలిగి ఉన్నారు.
viii) కంపెనీ (లిక్విడేషన్‌లో కలదు) విషయంలో ఆసక్తి కలిగిన సెక్యూర్డ్ క్రెడిటార్స్/ అన్‌సెక్యూర్డ్ & ప్రిఫరెన్షియల్ క్రెడిటార్స్/ కంట్రిబ్యూటర్స్/ఎక్స్-డైరెక్టర్స్/ కేంద్ర & రాష్ట్ర ప్రభుత్వ అథారిటీలు, గవర్నమెంట్/సెమి గవర్నమెంట్ /స్థానిక సంస్థలు మరియు అన్ని ఇతర పార్టీలకు నోటీసుగా ఈ అమ్మకం ప్రకటనను పరిగణించవలెను.
ix) కాగోరు కొనుగోలుదారు ప్రతిపాదిత ఇ-వేలంలో పాల్గొనుటకు ముందు ఏవైనా అవసరమైన వాటికి సంబంధించి తమకుతాము పూర్తిగా సంతృప్తి పడేందుకు ప్రకటన తేది నుండి పైన తెలిపిన తనిఖీ తేది వరకు ఏదైనా పని రోజున **మ. 2.00 గం. నుండి మ. 3.00 గం.**మధ్య అఫీషియల్ లిక్విడేటర్, హైదరాబాద్ వారి కార్యాలయాన్ని దర్శించి సంబంధిత ఫ్లాట్ డాక్యుమెంట్లను పరిశీలించుకోవచ్చు మరియు రెవెన్యూ/సంబంధిత అథారిటీల నుండి నేరుగా సంబంధిత రెవెన్యూ రికార్డులు/లొకేషన్ మ్యాప్ కూడా పరిశీలించుకోవచ్చు. భవిష్యత్‌లో దీనికి సంబంధించి ఏదైనా అభ్యంతరం ఉంటే, దానిని అఫీషియల్ లిక్విడేటర్ పరిగణించజాలరు.
x) అమ్మకం నియమ నిబంధనలతోపాటు పై ఇ-వేలం యొక్క ఇతర వివరాలు వెబ్‌సైట్ **https://ol.auctiontiger.net**లో లభిస్తాయి.
xi) పై నియమ నిబంధనలను ఏ సమయంలోనైనా గౌరవనీయ ఉన్నత న్యాయస్థానం/ అఫీషియల్ లిక్విడేటర్ ద్వారా సడలించవచ్చును/ రద్దు చేయవచ్చును/తదుపరిగా పేర్కొనవచ్చును.

సం/-
(U.K.సాహూ, ICLS)
అఫీషియల్ లిక్విడేటర్,
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం, హైదరాబాద్

తేది: 24.09.2024
ప్రదేశం: హైదరాబాద్,
ఫోన్: 040-29803086, 29803186

4 నమస్తే తెలంగాణ
హైదరాబాద్
సోమవారం 30 సెప్టెంబర్ 2024
www.ntnews.com

చె లి మె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com



తుది విజయం

ఖడ్గం అంచు పైన తెల్ల పావురం
నెత్తురు బురదలో మొలుస్తున్న కలువలు
తాండవం దారిలోనే నెమలి ఆట
జీవన బృందావనంలో శాంతి మురళి గానం
పడగ విప్పిన సర్పం తల ఊపుతుంది
పులి మేకతో కలిసి సయ్యాటలాడుతోంది
ఒక అభయంకర జీవితం...

పూలు పూలుగా కురుస్తున్న అక్షరం
ఎనలేని పరిమళం
ఎక్కడిది ఇదంతా
ఏ పోహళింపు పరిణామం ఇదంతా
యుద్ధం అంటే నెత్తురేనని
భయం బొరియలో ఊపిరి కూడా
సరిగా తీయలేని విషాద అస్తిత్వమేనని
వెనకైనా ముందైనా
కిందైనా మీదైనా
చరమ సంధ్య ఓటమేనని
ఎప్పుడు తెలుస్తుంది?
యుద్ధానికి నువ్వు చెప్పే
అబద్ధం నిజమే అనుకున్నా
దాని పర్యవసానం శాంతేనని
గుట్టు నీ గుండెలో
ఎప్పుడు విప్పారుతుంది
జీవితం అసత్యం కాదు
భ్రమ అసలే కాదు
దీన్ని రక్తంతో అనుభవించడం...

క్షమశాంతి క్రాంతికి
మూలధాతువులు
యాత్రికుడా
ఇంకా ఎడారి
యానం చేయకు
చమరింతల కనుల
లోలోపలి చెలిమను
ఎండనీయకు
జీవితాన్ని మరొక
తూర్పు ముఖం చెయ్
శాంతి-యుద్ధం
బొమ్మ బొరుసులే
చివరి విజేత నిశ్చయంగా శాంతే



కాంచనపల్లి గోవర్ధన్ రాజు
9676096614

తెలుగులో అచ్చులు మూడే

'దేశ భాషలందు తెలుగు లెస్స' అన్న తెలుగు వ్యాకరణ పండితులు కొందరు 'తెలుగుకు ఉన్న వ్యాకరణ దీపం చిన్నది' అన్నారు. సంస్కృత భాషా వ్యాకరణ కౌముది వంటి గ్రంథాలను దృష్టిలో పెట్టుకొని తెలుగు వ్యాకరణ పండితులు ఈ మాట అని ఉంటారని చెప్పవచ్చు.

తెలుగు వ్యాకరణ గ్రంథాలు అనగానే చాలా మంది తెలుగు పండితులకు చిన్నయసూరి రాసిన 'బాల వ్యాకరణం', బహుజనపల్లి సీతారామశాస్త్రి రాసిన 'ప్రౌఢ వ్యాకరణం' వంటి గ్రంథాలు మొదటగా గుర్తుకువస్తాయి. ఆపై నన్నయ్య విరచితమని చెప్పబడుతున్న ఆంధ్ర శబ్ద చింతామణి, మల్లియరేచన కవి జనాశ్రయం, అధర్వణుని అధర్వణ కారికావళి, కేతన ఆంధ్ర భాషా భూషణము, విన్నకోట పెద్దన కావ్యాలంకార చూడామణి, అనంతామాత్యుని ఛందో దర్పణం, వెల్లంకి తాతంభట్టు కవి చింతామణి, ముద్దరాజు రామన్న కవి జన సంజీవని, బాలసరస్వతి బాల సరస్వతీయం, అప్పకవి అప్పకవీయం, గణపవరపు వెంకటకవి ఆంధ్రకౌముది, అహోబలపండితుని అహోబల పండితీయం కూచిమంచి తిమ్మకవి లక్షణసార సంగ్రహం, అడిదం సూరకవి కవిసంశయ విచ్ఛేదం, శిష్ట్లా కృష్ణమూర్తి శాస్త్రి హరికారికావళి వంటి తెలుగు వ్యాకరణ గ్రంథాలు యాదికివస్తాయి.

> **తెలుగు వ్యాకరణ గ్రంథాలు పూర్వ కవుల పద ప్రయోగాల వ్యాకరణ కార్యాల గురించి చెప్పినంతగా వ్యావహారిక భాషా ప్రయోగాల వ్యాకరణాంశాల గురించి చెప్పలేదు. మాండలిక భాషలోని యాసనందలి ఉదాత్తానుదాత్త గణిత ధర్మాల గురించి అసలు చెప్పలేదు.**

తెలుగు ప్రబంధాదులందే గాక తెలుగు వ్యాకరణ గ్రంథాలలో సైతం అనువాద శాతమే అధికంగా కనపడుతుంది. చిన్నయసూరి బాల వ్యాకరణం హరికారికావళి వ్యాకరణ గ్రంథానికి మక్కికి మక్కీ అని కొందరంటారు. నన్నయ విరచితమని చెప్పబడుతున్న ఆంధ్ర శబ్ద చింతామణి ఆయన రచన కాదని చెప్పేవారే అధిక శాతం ఉన్నారు. చిన్నయసూరి రాసిన బాల వ్యాకరణానికి అనుబంధంగా రాసిన ప్రౌఢ వ్యాకరణాన్ని త్రిలింగ లక్షణ శేషం అని కూడా అంటారు. ఇలా తెలుగు వ్యాకరణ గ్రంథాలు అనువాద మార్గానికే అధిక ప్రాధాన్యం ఇచ్చినట్టుగా కనపడుతుంది. సంస్కృత వ్యాకరణాన్ని తెలుగుకు అనువాదం చేసేటప్పుడు మన తెలుగు వ్యాకరణ పండితులు వ్యాకరణ పారిభాషిక పదజాలానికి అనేక అశాస్త్రీయ అర్థాలను కల్పించారు.



మనిషి నోరు, నాసికల నుంచి జనించే అక్షర ఉత్పత్తి ఆధారంగా సశాస్త్రీయంగా సంస్కృతంలో సంధులు మొదలైన వ్యాకరణాంశాలను చెప్తుంది. దాన్ని బట్టి ఆదేశం, ఏకాదేశం, ఆగమం వంటి వ్యాకరణ పారిభాషిక పదాలకు సశాస్త్రీయంగా అర్థాలను చెప్తుంది. వేదాంగాలైన శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పములలో వ్యాకరణ మూలాలు బాగా తెలియాలంటే, శిక్ష, నిరుక్తములు కూడా కొంత తెలియవలసిన అవసరం ఉన్నది. లేకుంటే ఆదేశానికి, ఏకాదేశానికి తేడా తెలియకుండా పోతుంది. చిన్నయసూరి తన బాల వ్యాకరణంలో 'ఆర్య వ్యవహార దుష్టంబు గ్రాహ్యంబు' అని అంటారు. నిజానికి తెలుగు వ్యాకరణ మూలాలు అటు సంస్కృత వ్యాకరణ మూలాల్లోకి, ఇటు వ్యావహారిక తెలుగు భాషా మూలాల్లోకి వెళ్లకపోవడం వల్ల, సశాస్త్రీయ మార్గాన్ని అనుసరించక పోవడం వల్ల అలా చెప్పవలసిన అవసరం ఏర్పడింది.

నేడు ఇంగ్లీష్ భాషలో 26 అక్షరాలుంటే అందులో 'ఏ, ఈ, ఐ, ఓ, యూ' అనే అక్షరాలను అచ్చులని అంటారు. తెలుగు వ్యాకరణం ప్రకారం తెలుగు భాషకు అచ్చులు 16. అందులో 'అలు, అలూ' అనే రెండక్షరాలు వాడుకలో లేవు. వాటిని తీసివేస్తే తెలుగు భాషకు అచ్చులు 14 అవుతాయి. ఆధునిక కాలంలో 'ఋషి' అని రాయడానికి 'రుషి' అని హల్లును ఉపయోగించి రాసేస్తున్నారు. అలా ఋ, ౠలను తీసివేస్తే తెలుగులో 12 అచ్చులే ఉంటాయి. శిక్ష, వ్యాకరణ ధర్మాలను అనుసరించి అ+ఇ=ఏ, అ+ఉ=ఓ, ఆ+ఏ=ఐ, అ+ఓ=ఓ ఇలా ఎ, ఏ, ఐ, ఒ, ఓ, ఔలను మినహాయిస్తే తెలుగులో అచ్చులు 6 మాత్రమే మిగులుతాయి. ఇందులో దీర్ఘాచ్చులను తీసివేస్తే తెలుగుభాషకు మూడంటే మూడు అచ్చులుంటాయి. మన తెలుగు వ్యాకరణ పండితులు కొంత సంస్కృత వ్యాకరణ సంప్రదాయాలను, కొంత తెలుగు వ్యాకరణ సంప్రదాయాలను అనుసరించడంతో తెలుగు భాషకు అచ్చులు 16 అయ్యా యి. వాటికి లిపి పుట్టుకవచ్చింది. తెలుగు అజంత భాష అయ్యింది. అవసరాన్ని బట్టి పరభాషా వ్యాకరణ సంప్రదాయాలను స్వీకరించడం తప్పు కాదు. కానీ, పరభాషా వ్యాకరణ సంప్రదాయాల మూలాలను గ్రహించకుండా వాటిని స్వీకరిస్తే భాషకు మేలు కంటే కీడే ఎక్కువ.

> **నేడు తెలుగు భాషలో ఇంగ్లిష్ పదాల జోరు పెరిగింది. ఇంగ్లిష్ భాషా పదాలు అధికశాతం హలంతాలుగా ఉంటాయి. దానితో పద ప్రయోగంలో వేగం పెరుగుతుంది. ఈ వాస్తవాలను గమనించి తెలుగు వ్యాకరణాన్ని రూపొందించుకోవాలి.**

కానీ, మనవారు ఆర్య వ్యవహార దుష్టంబు గ్రాహ్యంబు అంటూ పాత పద్ధతుల్లోనే వెళ్తున్నారు. తెలుగు వ్యాకరణ పండితులు సంస్కృత వ్యాకరణ మూలాలను కూడా గ్రహించి ఉంటే.. అచ్చుల సమితి, హల్లుల సమితి, వక్రముల సమితి, వక్రతమాల సమితి, కపటయాది సూత్రాలు, సంయుక్త వర్ణ సమితి, విచ్ఛేద వర్ణ సమితి, ప్రత్యాహార అక్షర సమితి అనే అంశాలు తెలుగు వ్యాకరణంలో ఉండేవి. పాణిని వంటి మహర్షులు సంస్కృత వ్యాకరణాన్ని గణిత ఛాయాబద్ధంగానే చెప్పారు. తెలుగు వ్యాకరణ పండితులు మాత్రం సంస్కృత వ్యాకరణంలోని గణిత ఛాయలకు తిలోదకాలిచ్చారు.

సంస్కృత వ్యాకరణ గ్రంథం కౌముదిలోని మహేశ్వర సూత్రాలలో మొదటి సూత్రం 'అ ఇ ఉ ణ్' వీటిని వ్యాకరణ పారిభాషిక పదం ప్రకారం అణ్ణులు అని అంటారు. నిజం చెప్పాలంటే ఈ అణ్ణులు మూడే తెలుగు భాషలో ప్రధాన అచ్చులు అని చెప్పవచ్చు. కంప్యూటర్‌లోని ఫైల్ సిస్టం ఈ అణ్ణులు అనే పద ప్రయోగంలో ఉన్నది. ఇలా నేడు ఎంతమంది సంస్కృతాంధ్ర వ్యాకరణాలను బోధిస్తున్నారు? సంస్కృతం సంగతి అలా ఉంచి తెలుగు భాషాభిమానులు జర ఆలోచించండి. విదేశీ శాస్త్రవేత్తలు ఏదన్న కొత్త విషయాన్ని కనిపెడితే చాలు.. మనవారు ఇదంతా మా వేద పురాణేతిహాసాలలో పూర్వమే ఉన్నదంటారు. ఉంటే వారికంటే ముందే మనవారు ఎందుకు చెప్పరు? మనవారి పాండిత్యం ఎదుటివారిని విమర్శించడానికి తప్ప నవీన విజ్ఞాన రూపకల్పనకు పనికిరాదా? నిజం చెప్పాలంటే పాణిని విరచిత కౌముదిలోని మహేశ్వర సూత్రాలను సశాస్త్రీయంగా పాణిని మహర్షి ఆలోచించిన విధంగా వివరిస్తే చాలు. అక్కడే అచ్చులు, హల్లులు, అణ్ణులు వంటి వ్యాకరణ పారిభాషిక పదాలు ఎలా పుట్టాయో తెలియడమే గాక కంప్యూటర్‌లోని ఫైల్ సిస్టం, ద్విసంఖ్యా మానాది గణితం వంటి అంశాలూ ఎరుకకు వస్తాయి. పరీక్షల కోసం తెలుగు, తెలుగు వ్యాకరణం, మార్కుల కోసం సంస్కృతం ఉన్న ఈ రోజుల్లో ఇదంతా జరుగుతుందా? అంటే సమాధానం శూన్యం.



వాగుమూడి లక్ష్మీరాఘవరావు
6281490160

మిగిలింది ఏముంది


కిరణ్

దుక్కిని దున్నిన
నా జీవితానికి దుఃఖమే మిగిలింది
అన్నం పెట్టిన నా చేతులు
అరచేతి గీతలు అరుగుతున్నాయి

పొలం దున్ని పోగేసుకున్న
అప్పు తప్ప ఆత్మకేం మిగిలింది
పస్తులుండి పంటను తీసి
ప్రపంచానికి బువ్వ పెట్టి బూడిదవుతున్న
మిత్తి ఒత్తిడే మిగిలింది ఏముంది?

కోతలు కోసిన నా చేతికి
కొడవలి కోతలే మిగిలే
గింజలు తీసిన నా మనసుకు
గిట్టని ధరలే మిగిలే

ఎగుమతి
ఎద మీద ఏసింది భారం
కష్టానికి మిగిలే కారిన స్వేదం
కారిన చెమట ఖరీదు లేదు
ఎవుసమంటే రైతు ఏడుపేనా?



దేవరపాగ కృష్ణయ్య
99634 49579

ఋగ్వేద విద్యాసంపన్నులు, కవిపండిత ప్రవరులు, రాజకీయవేత్త, దుందుభి కావ్యకర్త గంగాపురం హనుమచ్ఛర్మ శతజయంతి వత్సరమిది. క్రీ.శ.1925 సెప్టెంబర్ 29వ తేదీన పూర్వపు మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తి మండలం వేపూరులో ఆయన జన్మించారు. కల్వకుర్తి మండలం గుండూరులో స్థిరనివాసం ఏర్పర్చుకొని రెండుసార్లు గుండూరు, లింగసానిపల్లి గ్రామపంచాయతీకి ఏకగ్రీవ సర్పంచ్‌గా, గుండూరు ప్రత్యేక గ్రామ పంచాయతీకి ఒకసారి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. స్వాతంత్రోద్యమం, గ్రంథాలయోద్యమం, భూదానోద్యమాలలో చురుకుగా పాల్గొన్నారు.

సాహిత్య, ప్రజా సేవలో తరించిన హనుమచ్ఛర్మ



సెప్టెంబర్ 29న జయంతి సందర్భంగా..

హనుమచ్ఛర్మ మార్చాల, పొలుమూరుల్లో ప్రాథమిక విద్య పూర్తి చేశారు. చినమరూరులో వేంకటనరసింహ శాస్త్రి వద్ద సంస్కృతం, రఘువంశాదులు నేర్చుకున్నారు. కరివెనలో పరుశురామశాస్త్రి వద్ద కావ్య నాటకాలు, మంకాల కృష్ణశాస్త్రి వద్ద పాణినీయ వ్యాకరణం నేర్చుకున్నారు. ఋగ్వేదం గురుముఖతః నేర్చుకున్నారు. 60-70 సంవత్సరాలకు పూర్వమే హరిజన ఇండ్లల్లో పెండ్లిళ్లు, సత్యనారాయణ వ్రతాలను చేయించి అస్పృశ్యతా నివారణను అక్షరాలా ఆచరించిన ఆదర్శప్రాయుడు హనుమచ్ఛర్మ.

గుండూరు గ్రామంలో ప్రాథమిక పాఠశాలను, మాధ్యమిక పాఠశాలగా, తరువాత ఉన్నత పాఠశాలగా తీర్చిదిద్ది వాటి భవనాల నిర్మాణానికి అహర్నిశలు పాటు పడ్డారు. గ్రామంలోని మాదాయ చెరువును నీటితో నింపటానికి చిన్నవాగు (ధీమతి)పై ఆనకట్టను నిర్మించి కాలువ ద్వారా నీటిని తెప్పించడంలో ఆయన కృషి మరువలేనిది. హనుమచ్ఛర్మ దుందుభి (డిండి) నదిపై అదే పేరుతో రాసిన కావ్యం సుప్రసిద్ధం. ఈ ప్రాంత చరిత్ర, రాజులు, కవి పండితులు, కళాకారుల చరిత్రలను ఆయన అందులో లిఖించారు. ఇది ముద్రణకు పూర్వమే బహుళ ప్రజాదరణ పొందినది. 1961లో ప్రథమ ముద్రణ పొందింది. 1990లో ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో ప్రీ డిగ్రీ కోర్సుకు ఎంపికైనప్పుడు రెండోసారి ముద్రితమైంది. తృతీయ ముద్రణను విజ్ఞాన సరోవర ప్రచురణలో భాగంగా కొండా లక్ష్మీకాంత్ రెడ్డి ముద్రించారు. గత కొంతకాలంగా ఈ కావ్యం తెలంగాణలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పాఠ్యాంశంగా ఉంది. 2017లో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల్లో శర్మ మోనోగ్రాఫ్‌ను ప్రచురించారు.

1997లో వీరి స్మారకంగా మాజీ మంత్రి, ఎంపీ పి.రాములు అధ్యక్షతన గుండూరు గ్రామప్రజలు 'గంగాపురం హనుమచ్ఛర్మ స్మారక సమితి'గా ఏర్పడి ఆయనపై స్మారక సంచికను ముద్రించారు. ఇందులో ముద్రిత కావ్యం దుందుభితో పాటు ఆయన ఖండికలు, బహుముఖ ప్రజ్ఞావిశేషాలు, సమాజ సేవ, మిత్రుల వ్యాసాలు, కల్వకుర్తి ప్రాంత చరిత్ర మొదలైనవి వేశారు. మహబూబునగర్ జిల్లాలో ఒక కవిపై వచ్చిన మొట్టమొదటి స్మారక సంచిక ఇదే.

ఋగ్వేద విజ్ఞానం గ్రంథాన్ని శర్మ తన చిన్నాన్న గంగాపురం నృసింహ దీక్షితులుతో కలిసి 1967లో రచించారు. దీన్ని సురవరం ప్రతాపరెడ్డి స్థాపించిన విజ్ఞానవర్ధనీ ప్రచురణల సంస్థ ముద్రించింది. హనుమచ్ఛర్మ కేవలం సాహిత్య రంగానికే పరిమితమై ఉండి ఉంటే మరికొన్ని రసవద్రచనలను అందించగలిగేవారు. చిన్ననాటి నుంచి ఉద్యమాలు, ప్రజాసేవ పట్ల ఉన్న ఆసక్తి కారణంగా సాహిత్యంపై ఎక్కువ దృష్టి నిలపలేకపోయారు. శర్మ ఏర్పాటుచేసిన పాఠశాలలో చదివిన ఎందరో నేడు ఉన్నత పదవుల్లో ఉన్నారు. ఆయన ప్రభావంతో ఎందరో స్వచ్ఛంద కార్యకర్తలు తయారై గ్రామ స్వరాజ్యసిద్ధికి కృషిచేశారు.

కల్వకుర్తిలో బాపూజీ గాంధీ హాస్టల్ సురభి శర్మ, మంద లింగారెడ్డి, నామముత్యాలుతో కలిసి నిర్వహించారు. ఆ రోజుల్లో ఇప్పటి లాగా ప్రభుత్వం హాస్టళ్లను నిర్వహించేది కాదు. ప్రభుత్వం నుంచి ఎప్పుడో కొంత గ్రాంట్ అందేది. అది సరిపోయేది కాదు. దాని కోసం విరాళాలు సేకరించి హాస్టల్ నడిపేవారు. దానితో పాటు అదే హాస్టల్‌లో ఆయన స్వచ్ఛంద ఉపాధ్యాయునిగా కూడా పనిచేశారు. శర్మ దుందుభి కావ్యకర్తగానే గాక ఈ విధంగా సార్వజనీన కార్యక్రమాల ద్వారా సుప్రసిద్ధులయ్యారు. ఆయనలో ఉన్న జాతీయ భావన, స్వతంత్రతా జీవన సరళి చివరి వరకు చెక్కు చెదరలేదు. 1996 ఆగష్టు 15న పరమపదించారు.



శివరాం శర్మ
89772 43484

వ్యాసకర్త: కార్యదర్శి, గంగాపురం హనుమచ్ఛర్మ స్మారక సమితి


కిరణ్ వరికిల్ల

బుల్డోజర్ మీద ఒక కల నీటిచుక్క

విధ్వంసం తర్వాత గల్లీలోని మనుషులు
ఎక్కడికి నడిచిపోయారో ఆ అడుగులు కనపడవు
మట్టిపెళ్లల మధ్య కొద్దిసేపు ఏడ్చి
భుజం మీద బిడ్డ
నెత్తి మీద జీవితాన్ని నడిపించే
పొయ్యిని పెట్టుకొని కదిలిపోతుంటే
ఇంటి పడుచు కమిలిన ముఖంతో
సొట్టలు పడ్డ బిందెను రొండి మీద పెట్టుకొని
భర్త వెంట కూలిన ఇంటి
ఆనవాళ్ల నీడలను దాటిపోతుంది

ఇంటి కల బుసలుకొట్టే అప్పుతో తీరినట్టే
అనుకున్నా ఈఎంఐ వెంటాడేది అప్పుడు
ఇప్పుడు కన్నీళ్లను ఖాతాలో జమ చేయగలమా
జ్ఞాపకాలను మనసులో దాచుకొని పోవచ్చు కానీ
ఆ కాసింత జాగని చాపలా చుట్టేసుకోలేము

అమ్మినవాళ్లు చెరువు నీళ్లలో చేపలాగా
ఎక్కడో జారుకుంటారు
కొన్నవాళ్లు రోడ్డు మీద ముక్కలైన
కలల దేహాలతో నిలబడతారు
జలాశయాలన్నీ జనాశ్రయాలు కాదు నిజమే
నేరం పొక్లెయినర్ పండ్లల్లో బందీ అవుతుంటే
హోదాలు పెంచుకున్న పెద్ద మనుషుల భవంతులు
నీటి అలల మీద పడవల్లా తేలిపోతుంటాయి
అక్కడిదాకా చేతులు సాగవు

వాళ్లు మీ నీడలను వెతుక్కుంటూ తప్పక వస్తారు
మరో కలని భరోసా ఇవ్వడానికి కాదు
ఆ రెండు ఓట్లు అడగడానికి




వేముగంటి మురళి
93922 56475

ఒకరి భాష ఒకరు నేర్చుకున్నారే కానీ, ఎదుటివారి భాషను అవమానపరచటం వంటి అనాగరిక చేష్టలు ఎవరూ చేయలేదు. అందుకే, తెలంగాణ వైవిధ్యాల ప్రపంచం అయింది మొదటినుంచీ. పరభాషల మీద ఇటువంటి గౌరవం చూపించబట్టే 15 భాషలు అనర్గళంగా మాట్లాడగలిగిన ఒక పీవీ నరసింహారావు, 5 భాషల్లో పాండిత్యం ఉన్న ఒక సదాశివ తెలంగాణలో మాత్రమే వెలిశారు. కానీ, ఆంధ్రవారు తెలంగాణ ప్రాంతానికి వచ్చినప్పటి నుంచీ వైవిధ్యాన్ని వైరుధ్యంగా మార్చారు. దానికీ ఒక బలమైన కారణం ఉంది. ఆంధ్ర ప్రాంతం భారతదేశం మొత్తాన్ని పరిపాలించిన ఇంగ్లిషువారి కింద నాలుగు వందల ఏండ్ల బానిసత్వాన్ని అనుభవించింది. పైగా వారికి రెండే భాషలు తెలుసు.

పాలకుల భాష, పాలితుల భాష

భాషా సమైక్యతే భావ సమైక్యత!-2

పాలకుల భాష, పాలితుల భాష. అంటే అధికార భాష, బానిసత్వ భాష. అందుకే వారికి రెండు వైవిధ్యాల మధ్య సమానత్వం ఉండాలన్న భావన ఉండదు. పై అధికారికి చెప్పులు కడుగుతారు, కిందవారిని కాళ్ల కింద అణచివేస్తారు. అటువంటి సంస్కృతి తెలంగాణలో లేదు. కాబట్టే, ఈ ప్రాంతంలో అన్ని భాషలు, సంస్కృతులు ఆదరణ పొందాయి. ఎంతోమంది తెలుగుతో పాటు సంస్కృతంలో పాండిత్యం ఉండి రచనలు చేసినవారు, మల్లినాథసూరి వంటి భాషా దిగ్గజాలు గౌరవం పొందారు. తన రచనలను ఆదరించిన ఒక ముస్లిం రాజుకి హిందూ కవి 'మల్కిభ రాముడు' అన్న బిరుదు ఇవ్వటం భాషా సంస్కారం ఉన్న తెలు గు నేలలోనే సాధ్యం!



దాదాపు ఒక శతాబ్ద కాలం ఒకరికి ఒకరు తెలిసి, అర్థ శతాబ్దం కలిసి ఒక రాష్ట్రంగా ఉన్న ఆంధ్ర, తెలంగాణవారికి పదాల, జాతీయాల విషయంలో వివాదాలు రావటం చూస్తున్నాం. ఒకసారి శాసనసభలో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి విపక్ష నేత చంద్రబాబుని 'తాట వలుస్తా' అన్నాడు. ఆంధ్ర, రాయలసీమ నేతలకు ఆ మాట తప్పనిపించలేదు, అది ఆ ప్రాంతాల్లో సహజంగా వాడే భాష గనుక. అదే ఉద్యమ సమయంలో కేసీఆర్ ఎవరినీ ఉద్దేశించి కాకుండా జనాంతికంగా 'నాలుక కోస్తారు' అనగానే ఆంధ్ర నాయకులలో ప్రకంపనలు మొదలయ్యాయి.

> **నిజానికి తెలంగాణలో చాలా సహజంగా వాడే పదం అది! నిష్పాక్షికంగా ఆలోచిస్తే నాలుక కోసినా మనిషి బతుకుతాడు, తాట (చర్మం) వలిస్తే బతుకుతాడా? తెలంగాణ జాతీయమే తక్కువ ప్రమాదకరం కదా! అయినా భాష అర్థం కానప్పుడు ఇలాగే సమస్యలు వస్తాయి. రెండూ వేరు భాషలు కదా!**

తెలంగాణ ప్రాంతంవారు ఆడపిల్లని పుట్టింటికి 'తోలుకొస్తాం' అంటే ఆంధ్రావారు ఎక్కిరిస్తారు. 'మేం పశువులని మాత్రమే తోలుకొస్తాం, పుట్టింటికి ఆడపిల్లని 'తీసుకొస్తాం'' అని వేళాకోళం చేస్తారు. అది వింటే తెలంగాణ వారికి నవ్వు వస్తుంది. ఎందుకంటే ఈ ప్రాంతంలో ఒక శవాన్ని మాత్రమే 'తీసుకొస్తాం' అని వ్యవహరిస్తారు, బతికి ఉన్నవాళ్లని కాదు! దీనికి చక్కటి ఉదాహరణ 'ముత్యాల ముగ్గు' సినిమాలో ఉంది. 'సార్ రాయుడు వచ్చాడు' అని సెక్రెటరీ చెప్పగానే, విలన్ రావుగోపాలరావు అడుగుతాడు. 'వచ్చాడా, తీసుకొచ్చావా?' అని. అంటే బతికి ఉన్నాడా, లేడా? అని అర్థం అన్నమాట! అంటే ఒక్క పదం కూడా రెండు ప్రాంతాల వారి మధ్య చిచ్చుపెట్టగలిగినంత వేరు భాషలు తెలుగు, ఆంధ్రం! తెలంగాణవారి మారుమూల పల్లెల్లో ఉన్న భూములు కూడా ఆంధ్ర పెట్టుబడిదారులు, రాజకీయ నాయకులు కబ్జా చేయగలరేమో కానీ, శ్రీకాకుళం నుంచో, కడప నుంచో వెళ్లినవారికి తెలంగాణవారి స్వచ్ఛమైన తెలుగు భాష అర్థం చేసుకోవటం మాత్రం సాధ్యం కాదు. ఒకే అక్షరాలున్న ఇంగ్లిషు, ఫ్రెంచ్, జర్మన్ లాగే ఆంధ్రం, తెలుగు వర్ణమాల ఒకటే కలిగి ఉంటాయి. కానీ, పూర్తి వేరు భాషలు. 'వచ్చింది' అన్నది స్త్రీ లింగానికి వాడినప్పుడు 'వచ్చిండు' అన్నదే సరైనది కదా, 'వచ్చాడు' ఎక్కడినుంచి వచ్చిండు?' అని అడిగాడు ఒక తెలంగాణ భాషావేత్త ఒకసారి.

తెలుగు అన్న పదాన్ని మొట్టమొదటగా శంకరంబాడి సుందరాచారి అన్న కవి తన పాటలో లాలిత్యం కోసం తస్కరించి 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' సృష్టించాడు. అప్పుడు తెలుగువాళ్లంతా నిజాం ప్రభుత్వంలో (1942) వేరే దేశంగా ఉండటంతో వారికి ఈ భాషా కబ్జా సంగతి తెలియదు. 1956 తర్వాత ఆ మల్లెపూదండ నిజమైన తెలుగువారి మెడలో ఉరితాడై బిగిసింది. 1969 ఉద్యమం తర్వాత ఆంధ్ర రాజకీయ నాయకులకు తెలంగాణ విడిపోతుందనే భయం పట్టుకుంది. అందుకే ఎన్టీ రామారావు తన పార్టీకి 'తెలుగు దేశం' అని పేరు పెట్టుకున్నాడు తెలివిగా! నిజానికి ప్రస్తుతం ఆ పార్టీ తెలుగుదేశం కాదు, ఆంధ్రదేశం కాదు, చంద్రదేశం! ఎందుకంటే 9 ఏండ్లు రాష్ట్రం విడిపోయాక ఇంకో ఐదేండ్లు ముఖ్యమంత్రిత్వం వెలగబెట్టిన చంద్రబాబు నాయుడు ఆంధ్రకు, తెలంగాణకు ఎవరికీ ఏమీ మంచి చెయ్యలేదు. తొమ్మిదేండ్లలో హైదరాబాద్‌ను నిర్మించా నని డప్పు కొట్టుకునే ఆయన ఆంధ్ర ప్రాంతంలో అటువంటి ఇంకొక్క నగరాన్ని 14 ఏండ్లలో కూడా నిర్మించలేకపోయాడు.

ఈ భాషా వైవిధ్యాన్ని గౌరవించలేని ఆంధ్ర వారు వైరుధ్యాలు మాత్రం సృష్టించగలిగారు. భావ సమైక్యత సాధించలేనివారు ఇతర ప్రాంతాల్లో ఉండటానికి తగరు. రేపు అమెరికా ఎన్నికల్లో కమలా హ్యారిస్ గెలిస్తే, కాలిఫోర్నియా రాష్ట్రాన్ని ఆంధ్ర రాష్ట్రంగా ప్రకటించాలని అక్కడి ఆంధ్ర ఉద్యోగులు ధర్నాలు, నిరసనలు చేసినా ఆశ్చర్యం లేదు, చంద్రబాబును జైల్లో పెట్టినప్పుడు హైదరాబాద్‌లో అల్లర్లు సృష్టించినట్టు. తమవి కాని వేరే ప్రాంతాలకు వలసవెళ్లినవారు వినయంగా ఉండాలి కానీ, విజయులమని భ్రమపడకూడదు.



కనకదుర్గ దంటు
89772 43484

ప్రకటనలు

ఆవిష్కరణ

2024, సెప్టెంబర్ 29వ తేదీన ఆదివారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో కుడికాల వంశీధర్ రాసిన 'లోపలి వాన' కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరుగనున్నది. ముఖ్య అతిథిగా డాక్టర్ ఎన్.గోపి, విశిష్ట అతిథిగా డాక్టర్ ఎస్.రఘు హాజరుకానుండగా, ఆచార్య సూర్యా ధనుంజయ్ అధ్యక్షత వహించనున్నారు. డాక్టర్ గిన్నారపు ఆది నారాయణ, తదితరులు పాల్గొంటారు. అందరూ ఆహ్వానితులే.

- మద్దాళి రఘురాం

వార్షిక సాహిత్య సభలు

2024 అక్టోబర్ 6న ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతి సమావేశ మందిరంలో తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వార్షిక సాహిత్య సభలు జరగనున్నాయి. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రారంభ సమావేశం, మధ్యాహ్నం 2-3.30 గంటల వరకు సాహిత్య సదస్సు, మధ్యాహ్నం 3.30-4.30 గంటల వరకు పుస్తకావిష్కరణలు, సాయంత్రం 4.30-5.30 వరకు కవి సమ్మేళనం జరగనున్నాయి.

తగ్గిన ఆదాయం.. పెరిగిన ఖర్చులు

- ఐదు నెలల్లో రాష్ట్ర ఆర్థికం అస్తవ్యస్తం
- హైడ్రా భయంతో భారీగా తగ్గుదల
- మొత్తం వసూళ్లు రూ.91,085.54 కోట్లు
- మొత్తం వ్యయం రూ.85,467.75 కోట్లు
- కాగ్ నెలవారీ నివేదికల గణాంకాల్లో వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి ఐదు నెలల్లో తెలంగాణ ఆర్థిక పరిస్థితి తీవ్ర సంక్షోభానికి గురైంది. పన్నుల ఆదాయం తగ్గడంతోపాటు ఖర్చులు పెరగడంతో ఆర్థిక వ్యవస్థ అష్టకష్టాలను ఎదుర్కొంటున్నది. వాస్తవ ఆదాయాలు 27.85 శాతం ఉండగా, ఆదాయ ఖర్చులు రూ.34.91 శాతానికి పెరిగాయి. 2024 ఆగస్టు నెల కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక ఆధారంగా.. రాష్ట్రం మొత్తం ఆదాయం రూ.91,085.54 కోట్లు కాగా, మొత్తం ఖర్చులు 85,467.75 కోట్లుగా నమోదయ్యాయి. రాష్ట్ర రెవెన్యూ రాబడులు రూ.61,618.60 కోట్లు, మూలధన వసూళ్లు రూ.29,466.94 కోట్లు వచ్చాయి. రెవెన్యూ వ్యయం రూ.77,140.22 కోట్లు, మూలధన వ్యయం మొత్తం రూ.8,327.53 కోట్లుగా అంచనా వేయబడింది. 2024 ఆగస్టు చివరి నాటికి రెవెన్యూ లోటు రూ.15,521.62 కోట్లకు చేరగా, ఆర్థిక లోటు రూ.29,449.94 కోట్లకు పెరిగింది. ఈ గణాంకాలు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సంక్షోభాన్ని సూచిస్తున్నాయి. రాష్ట్ర బడ్జెట్‌లో పేర్కొన్న వార్షిక లక్ష్యంలో ఐదు నెలల కాలానికి మొత్తం వసూళ్లు 33.24 శాతం కాగా, వ్యయం మాత్రం 33.59 శాతమని కాగ్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వార్షిక లక్ష్యంలో వాస్తవ రాబడులు 27.85 శాతం రాగా, వ్యయం 34.91 శాతంగా నమోదైంది. మూలధన వసూళ్ల లక్ష్యంలో 55.79 శాతానికి ఎగబాకగా, మూలధన వ్యయం 24.87 శాతం వద్ద తక్కువగా నమోదైంది.

ఖర్చులెక్కువ.. ఆదాయం తక్కువ

వడ్డీ చెల్లింపులు, ఉద్యోగుల జీతాలు, వేతనాలు, పెన్షన్లు, సబ్సిడీపై ఖర్చుల కారణంగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కచ్చిత వ్యయం వార్షిక అంచనాల కంటే గణనీయంగా పెరిగింది. వడ్డీ చెల్లింపులు రూ.10,497.52 కోట్లకు (వార్షిక అంచనాల్లో 59.21%) పెరిగాయి. వేతనాలు రూ.18,152.28 కోట్లకు (45.33%), పింఛన్లు రూ.7,165.65 కోట్లకు (61.55%) పెరిగాయి. రాష్ట్ర నికర రుణాలు, ఇతర రుణ బాధ్యతలు రూ.29,466.94 కోట్లకు (అంటే, వార్షిక అంచనాలలో 59.79%) పెరిగాయి. 2023 డిసెంబర్ నుంచి 2024 మార్చి వరకు గత ఆర్థిక సంవత్సరంలో నికర రుణాలు 11,438.04 కోట్లు కాగా, ప్రస్తుతం 2024-25లో తొలి ఐదు నెలల్లో నికర రుణాలు 29,499.94 కోట్లకు చేరడంతో మొత్తం రుణభారం రూ.40,887.98 కోట్లకు పెరిగింది.

బడ్జెట్ లక్ష్యాలను చేరుకోవడం అనుమానమే..

రాష్ట్రంపై రుణభారం పెరిగిన నేపథ్యంలో మిగిలిన ఆర్థిక సంవత్సరంలో ఆదాయ, ఖర్చుల లక్ష్యాలను చేరుకోవడం అనుమానం గోచరిస్తున్నది. ఎందుకంటే ఆదాయాలను పెంచుకోవడంతోపాటు ఖర్చులనూ తగ్గించుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే పెట్రోలియం ఉత్పత్తులు, మోటర్ వాహన పన్ను, స్టాంప్ డ్యూటీ, ఇతర పన్నులు భారీగానే ఉన్నాయి. వాటిని పెంచడం సాధ్యపడకపోవచ్చు. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు.. రాష్ట్ర ఆదాయంపై హైడ్రా ప్రతికూల ప్రభావం చూపుతున్నది. స్టాంప్స్, రిజిస్ట్రేషన్ పన్నుల ఆదాయాలు భారీగా తగ్గాయి.

2024లో ఐదు నెలల (ఏప్రిల్-ఆగస్టు) రాష్ట్ర ఆర్థిక పరిస్థితి

- **మొత్తం ఆదాయం:** 91,085.54 కోట్లు (వార్షిక లక్ష్యానికి 33.24%)
- **మొత్తం ఖర్చులు:** 85,467.75 కోట్లు (వార్షిక లక్ష్యానికి 33.59%)
- **ఆదాయ లోటు:** 15,521.62 కోట్లు
- **ఆర్థిక లోటు:** 29,449.94 కోట్లు
- నికర రుణాలు, ఇతర బాకీలు: 29,466.94 కోట్లు (వార్షిక అంచనాలకు 59.79%)
- **పన్ను ఆదాయాలు:** జీఎస్టీ, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు, వ్యాట్, రాష్ట్ర ఎక్సైజ్ డ్యూటీలు సహా పన్ను ఆదాయాలు రాష్ట్ర వార్షిక లక్ష్యానికి 35.11 శాతం తక్కువగా నమోదైంది.
- పన్నుయేతర ఆదాయాలు 4.12 శాతమే వసూలయ్యాయి. వార్షిక లక్ష్యం రూ.1,449.54 కోట్లకు వసూలైంది రూ.35,208.44 కోట్లు మాత్రమే.

'పొంగులేటి' డాటాపై ఈడీ విశ్లేషణ

ఐదు రకాల ఆర్థిక నేరాలపై లోతైన పరిశీలన

రెండ్రోజుల సోదాల్లో కీలక డాక్యుమెంట్లు, పలు దస్త్రాలు, డిజిటల్ సామగ్రి స్వాధీనం

- పట్టుబడిన డబ్బు ఎలా వచ్చింది? ఎక్కడికి వెళ్తున్నదన్న అంశాలపై ఆరా
- తనయుడి క్రిప్టో ఖాతాలు, లావాదేవీలపైనా దృష్టి
- 'లీకు వీరుల'ను పట్టుకునేందుకు ప్రత్యేక బృందం
- ఈడీ అధికారిక ప్రకటనపై సర్వత్రా ఆసక్తి



హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఆయన కుటుంబసభ్యులు, బంధువుల ఇండ్లలో రెండ్రోజులుగా ఢిల్లీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు జరిపిన సోదాల్లో మొత్తం ఐదు రకాల ఆర్థిక నేరాలు, రూ.వందల కోట్ల లావాదేవీలు, క్రిప్టో ఖాతాల వివరాలు వెలుగులోకి రావడంతోపాటు భారీగా డబ్బు, ఎన్నో కీలక డాక్యుమెంట్లు, డిజిటల్ సామగ్రి పట్టుబడినట్టు తెలుస్తున్నది. దీంతో వాటిపై అధికారులు లోతైన విశ్లేషణ చేస్తున్నారు. ఇంత భారీగా అక్రమ లావాదేవీలు ఎలా జరిగాయి? ఎందుకు జరిగాయి? పట్టుబడిన డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? ఎక్కడికి తరలించబోతున్నారన్న వివరాలతోపాటు ఎగ్జిమ్ బ్యాంక్ గ్యారెంటీలు, పన్ను ఎగవేతలు, ప్రాజెక్టులకు నిధుల మళ్లింపు, వాచీల స్మగ్లింగ్, మనీలాండరింగ్ తదితర అంశాలపై ఈడీ అధికారులు ఆరా తీస్తున్నట్టు తెలిసింది.

ఆ లీకు వీరులు ఎవరు?

కేంద్ర రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగంలోని ఐఎఫ్‌యూతోపాటు చెన్నైలోని కస్టమ్స్, ఐటీ అధికారులు ఇచ్చిన పక్కా నివేదికల ఆధారంగా హైదరాబాద్‌లో సోదాలు నిర్వహించేందుకు ఢిల్లీ నుంచి ఈడీ బృందం రాబోతున్నదన్న విషయం ముందుగానే బయటకు పొక్కినట్టు తెలుస్తున్నది. గురువారం అర్ధరాత్రే ఈ సమాచారం లీక్ కావడంతో శుక్రవారం ఉదయమే మంత్రి పొంగులేటితోపాటు ఆయన కుటుంబసభ్యులు, బంధువుల ఇండ్లు, కార్యాలయాల నుంచి పలు కీలక ఫైళ్లను వేరేచోటికి తరలించినట్టు సమాచారం. దీంతో ఆయా ప్రాంతాల్లోని సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్న ఈడీ అధికారులు.. తమ సోదాల విషయాన్ని ముందుగానే లీక్ చేసినవారిపై కూడా దృష్టి సారించారు. ఆ లీకు వీరులను పట్టుకునేందుకు ఏకంగా ఓ ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దించినట్టు తెలిసింది.

మిస్సయిన కీలక ఫైళ్ల కోసం ఈడీ ఆరా

శుక్రవారం ఉదయం బంజారాహిల్స్‌లోని మంత్రి పొంగులేటి బంధువుల ఆఫీసుల నుంచి భారీ మొత్తంలో డబ్బుతోపాటు పలు కీలక ఫైళ్లు, అనేక దస్త్రాలు, సీపీయూలు, కంప్యూటర్ హార్డ్‌డిస్కులు, ఇతర డిజిటల్ సామగ్రిని రెండు ఇన్నోవా కార్లలో రహస్య ప్రాంతానికి తరలించినట్టు తెలుస్తున్నది. దీంతో వాటిని ఎక్కడికి తరలించారన్న దానిపై ఢిల్లీ ఈడీ అధికారులు దృష్టి సారించడంతోపాటు 'నమస్తే తెలంగాణ' ప్రచురించిన కథనాలపై హైదరాబాద్ ఈడీ అధికారులతో మాట్లాడినట్టు సమాచారం.

తనయుడి క్రిప్టో ఖాతాలపై నజర్

ఖరీదైన వాచ్‌ల స్మగ్లింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తనయుడు హర్షారెడ్డి క్రిప్టో ఖాతాలపై కూడా ఈడీ అధికారులు దృష్టిసారించినట్టు తెలిసింది. 'టెథర్' అనే క్రిప్టో వాలెట్ ద్వారా హర్షారెడ్డి భారీగా అక్రమ లావాదేవీలు జరిపినట్టు ఈడీ అధికారుల దృష్టికి రావడంతో అసలు ఆయనకు ఎన్ని రకాల క్రిప్టో అకౌంట్లు ఉన్నాయి? వాటి ద్వారా ఎన్ని లావాదేవీలు జరిగాయి? వాటిలో వాచీల స్మగ్లింగ్‌కు సంబంధించిన లావాదేవీలు ఎన్ని ఉన్నాయి?, ఈ లావాదేవీలకు స్థానిక క్రిప్టో హవాలా వ్యాపారులు ఎవరైనా సహకరించారా? అనే వివరాల కోసం కూపీ లాగుతున్నారు. కాగా, గత రెండ్రోజుల సోదాల్లో పట్టుబడిన డబ్బు, డాక్యుమెంట్లు, డిజిటల్ సామగ్రి, క్రిప్టో వ్యాలెట్ల వివరాలను ఈడీ అధికారులు సోమవారం లేదా మంగళవారం అధికారికంగా వెల్లడించనున్నట్టు తెలుస్తున్నది.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఎం రేవంత్, పీఏసీ చైర్మన్ గాంధీ

మహిళల ఆరోగ్య సంరక్షణకు కృషి: సీఎం రేవంత్ రెడ్డి

మాదాపూర్, సెప్టెంబర్ 29: మహిళల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆదివారం సుధారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'పింక్ పవర్ రన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రేవంత్‌రెడ్డి పీఏసీ చైర్మన్ ఆరికెపూడి గాంధీతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. మహిళల ఆరోగ్యం, సంక్షేమం కోసం రాష్ట్రంలో మరిన్ని దవాఖానాలు నిర్మిస్తామని చెప్పారు. పక్షి ఆకృతిలో అతిపెద్ద మానవహారంగా ఏర్పడిన వలంటీర్లను అభినందించారు. ఇందులో భాగంగా 2కే, 5కే, 10కే రన్ నిర్వహించగా విజేతలకు బహుమతులు అందజేశారు.

హర్యానా ఎన్నికలకు హైదరాబాద్ సొమ్ము!

- రూ.650 కోట్లు తరలించేందుకు రంగం సిద్ధం
- ఇప్పటికే హవాలా ద్వారా 100 కోట్లు తరలింపు
- కేంద్ర నిఘా వర్గాలకు ఇప్పటికే సమాచారం
- ఆ నేపథ్యంలోనే ఈడీ, ఐటీ, డీఆర్ఐ సోదాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (హైదరాబాద్): త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న హర్యానాకు తెలంగాణ నుంచి భారీగా నగదు తరలింపు జరుగుతున్నట్టు కేంద్ర నిఘా వర్గాలకు ఉప్పందింది. ఈ మేరకు రంగంలోకి దిగిన ఐటీ, ఈడీ, డీఆర్ఐ బృందాలు కొన్నిరోజులుగా అనుమానిత వ్యక్తులు, వారికి చెందిన సంస్థల్లో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నాయి. హైదరాబాద్ నుంచి మహారాష్ట్ర మీదుగా హర్యానాకు రూ.650 కోట్ల నగదు తరలింపునకు రంగం సిద్ధమైందని, ఇందులో ఇప్పటికే రూ.100 కోట్ల వరకు కొన్ని సూట్‌కేస్ కంపెనీలు, హవాలా వ్యాపారుల ద్వారా హర్యానాకు చేరవేశారని ఫైనాన్స్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ పసిగట్టినట్టు సమాచారం. పొరుగు రాష్ట్రంలోని ఓ ఎలక్ట్రికల్ లిస్టెడ్ కంపెనీ ప్రతినిధుల ద్వారా ఈ హవాలా డబ్బును సర్దుబాటు చేసినట్టు గుర్తించారని తెలిసింది.

10 ప్రాంతాల్లో రహస్యంగా సోదాలు

వచ్చే నెల 5వ తేదీన హర్యానాలో ఎన్నికలు ఉన్నాయి. ఆ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఓ జాతీయ పార్టీ కోసం తెలంగాణ ప్రభుత్వంలోని పలువురు పెద్దలు ఈ నిధులను సమీకరించారని, ఆ సొమ్మును హైదరాబాద్‌లోని పలుచోట్ల దాచి ఉంచారని, ఆ డబ్బును తరలించే బాధ్యతను ఒకరిద్దరు నేతలకు అప్పగించారని కేంద్ర నిఘావర్గాలకు సమాచారం అందింది. ఈ విషయం కేంద్ర నిఘా వర్గాల దృష్టికి రావడంతో ఆ సమాచారాన్ని ఈడీ, ఐటీ విభాగాలకు అందజేశారు. దీంతో ఆ రెండు విభాగాలకు చెందిన పలువురు అధికారులు రాష్ట్ర పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే దాడులు జరిపినట్టు తెలుస్తున్నది. హైదరాబాద్‌లో శుక్రవారం 8 చోట్ల, శనివారం మరో రెండు చోట్ల ఈ తనిఖీలు చేపట్టారు. అతిరహస్యంగా ఈ దాడులు సాగినట్టు తెలుస్తున్నది.

పొంగులేటిపై దాడులు నిఘా వర్గాల సమాచారంతోనేనా?

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఆయన కుటుంబసభ్యులు, బంధువుల ఇండ్లు, కార్యాలయాల్లో గత రెండ్రోజులపాటు జరిపిన సోదాలు కేంద్ర నిఘావర్గాల సమాచారం మేరకేనని భావిస్తున్నారు. అయితే సోదాల్లో ఏం గుర్తించారనేది ఈడీ బృందాలు ఇంతవరకు అధికారికంగా వెల్లడించలేదు. దీంతో పలురకాల అంశాలు విస్తృతంగా ప్రచారమవుతున్నాయి. ఈ సోదాల్లో 6 బ్యాగులతోపాటు 2 గోనె సంచుల్లో భారీగా డబ్బు పట్టుబడినట్టు జోరుగా ప్రచారం జరుగుతున్నది. అయితే, ఇదంతా బూటకపు ప్రచారమని, కాంగ్రెస్ పార్టీ అంతర్గత కుమ్ములాటల్లో భాగంగా మంత్రి పొంగులేటి పేరును బయటకు తీసుకొచ్చారన్న చర్చ కూడా రాజకీయ వర్గాల్లో సాగుతున్నది. కేంద్ర నిఘా వర్గాలు స్పష్టంగా వెల్లడిస్తే తప్ప, ఈ ఊహాగానాలకు తెరపడేలా కనిపించడం లేదు.

మా ఇండ్లే దొరికాయా... డబుల్ లబ్ధిదారుల ఆందోళన



ఆందోళన చేస్తున్న డబుల్ బెడ్రూం ఇండ్ల బాధితులను చెదరగొడుతున్న పోలీసులు

సైదాబాద్, సెప్టెంబర్ 29 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తమకు కేటాయించిన డబుల్ బెడ్రూం గృహాలను మూసి బాధితులకు కేటాయించడం ఎంత వరకు సమంజసమని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల మూసీ పరివాహక ప్రాంతంలో హైడ్రా కూల్చివేతలు చేపట్టగా, ప్రభుత్వం వారికి సైదాబాద్‌లోని పిల్లిగుడిసెల డబుల్‌బెడ్రూం గృహాలను కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. విషయాన్ని తెలుసుకున్న స్థానికులు ఆదివారం రాత్రి అక్కడికి చేరుకొని ఆందోళనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో కొత్తగా వచ్చిన వారి మధ్య గొడవ కాస్త ఉద్రిక్తతంగా మారడంతో మాదన్న పేట పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

కులగణన చేపట్టాల్సిందే

- ఆ తరువాతే వర్గీకరణ అమలుచేయాలి: వెంకటేశం



హైదరాబాద్, సెప్టెంబర్29 (నమస్తే తెలంగాణ): ముందుగా ఎస్సీ కులగణన చేపట్టాలని, ఆ తర్వాతే వర్గీకరణ అమలుచేయాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటివరకు ఎస్సీ రిజర్వేషన్ల ద్వారా ఎక్కువగా మాల, మాదిగలే లబ్ధిపొందారని, ఇతర వెనుకబడ్డ 57ఉపకులాలు తీవ్రంగా నష్టపోయాయని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న కులాలు, ఇప్పుడు తెలంగాణలో లేవని, ఎస్సీల సమగ్ర కులగణన నిర్వహిస్తేనే ఆయా కులాల ఆర్థిక, సామాజిక స్థితిగతులు తెలుస్తాయని తెలిపారు. ఇప్పటివరకు జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీలుగా గణిస్తున్నారే తప్ప.. ఉపకులాల వివరాలు, సామాజిక, ఆర్థిక స్థితిగతులకు ప్రాధాన్యమివ్వడం లేదని నొక్కిచెప్పారు. ప్రస్తుతం 2011 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం వర్గీకరణ అమలుకు సమాలోచనలు చేస్తుందనే వార్తలు వినిపిస్తున్నాయని, అదే నిజమైతే ఉపకులాలకు మరోసారి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

పోలీసుల పొట్టగొడుతున్న ప్రభుత్వం

- పెండింగ్‌లో 5 డీఏలు, సరెండర్లు, టీఏలు
- అతీగతీ లేని పీఆర్సీ ఏరియర్స్, జీపీఎఫ్, వైద్యబిల్లులు
- దవాఖానల్లో పనిచేయని ఆరోగ్య భద్రతా కార్డులు?
- ఒక్కో పోలీసుకు సర్కారు బాకీ రూ.3 లక్షలపైనే!
- ప్రమోషన్లకూ నోచని ఎందరో కానిస్టేబుళ్లు

యూసఫ్‌గూడ ఫస్ట్ బెటాలియన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఏఆర్ ఎస్సై జనార్దన్‌రావుకు మొన్న అర్ధరాత్రి 2 గంటలకు గుండెపోటు వచ్చింది. కుటుంబసభ్యులు సోమాజిగూడలోని ఓ ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ ఈసీజీ తీసి అడ్మిషన్ కోసం వివరాలు అడిగారు. కుటుంబసభ్యులు పోలీసు ఆరోగ్య భద్రతా కార్డు చూపడంతో వెంటనే ఇక్కడ బెడ్లు ఖాళీలేవు. ఎక్కడికైనా తీసుకెళ్లండని తెగేసి చెప్పారు. అప్పటికే మ్యాసివ్ స్ట్రోక్ రావడం, చేతిలో డబ్బుల్లేక, మరో చిన్నపాటి ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లారు. అప్పటికే సమయం మించిపోయి జనార్దన్ చనిపోయారు.

ఖమ్మం జిల్లాకు చెందిన ఆనందరావు (పేరు మార్చాం)కు 15 ఏండ్ల క్రితం కానిస్టేబుల్‌గా ఉద్యోగం వచ్చింది. నేటికీ కానిస్టేబుల్‌గానే విధుల్లో కొనసాగుతున్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన 5 డీఏలు, మూడు సరెండర్లు పెండింగ్‌లో ఉన్నాయి. పీఆర్సీ ఎరియర్స్ అతీగతీ లేదు. బ్యాంకు నుంచి రుణం తీసుకొని, కొంత అప్పుచేసి ఇల్లు పని మొదలుపెట్టాడు. ఇన్నాళ్లూ సలాం చేసిన చుట్టుపక్కల వాళ్లు ఆయన అప్పులభారం చూసి మర్యాద ఇవ్వడమే మానేశారు. పిల్లల చదువులు, వారి ఫీజులు, ఇంటి ఖర్చులకు తోడు సొంత డబ్బుతో బందోబస్తుకు వెళ్తుండటంతో బతుకే భారమైంది.

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): ఈ రెండు ఉదంతాలు రాష్ట్రంలోని ఏ ఒక్క జనార్దన్‌రావు, ఆనందరావు దుస్థితో కాదు.. తెలంగాణలోని 50 వేల మంది కానిస్టేబుళ్ల మానసిక వ్యథ. బయట చేయిచాచి అడుక్కోలేని పోలీసు అధికారులందరి దీనస్థితి. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే తమ బతుకులు మారుతాయని ఎంతో ఆశపడ్డారు. పెండింగ్ డీఏలు, టీఏలు, పీఆర్సీ ఎరియర్స్, సరెండర్లు, జీపీఎఫ్, మెడికల్ బిల్లుల చెల్లింపుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తాత్సారం చేస్తున్నది. దీంతో దీంతో అష్టకష్టాలు పడుతున్నారు. కానిస్టేబుల్ నుంచి పైస్థాయి అధికారి వరకూ రావాల్సిన 5 డీఏలు నేటికీ పెండింగ్‌లో ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభు త్వం కొన్నిచోట్ల ఒకట్రెండు సరెండర్లు విడుదల చేసినా.. ఉపయోగం లేకుండాపోయింది. ఓ జిల్లాలో 3,000 మంది సిబ్బంది ఉంటే.. కేవలం 30 నుంచి 40 మందికి మాత్రమే సరెండర్లు పడ్డాయి. మిగతవారు తమకెప్పుడు సరెండర్ నిధులు విడుదలవుతాయా అని వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. కొన్ని జిల్లాలకు ఆ ఒక్క సరెండర్ ఊసే లేదు. గత పీఆర్సీ ఆమోదించిన అడిషనల్ హెచ్ఎస్ఏ, రేషన్ అలవెన్స్, కిట్ మెయింటెనెన్స్, రిస్క్ అలవెన్స్, డ్రైవర్ అలవెన్స్, ట్రైనింగ్ సెంటర్స్ అలవెన్సు ఇలా చాలా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వాపోతున్నారు. కానిస్టేబుల్ నుంచి పైస్థాయి అధికారి వరకూ సగటున ఒక్కొక్కరికీ సుమారు రూ.3 లక్షల వరకు ప్రభుత్వం తమకు బాకీ ఉన్నదని ఆ ఉద్యోగ వర్గాల సమాచారం.

కష్టాల కడలిలో తప్పని ఎదురీత

పేరుకు పోలీసు ఉద్యోగమైనా ఏ ఒక్కరిని కదిలించినా కన్నీటి కష్టాలే చెప్పుకుంటున్నారు. ఒక్కో పోలీస్ అధికారికి సగటున ఒక సరెండర్ కింద సుమారు రూ.30 వేల నుంచి 50 వేలు రావాల్సి ఉంటుంది. సీనియార్టీ ఉంటే సుమారు రూ.70 వేల నుంచి రూ.80 వేల వరకు రావాల్సి ఉంటుంది. అవి ఎప్పుడో వస్తాయో తెలియదు. 2003 కంటే ముందు పోలీస్ ఉద్యోగానికి ఎంపికైన వారికి జీపీఎఫ్ కింద పిల్లల చదువులు, పెండ్లిళ్లు, ఇంటి ఖర్చు, ఆరోగ్య అవసరాలకు కోసం బిల్లులు పెట్టుకున్నా పట్టించుకునే దిక్కేలేదు. ఆరోగ్య భద్రత నుంచి దవాఖానలకు చెల్లించాల్సిన బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో పోలీసులకు చికిత్స చేయడానికి దవాఖానలు నిరాకరిస్తున్నాయి. సొంత డబ్బుతో బందోబస్తుకు వెళ్తే.. టీఏలు ఇవ్వని దుస్థితి. వీటికి తోడు పెరిగిన ధరలతో సగటు కానిస్టేబుల్ కుటుంబం నెల గడిపేందుకు తీవ్రంగా సతమతమవుతున్నది. ఎస్సై ర్యాంకు కంటే కింది స్థాయి వారిది దారుణమైన పరిస్థితి. దుర్భరమైన జీవితం అనుభవిస్తున్నామని కన్నీటి పర్యంతమవుతున్నారు.



బతుకమ్మ, దసరా పండుగలు జరుపుకునేది ఎట్లా?

కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులకు పెండింగ్ బిల్లులు చెల్లించకుండా కఠినంగా వ్యవహరిస్తుండటంతో పోలీస్ వర్గాలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నాయి. వచ్చే వేతనం నెలారంభంలోనే ఖర్చవుతుండటంతో మిగతా రోజులు గడిచేందుకు నానా అవస్థలు పడుతున్నామని ఎందరో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బతుకమ్మ, దసరా పండుగలను జరుపుకునేది ఎట్ల అని దీనంగా ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ సర్కార్.. మానవీయ కోణంలో పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని వారు కోరుతున్నారు. ఎప్పట్నుంచో పెండింగ్‌లో ఉన్న 'వారాంతపు సెలవు'ను మంజూరు చేయాలని, ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు కల్పించాలని, పోలీసు ఆరోగ్య భద్రతా కార్డుపై చికిత్సలు వెంటనే చేసేందుకు దవాఖానలకు ఆదేశాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే రోడ్డెక్కాల్సిన పరిస్థితి రావొచ్చని హెచ్చరిస్తున్నారు.

మంత్రి ఉత్తమ్‌కు పితృ వియోగం

- వృద్ధాప్యం, అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన పురుషోత్తంరెడ్డి
- భౌతికకాయానికి నివాళులర్పించిన మాజీ మంత్రి హరీశ్‌రావు



అనారోగ్యంతో మృతి చెందిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ)/మాదాపూర్: నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తండ్రి సలమడ పురుషోత్తంరెడ్డి(82) కన్నుమూశారు. వృద్ధాప్యంతోపాటు అనారోగ్య కారణాలతో కొంతకాలంగా బాధపడుతున్న ఆయన ఆదివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. భౌతికకాయాన్ని కొండాపూర్‌లోని సైబర్ మీడోస్‌లోని ఆయన కుమార్తె ఇంటికి తరలించారు. పురుషోత్తంరెడ్డి ఆర్‌సీపూర్‌లోని బీహెచ్ఈఎల్‌లో జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహించి రిటైర్డ్ అయ్యారు. సాయంత్రం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించారు. మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్, ఏపీ పీసీసీ చీఫ్ షర్మిలతోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ప్రముఖులు పురుషోత్తంరెడ్డి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు మహాప్రస్థానానికి చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని పరామర్శించారు.

కేటీఆర్ సంతాపం

రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి నలమాద పురుషోత్తమ్‌రెడ్డి మృతికి కేటీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించినట్టు పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు కేటీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



మెట్రో.. వంకర టింకర

మొదటిపేజీ తరువాయి...

ఉంటుందని చెప్పిన అధికారులు, దాన్ని 116 కి.మీ మేర పెంచినట్టు ప్రకటించారు. దాంతోపాటే రెండో దశ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.32,237 కోట్లు అవుతుందని పేర్కొన్నారు. అంతకు ముందు రెండో దశ మెట్రోకు రూ.20వేల కోట్లు అంచనా వేసిన అధికారులు, కొత్తగా ఫోర్త్ సిటీ మెట్రో కారిడార్‌తో కలిపి తాజా అంచనాలను రూ.32వేల కోట్లకు పెంచారు. ఇలా కాగితాల్లోనే మెట్రో రెండో దశ కారిడార్లు, వాటి అంచనాలు తారుమారవుతున్నాయే తప్ప క్షేత్ర స్థాయిలో పనులు నిర్వహించేందుకు అవసరమైన డీపీఆర్‌లు మాత్రం సిద్ధం కావడంలేదు. రెండోదశ డీపీఆర్‌ను జూన్ నాటికే తీసుకువస్తామని చెప్పిన రేవంత్ సర్కారు సెప్టెంబర్ గడుస్తున్నా ఇంకా సిద్ధం చేయించలేకపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్‌సిటీకి 40 కి.మీతో మెట్రో కారిడార్

ప్రస్తుతం హైదరాబాద్ మహానగరంలో కోర్ సిటీలోనే మెట్రో మార్గాలను పొడిగించాల్సిన అవసరం చాలా ఉంది. అయినా వాటన్నింటినీ పరిగణలోకి తీసుకోకుండా సీఎం రేవంత్ రెడ్డి కొత్తగా ప్రతిపాదిస్తున్న ఫోర్త్ సిటీకి మెట్రో కారిడార్‌ను నిర్మించాలని ప్రతిపాదించడంతో రెండో దశ డీపీఆర్‌ను రూపొందించడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. సుమారు 40 కి.మీ దూరంతో ఎయిర్‌పోర్టు నుంచి ఔటర్ రింగు రోడ్డు మీదుగా కొంగర కలాన్ ఇంటర్‌చేంజ్ వరకు అక్కడి నుంచి ఫోర్త్ సిటీలో శంకుస్థాపన చేసిన స్కిల్ యూనివర్సిటీ వరకు నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ రెండో దశ మెట్రో నిర్మాణాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో చేపడుతామని మెట్రో అధికారులు వెల్లడించారు.

బీసీ బంధు ఏమాయె?

కేసీఆర్ హయాంలో లక్ష ఆర్థిక సాయం

తొలి విడతలో 40 వేల మందికి పంపిణీ

- ఇంకా జాబితాలో 3.60 లక్షల అర్హులు
- అవన్నీ పక్కన పడేసిన కాంగ్రెస్ సర్కార్
- 4 వేల కోట్లతో అధికారుల ప్రతిపాదనలు
- కేటాయించిన బడ్జెట్ రూ.750 కోట్లే
- పైసా విడుదల చేయని ప్రభుత్వం
- ఎక్కడా కనిపించని యాక్షన్ ప్లాన్

హైదరాబాద్, సెప్టెంబర్4 (నమస్తే తెలంగాణ): కులవృత్తుల వారిని ఆదుకునేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలుచేసిన బీసీబంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించింది. మరేదైనా పథకం ద్వారా ఆదుకుంటుందా? అంటే అలాంటి ఊసే ఎత్తడం లేదు. కార్పొరేషన్ ద్వారా రుణాల పంపిణీకి దాదాపు రూ.4 వేల కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపగా, ప్రభుత్వం రూ.750 కోట్లు మాత్రమే కేటాయించింది. ఆ నిధులను కూడా విడుదల చేయలేదు. రాష్ట్రంలోని బీసీ కులవృత్తులు, చేతివృత్తుల బలోపేతానికి, వృత్తిదారులు ముడిసరుకులు, యంత్ర పరికరాల కొనుగోలుకు 100% సబ్సిడీతో రూ.లక్ష ఆర్థికసాయం అందించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ బంధు పథకాన్ని ప్రవేశపెట్టగా, 5,28,862 దరఖాస్తులు వచ్చాయి. అందులో 4.13 లక్షల మందికి అర్హులున్నట్టు గుర్తించారు. వీరిలో 40 వేల మంది కులవృత్తిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందజేసింది. మిగిలిన వారికి ప్రతి నెలా 15న ఆర్థికసాయం అందించాలని, అది నిరంతరం కొనసాగించాలని అప్పటి సర్కార్ నిర్ణయించింది. అయితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆయా దరఖాస్తులను పక్కనపెట్టినట్టు తెలిసింది. పథకానికి నిధుల విడుదల వద్దని అధికారులకు సూచించినట్టు సమాచారం.

4 వేల కోట్లతో ప్రతిపాదనలు

కాంగ్రెస్ ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు బీసీబంధు పథకాన్ని పూర్తిగా పక్కనపెట్టిన బీసీ సంక్షేమశాఖ ఉన్నతాధికారులు.. గతంలో మాదిరిగా 60, 70, 80% సబ్సిడీతో రుణాలు ఇవ్వాలని ప్రణాళికలు రూపొందించారు. గతంలో 2015, 2019లో బీసీ సంక్షేమశాఖ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులు స్వీకరించింది. అందులో 60% సబ్సిడీ రుణాల కోసం దాదాపు రెండు లక్షల మందికిపైగా, 70% సబ్సిడీ రుణాల కోసం 1.50 లక్షల మందికిపైగా, 80% సబ్సిడీ రుణాల కోసం లక్ష మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. అనివార్య కారణాలతో దరఖాస్తుదారులకు రుణాలను మంజూరు చేయలేదు. గతంలో వివిధ సబ్సిడీల కింద రుణాలకు దరఖాస్తు చేసుకున్నవారికే ప్రస్తుతం రుణాలను ఇచ్చేందుకు ప్రణాళికలను రూపొందించినట్టు తెలుస్తున్నది. బీసీ సంక్షేమశాఖ ఇటీవల బీసీ కార్పొరేషన్ కింద సబ్సిడీ రుణాల కోసం రూ.4వేల కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ప్రభుత్వం బడ్జెట్‌లో కేవలం రూ.750 కోట్లు కేటాయించింది. వాటిని కూడా విడుదల చేయకపోవడంతో ఏవిధంగా యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేయాలో తెలియక అధికారులు సతమతమవుతున్నారు. ప్రభుత్వం కేటాయించిన నిధులైనా విడుదల చేస్తుందా? అందులోనూ కోత పెడుతుందా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఎంతమందికి రుణాలు మంజూరు చేయాలనే అంశంపై తర్జనభర్జన పడుతున్నారు.

'బయోనిక్ ఐ'తో అంధులకు చూపు!

- ఆస్ట్రేలియా పరిశోధకుల అద్భుత ఘనత
- జంతువుల్లో విజయవంతమైన పరీక్షలు
- మనుషుల్లో సక్సెస్ అయితే అంధత్వానికి చెక్

మెల్‌బోర్న్, సెప్టెంబర్ 29: అంధులకు తిరిగి చూపు తెప్పించడంలో పరిశోధకులు కీలక ముందడుగు వేశారు. ఆస్ట్రేలియాలోని మోనాష్ విశ్వవిద్యాలయ పరిశోధకులు ప్రపంచంలోనే మొదటి 'బయానిక్ ఐ'ని అభివృద్ధి చేశారు. 'గెన్నరిస్ బయానిక్ విజన్ సిస్టమ్'గా పిలుస్తున్న ఈ సాంకేతికత జంతువుల్లో విజయవంతమైంది. మనుషుల్లో విజయవంతమైతే చూపును కోల్పోయిన కోట్లాది మంది తిరిగి తమ దృష్టిని పొందవచ్చు. చికిత్స లేని అంధత్వానికి పరిష్కారం చూపడంలో ఈ సాంకేతికత విప్లవాత్మకంగా మారనుంది. దశాబ్ద కాలంగా ఈ సాంకేతికతపై పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ అధునాతన వ్యవస్థ సాధారణంగా కంటి నుంచి మెదడుకు దృష్టి సమాచారాన్ని చేరవేసే నేత్ర నాడులను దాటి వెళ్లడం ద్వారా పని చేస్తుంది. ఇది నేరుగా మెదడులోని దృష్టి కేంద్రానికి సంకేతాలను పంపుతుంది. దీని వల్ల నిరుపయోగ దారుడు దృశ్యాలను చూడటానికి వీలవుతుంది. గొర్రెల్లో ఈ సాంకేతికతను ఉపయోగించినప్పుడు తక్కువ ప్రతికూల ఫలితాలు వచ్చాయి. ఇప్పుడు మెల్‌బోర్న్‌లో ఈ సాంకేతికతను మనుషులపై ప్రయోగిస్తున్నారు.




ఎలా పని చేస్తుంది?

వైర్‌లెస్ ట్రాన్స్‌మిటర్, కెమెరాతో కూడిన హెడ్‌గేర్(తలపై ధరించే పరికరం)ను రోగులు ధరించాలి. ఈ మొత్తం సిస్టమ్‌లో చిన్న 9 ఎంఎం ఇంప్లాంట్స్ ఉంటాయి. విజువల్ డాటాను రిసీవ్ చేసుకుని, విశ్లేషించేందుకు వీటిని మెదడులో అమర్చుతారు. ఈ సాంకేతికత ద్వారా చూపును తిరిగి తెప్పించడంతో పాటు నరాల సమస్యలకు పరిష్కారాలు కనుక్కోవాలని పరిశోధకులు ప్రయత్నిస్తున్నారు. మనిషి కన్ను అందించే 130 డిగ్రీల దృష్టి పరిధి కంటే కాస్త తక్కువగా ఈ కృత్రిమ కన్ను 100 డిగ్రీల వరకు దృష్టి పరిధిని అందిస్తుంది.

రాత్రి వేళల్లోనూ సౌరశక్తి ఉత్పత్తి

సరికొత్త డివైజ్‌ను రూపొందించిన ఆస్ట్రేలియా పరిశోధకులు

సిడ్నీ: సూర్యాస్తమయం తర్వాత సౌరశక్తి ఉత్పత్తిని సుసాధ్యం చేసేందుకు ఆస్ట్రేలియాలోని న్యూ సౌత్‌వేల్స్ యూనివర్సిటీ పరిశోధకులు ఓ మార్గాన్ని కనుగొన్నారు. రాత్రి వేళల్లో సైతం మన ఇండ్లకు శక్తిని అందించగలిగే సరికొత్త సాంకేతికతను అభివృద్ధి చేయడంతోపాటు ఆ టెక్నాలజీతో రూపొందించిన ఓ పరికరాన్ని పరీక్షించారు. ఈ డివైజ్ అంతరిక్షంలో కూడా ఉపయోగపడుతుందో లేదో అంచనా వేయాలని యోచిస్తున్నారు. థర్మోరేడియేటివ్ విద్యుత్తు ఉత్పత్తి సూత్రంతో పనిచేసే ఈ టెక్నాలజీలో భూమి ఉపరితలం నుంచి వెలువడే ఉష్ణోగ్రతకు, అంతరిక్షంలో ఉండే చల్లదనానికి మధ్య ఉండే వ్యత్యాసాన్ని ఉపయోగిస్తారు. వాస్తవానికి భూమితో పాటు అన్ని రకాల వస్తువుల నుంచి రాత్రి వేళల్లో సైతం ఇన్‌ఫ్రారెడ్ రేడియేషన్ వెలువడుతుంది. ఆ రేడియేషన్‌ను ఈ పరికరం ఒడిసిపట్టి విద్యుత్తుగా మారుస్తుంది. అందుకోసం ఈ డివైజ్‌లో ప్రధానమైన ఓ విడిభాగం ఉంటుంది. అదే సెమీకండక్టర్. రేడియంట్ హీట్‌ను (వికిరణ ఉష్ణాన్ని) ఉపయోగించుకొనేలా ప్రత్యేకంగా రూపొందించిన ఈ సెమీకండక్టర్ భూమి నుంచి పరారుణ కాంతి రూపంలో వెలువడే శక్తిని సంగ్రహించి విద్యుత్తుగా మారుస్తుంది. తద్వారా ఆ పరికరం రాత్రి వేళల్లో సైతం సౌరశక్తిని ఉత్పత్తి చేయగలుగుతుందని యూఎన్‌ఎస్‌డబ్ల్యూ పరిశోధకుల బృందం సారథి నెడ్ ఎకిన్స్ డ్యూక్స్ తెలిపారు.



హెజ్బొల్లాకు మరో షాక్

- ఇజ్రాయెల్ దాడిలో సెంట్రల్ కౌన్సిల్ డిప్యూటీ హెడ్ మృతి
- వారం రోజుల్లో ఏడుగురు టాప్ కమాండర్లు హతం
- ఇరాన్ గూఢచారి ఇచ్చిన సమాచారంతోనే నస్రల్లా హత్య
- హెజ్బొల్లా కొత్త అధిపతిగా హషీమ్ సఫీద్దీన్!

జెరుసలెం, సెప్టెంబర్ 29: లెబనాన్‌లో తీవ్రవాద సంస్థ హెజ్బొల్లాకు మరో భారీ షాక్ తగిలింది. ఇజ్రాయెల్ దాడిలో మరో కీలక నేత మృతిచెందాడు. శనివారం తాము జరిపిన దాడిలో హెజ్బొల్లా సెంట్రల్ కౌన్సిల్ డిప్యూటీ హెడ్ నబిల్ కౌక్ హతమైనట్టు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. హెజ్బొల్లా కూడా కౌక్ మృతిని ధ్రువీకరించింది. గత వారం రోజుల్లో ఇజ్రాయెల్ దాడిలో సంస్థ చీఫ్ నస్రల్లా సహా ఏడుగురు టాప్ కమాండర్లు మృతిచెందారు. అయితే ఆదివారం కూడా బీరుట్‌లో మరో లక్షిత దాడిని జరిపినట్టు ఇజ్రాయెల్ మిలటరీ ప్రకటించింది. అలాగే యెమెన్‌లోని హౌతీ స్థావరాలపైనా దాడులు చేసినట్టు తెలిపింది. ముఖ్యంగా హుదెయిడా పోర్టు సిటీలో పవర్ ప్లాంట్లు, సీపోర్టు లక్ష్యంగా వైమానిక దాడులు చేసినట్టు వెల్లడించింది.

నస్రల్లాను ఎలా హతమార్చారంటే?

హెజ్బొల్లా అధినేత హసన్ నస్రల్లాను లక్షిత దాడుల్లో ఇజ్రాయెల్ దళాలు చంపడం ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. ఒక ఇరానీ గూఢచారి ఇచ్చిన సమాచారాన్ని నిర్ధారించుకునే ఇజ్రాయెల్ వాయుసేన పక్కా ప్రణాళికతో అండర్ గ్రౌండ్ బంకర్‌లో ఉన్నప్పటికీ అతడిని హతమార్చినట్టు ఫ్రెంచ్ వార్తాపత్రిక లే పారిసియన్ తెలిపింది. బీరుట్‌లోని ఒక భవనంలో ఉపరితలానికి 60 అడుగుల కింద ఉన్న అండర్ గ్రౌండ్‌లో అగ్రనేతల సమావేశమవుతున్నట్టు ఇజ్రాయెల్‌కు సమాచారం వచ్చిందని ఆ పత్రిక తన కథనంలో పేర్కొంది. ఈ దాడిలో ఇజ్రాయెల్ వాయుసేన సుమారు 80 టన్నుల పేలుడు పదార్థాలతో పాటు బంకర్లను సమూలంగా ధ్వంసం చేసే 85 'బంకర్-బస్టర్' బాంబులు (ఒక్కొక్కటి 907 నుంచి 1814 కేజీల బరువు) వినియోగించింది. ఇవి అరమీటర్ కాంక్రీట్ లేదా 30 అడుగుల భూమిలోపలి వరకు పోయి విధ్వంసం సృష్టించగలవు. ఇంటెలిజెన్స్, మిలటరీ సమన్వయం చేసుకుంటూ ఆ రోజే 69 స్క్వాడ్రన్ వాయుసేన బృందం నస్రల్లాను హతమార్చే ఆపరేషన్‌ను విజయవంతంగా ముగించింది.



నస్రల్లా హత్యకు గురైన స్థలం సమీపంలోని భవనాల శిథిలాలను పరిశీలిస్తున్న స్థానికుడు

హెజ్బొల్లా చీఫ్‌గా హషీమ్ సఫీద్దీన్!

హెజ్బొల్లాకు 32 ఏండ్లుగా సారథ్యం వహిస్తూ వచ్చిన నస్రల్లా మరణంతో అతని వారసునిగా హషీమ్ సఫీద్దీన్‌ను ఎంపిక చేయవచ్చునని భావిస్తున్నారు. శుక్రవారం ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇతను కూడా నస్రల్లాతో మరణించినట్టు తొలుత వార్తలొచ్చాయి. అయితే తర్వాత అది నిజం కాదని నిర్ధారణ అయ్యింది. 1964లో జన్మించిన సఫీద్దీన్ మిలటరీ ఆపరేషన్లలో ఆరితేరిన వ్యక్తి. ఇస్లాం మత ప్రవక్త మహమ్మద్ సంతతిని సూచించేలా నల్లటి తలపాగాను ధరించి మత గురువుగా కన్పిస్తాడు. ప్రస్తుతం హెజ్బొల్లా రాజకీయ వ్యవహారాలు చూస్తూ జిహాద్ కౌన్సిల్ (గ్రూపుల సభ్యుడిగా ఉన్న సఫీద్దీన్.. నస్రల్లా కజిన్ కూడా. 2017లోనే ఇతడిని అమెరికా ఉగ్రవాదిగా ప్రకటించింది. నస్రల్లా కూడా ఇతనికి సంస్థలో వివిధ హోదాలు కట్టబెట్టి అతడిని నేతగా తయారు చేశారు. అతని భౌతికతీరు, ప్రవర్తన కూడా నస్రల్లాను పోలి ఉంటుంది. అతను తరచూ చేసే ప్రకటనలు పాలస్తీనా అనుకూల, హెజ్బొల్లా విధానాలను స్పష్టం చేసేవి. 2020లో వివాహమైన అతని కుమారుడు రిదా అదే ఏడాది బాగ్దాద్‌పై అమెరికా జరిపిన వాయుసేన దాడిలో మరణించాడు. 2006లో ఇజ్రాయెల్ దాడుల సందర్భంగా నస్రల్లా అజ్ఞాతంలోకి వెళ్లగా, సఫీద్దీన్ సంస్థ కార్యక్రమాలకు ప్రతినిధిగా హాజరయ్యేవాడు.



హషీమ్



నబిల్ కౌక్

పటిష్ఠ నిఘా వ్యవస్థ

నిఘా వ్యవస్థలు అందిస్తున్న కీలక సమాచారం లెబనాన్‌లో ఇజ్రాయెల్ లక్షిత దాడులకు ఎంతో ఉపయోగపడుతున్నట్టు న్యూయార్క్ టైమ్స్ కూడా పేర్కొంది. ఇజ్రాయెల్ ఇదంతా గత కొన్ని ఏండ్లుగా అమలు చేస్తున్న పక్కా ప్రణాళిక వల్లే సాధ్యమైంది. హెజ్బొల్లా వ్యూహాలు, నేతల కదలికలను ఎప్పటికప్పుడు నిఘా వర్గాల ద్వారా సేకరిస్తున్నది. ఇజ్రాయెల్ సిగ్నల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ 8200 ద్వారా అత్యాధునిక సైబర్ టూల్స్‌ను వినియోగిస్తూ హెజ్బొల్లా సెల్‌ఫోన్లు, దాని కమ్యూనికేషన్లను అంతరాయం కలిగిస్తూ ఉంది. వీరు తమకు వస్తున్న సమాచారాన్ని తక్షణం ఇజ్రాయెల్ ఆర్మీ, వాయుసేనకు పంపించేలా ఏర్పాట్లు చేసుకున్నారు.

100కుపైగా ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చేసిన రష్యా

కీవ్: రష్యాపైకి ఉక్రెయిన్ పెద్ద ఎత్తున డ్రోన్లను ప్రయోగించింది. వీటిలో 125 డ్రోన్లను రష్యా కూల్చేసింది. నైరుతి ప్రాంత వైన వోల్గోగ్రాడ్ ఒబ్లాస్ట్ ప్రయోగించిన 67 డ్రోన్లను రష్యన్ ఎయిర్ డిఫెన్స్ కూల్చేసినట్టు చెప్పింది. వొరొనెజ్ ప్రాంతంలో 17 డ్రోన్లను, రొస్టోవ్ రీజియన్‌లో 18 డ్రోన్లను కూల్చేసినట్టు తెలిపింది. ఇదిలావుండగా, ఉక్రెయిన్ నగరం జపొరిజ్జియాపై శనివారం రాత్రి జరిగిన దాడిలో 14 మంది సాధారణ పౌరులు గాయపడ్డారు. ఈ దాడుల వల్ల ఈ నగరంలో రవాణా వ్యవస్థ దెబ్బతిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు.

సిరియాపై అమెరికా దాడి

37 మంది ఉగ్రవాదుల మృతి

న్యూయార్క్, సెప్టెంబర్ 29: సిరియాపై అమెరికా జరిపిన దాడుల్లో 37 మంది మిలిటెంట్లు మరణించారు. సిరియా వాయువ్య ప్రాంతంలో ఉగ్రవాద ఇస్లామిక్ స్టేట్ గ్రూప్, అల్ ఖైదా అనుబంధ గ్రూపులు, వారితో సంబంధాలు ఉన్న మిలిటెంట్లపై మంగళవారం రెండు వేర్లు చోట్ల గగనతల దాడులు చేసినట్టు యూఎస్ సెంట్రల్ కమాండ్ ఆదివారం తెలిపింది. మృతులలో ఇద్దరు సీనియర్ మిలిటెంట్లు కూడా ఉన్నట్టు పేర్కొన్నది. అలాగే ఈ నెల 16న సెంట్రల్ సిరియాలోని మారుమూల అజ్ఞాత ప్రదేశంలో ఉన్న ఐఎస్ శిక్షణ శిబిరంపై పెద్దయెత్తున వైమానిక దాడులు చేసినట్టు తెలిపింది. ఆ దాడిలో నలుగురు సీనియర్ నేతలు సహా 28 మంది తీవ్రవాదులు మరణించినట్టు పేర్కొన్నది. తమ ప్రయోజనాలకు, అమెరికా మిత్రదేశాలు, భాగస్వాములకు వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహించే ఐసిస్‌ను అడ్డుకునేందుకే ఈ వాయుసేన దాడులు జరుపుతున్నామని యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలిపింది.



కుంభమేళాకు 992 ప్రత్యేక రైళ్లు

న్యూఢిల్లీ: వచ్చే జనవరిలో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరిగే కుంభమేళా భక్తుల కోసం రైల్వే ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నది. రైల్వే మంత్రిత్వ శాఖ అధికారి ఒకరు తెలిపిన వివరాల ప్రకారం, దేశంలోని వివిధ నగరాల నుంచి 6,580 రెగ్యులర్ రైళ్లతోపాటు అదనంగా 992 ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. మౌలిక సదుపాయాల ఆధునికీకరణ కోసం రూ.933 కోట్లు కేటాయించింది. ప్రయాగ్‌రాజ్ డివిజన్, దాని పరిసర ప్రాంతాల్లో రూ.3,700 కోట్లతో రైల్వే ట్రాక్‌ల డబ్లింగ్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

లింగ మార్పిడికి మానసిక ఆరోగ్య ధ్రువీకరణ తప్పనిసరి

కేంద్రం కొత్త నిబంధనలు

న్యూఢిల్లీ: ఇకపై ఇష్టానుసారం లింగ మార్పిడి చేయించుకోవడం కుదరదు. లింగమార్పిడి, ప్రీ-హార్మోనల్ థెరపీకి ముందు మానసిక ఆరోగ్య నిపుణుల నుంచి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను పొందాల్సి ఉంటుంది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ) విడుదల చేసింది. ఎవరైనా ట్రాన్స్‌జెండర్ 18 ఏండ్ల లోపు లింగ నిర్ధారిత సర్జరీ చేయించుకోవాల్సి ఉంటుంది. అంతకుముందు ఏడాదిపాటు ఎండోక్రైన్ చికిత్సపై స్థిరంగా ఉన్నట్టు సర్టిఫికెట్ తీసుకోవాలి. ఈ మేరకు గైనకాలజిస్టులు, సైకాలజిస్ట్/సైకియాట్రిస్టులు కూడా కొన్ని సూచనలు చేసింది. సర్జరీ తర్వాత ఆ వ్యక్తి ఎలా ఉండాలని కోరుకుంటున్నాడు, పేషెంట్ పేరు, సర్వనామం పరంగా ఎలా సంబోధించాలనుకుంటున్నాడు వంటివి అర్థం చేసుకోవాల్సి ఉంటుందని గైనకాలజిస్టులు సూచించింది. అలాగే, ఎండోక్రినాలజీ ఎక్సిపర్ట్ ముందు సైకియాట్రిస్ట్ నుంచి ఒక సర్టిఫికెట్, లింగ నిర్ధారణ సర్జరీకి ముందు క్లినికల్ సైకాలజిస్ట్/సైకియాట్రిస్ట్ నుంచి మరో సర్టిఫికెట్‌ను ట్రాన్స్‌జెండర్లు సమర్పించాల్సి ఉంటుంది. వీరు పేషెంట్ మానసిక ఆరోగ్యాన్ని పరీక్షించి సర్టిఫికెట్ అందజేస్తారు.



భారీ వర్షాల కారణంగా కాఠ్మాండూలో వరదలో చిక్కుకున్న ఓ ప్రాంతం

నేపాల్‌లో వరద విలయం

170 మందికి పైగా మృతి

కాఠ్మాండూ: నేపాల్‌లో వరదలు విలయం సృష్టించాయి. వీటికి తోడు కొండ చరియలు విరిగి పడటంతో దేశవ్యాప్తంగా మృతి చెందిన వారి సంఖ్య ఆదివారం నాటికి 170కి పెరిగింది. ఆకస్మిక వరదల కారణంగా శుక్రవారం నుంచి తూర్పు, మధ్య నేపాల్ ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. వరదలు, కొండ చరియలు విరిగి పడటం వల్ల 43 మంది గల్లంతయ్యారని, 111 మంది గాయపడ్డారని పోలీసు వర్గాలు తెలిపాయి. భద్రతా బలగాలు 3626 మందిని రక్షించాయి. గత 40-45 ఏండ్లలో ఇలాంటి వరదలను ఎప్పుడూ చూడలేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వరదల కారణంగా దేశంలోని చాలా ప్రాంతాల్లో జన జీవనం స్తంభించింది. చాలా హైవేలు, రోడ్లు దెబ్బతిన్నాయి. వందలాది ఇండ్లు, వంతెనలు భూ స్థాపితమయ్యాయి లేదా కొట్టుకుపోయాయి. వందలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి.

సునీతాను తీసుకొచ్చేందుకు స్పేస్‌ఎక్స్ క్రూ-9 ప్రయోగం

ఫ్లోరిడా, సెప్టెంబర్ 29: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్‌ఎస్)లో చిక్కుకుపోయిన ఇద్దరు వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్‌లు.. ఎట్టకేలకు తిరిగి రాబోతున్నారు. వారిని తీసుకొచ్చేందుకు స్పేస్-ఎక్స్ ప్రత్యేక మిషన్ చేపట్టింది. శనివారం ఫ్లోరిడాలోని కేప్ కెనవెరల్ నుంచి క్రూ-9 స్పేస్‌క్రాఫ్ట్‌ను అంతరిక్షంలోకి పంపింది. ఈ లాంచ్‌ప్యాడ్ నుంచి చేపట్టిన తొలి మానవ సహిత స్పేస్‌ఫ్లైట్ ఇదే. బోయింగ్ స్టార్‌లైనర్ ద్వారా సునీతా విలియమ్స్, విల్‌మోర్ ఐఎస్‌ఎస్‌కు చేరుకొన్నా, తిరుగు ప్రయాణంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో ఇద్దరు వ్యోమగాములు గత 100 రోజులుగా అక్కడే చిక్కుకుపోయారు. నాసా కమర్షియల్ క్రూ ప్రోగ్రాంలో భాగంగా స్పేస్-ఎక్స్ క్రూ-9 స్పేస్‌క్రాఫ్ట్‌ను పంపుతున్నది. ఫిబ్రవరి 2025లో స్పేస్‌క్రాఫ్ట్ తిరుగు ప్రయాణంలో ఇద్దరు వ్యోమగాములు భూమి మీదకు తీసుకొస్తారు.

ఐటీ ఉద్యోగి.. ఆఫీస్‌లోనే కుప్పకూలి!

కార్డియాక్ అరెస్ట్‌తో హఠాన్మరణం

ముంబై, సెప్టెంబర్ 29: కార్పొరేట్ కంపెనీల్లో ఎదురవుతున్న పని ఒత్తిడులు ఎంతోమంది ఉద్యోగుల జీవితాల్ని చిత్తు చేస్తున్నాయి. తాజాగా నాగ్‌పూర్‌లో ప్రఖ్యాత ఐటీ సంస్థలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి గుండెపోటుతో హఠాత్తుగా మరణించాడు. అతడికి భార్య, ఆరేండ్ల కుమారుడు ఉన్నారు. వాష్‌రూమ్‌కు వెళ్లిన అతడికి హఠాత్తుగా గుండెపోటు రావటంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడని ఐటీ సంస్థ అధికారులు ఆదివారం తెలిపారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి 7 గంటలకు జరిగిందన్నారు. మృతుడు నితిన్ ఎడ్విన్ మైఖెల్ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌లో ఓ సీనియర్ ఎనలిస్ట్‌గా పనిచేస్తున్నాడని పోలీసులు చెప్పారు. నాగ్‌పూర్ సిటీ మిహాన్ ప్రాంతంలోని హెచ్‌సీఎల్ కార్యాలయంలోని వాష్‌రూమ్‌లో అపస్మారక స్థితిలో పడివుండగా, సహచర ఉద్యోగులు గుర్తించి దవాఖానకు తరలించారని, అయితే అప్పటికే అతడు చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించినట్టు చెప్పారు.



1 నుంచి వచ్చే మార్పులివే

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29: పాన్, ఐటీ రిటర్న్స్, చిన్న మొత్తాల పొదుపు తదితర ముఖ్యమైన ఆర్థిక అంశాలకు సంబంధించి వచ్చే నెల 1 నుంచి కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. అవేంటో చూద్దాం..

- పాన్, ఐటీ రిటర్న్స్ - వ్యక్తుల పాన్ నెంబర్ కోసం, ఆదాయ పన్ను రిటర్న్స్ కోసం దరఖాస్తు చేసేటప్పుడు వారి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ఐడీని ఉపయోగించడాన్ని అనుమతించరు.
- బోనస్ షేర్లు - టీ+2 ట్రేడింగ్‌కు; వాటి క్రెడిట్, ట్రేడింగ్ తేదీకి, రికార్డ్ తేదీ మధ్య సమయాన్ని తగ్గించడానికి బోనస్ షేర్లు అర్హత పొందుతాయి.
- చిన్న మొత్తాల పొదుపు పథకాలు - తపాల కార్యాలయాల్లోని క్రమరహిత ఖాతాల వివరాలను క్రమబద్ధీకరణ కోసం ఆర్థిక శాఖకు నివేదించాలి. తాత, బామ్మలు సుకన్య సమృద్ధి యోజనను తమ మనవరాలి పేరున ప్రారంభిస్తే వాటిని సంరక్షకులు లేదా జన్మనిచ్చిన తల్లిదండ్రుల పేరున మార్చుకోవచ్చు. రెండు కంటే ఎక్కువ ఖాతాలను తెరిచి ఉంటే, అదనపు ఖాతాలను మూసివేస్తారు.
- సెక్యూరిటీ లావాదేవీల పన్ను(ఎస్‌టీటీ) - ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్ మీద ఎస్‌టీటీ పెరుగుతుంది.
- రైల్వే స్పెషల్ డ్రైవ్ - రద్దీ వారాల్లో టికెట్ లేని ప్రయాణికులను గుర్తించడానికి రైల్వే స్పెషల్ డ్రైవ్ చేపట్టనుంది.
- పోస్టాఫీస్ ఖాతాలు, పీపీఎఫ్ వడ్డీ రేట్లలో మార్పులు - మైనర్ల పీపీఎఫ్ ఖాతాలు, చిన్న మొత్తాల పొదుపు ఖాతాల వడ్డీ రేట్లలో మార్పులు ఉంటాయి.
- వివాద్ సే విశ్వాస్ అమలు - వివిధ కోర్టులు, అప్పిలేట్ అథారిటీల్లో పెండింగ్‌లో ఉన్న పన్ను చెల్లింపుదారుల వివాదాలు, అప్పీళ్లు, పిటిషన్లు సెటిల్ చేసుకొనేందుకు అవకాశం.
- ప్రమోషనల్ లింక్‌లు, ఎస్ఎంఎస్‌లు బ్లాక్ - ఆమోదం పొందని, ప్రమోషనల్ యూఆర్ఎల్‌లు, ఓటీటీ లింక్‌లు, ఏపీకేలను టెలికం ప్రొవైడర్లు బ్లాక్ చేయాల్సి ఉంటుంది.

బీర్ కోసం బిడ్డను అమ్మేశారు!


అమెరికాలో తల్లిదండ్రుల దారుణం

వాషింగ్టన్: బీరు, వెయ్యి డాలర్ల (సుమారు రూ.83 వేలు) డబ్బు కోసం అమెరికాలో ఓ జంట కన్నబిడ్డను విక్రయించేందుకు ప్రయత్నించింది. నిందితులను నార్త్ వెస్ట్ అర్కాన్సాస్‌కు చెందిన డేరియన్ ఉర్బన్, షలీన్ ఎహ్లర్స్‌గా గుర్తించిన పోలీసులు.. వారిద్దరినీ అరెస్ట్ చేశారు. మూడు నెలల పిల్లాడిని వారు బీరు, డబ్బు కోసం విక్రయిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. అయితే అధికారులు వచ్చేసరికి బిడ్డ తల్లిదండ్రులు అక్కడ లేరు. బిడ్డను అధికారులు దవాఖానకు తరలించారు. బిడ్డ తల్లిదండ్రులు విసిరించిన గుడారంలో వారు తమ బిడ్డను వెయ్యి డాలర్లకు అమ్మేయడానికి అంగీకరించిన లేఖను అధికారులు గుర్తించారు. తమ ఆలోచనలు మారాయని.. బిడ్డ కోసం సంప్రదించమని వారు అందులో పేర్కొన్నారు.

చైనా మహిళకు రెండు గర్భాశయాలు

రెండింటి ద్వారా శిశువుల జననం

న్యూఢిల్లీ: వైద్య చరిత్రలోనే ఇది అత్యంత అరుదైన ఘటన. మహిళ కడుపులో రెండు గర్భాశయాలు ఉండడమే వింతైతే.. రెండింటి ద్వారానూ పిల్లల్ని కనడం మరో వింత. చైనాలో సెప్టెంబర్‌లో జరిగింది ఈ ఘటన. వాయువ్య చైనాలోని షాంగ్జీ ప్రావిన్స్‌కు చెందిన మహిళ సెప్టెంబర్‌లో సిజేరియన్ ఆపరేషన్ ద్వారా బాబు, పాపకు జన్మనిచ్చింది. ఇందులో ఎలాంటి వింత లేకపోయినా.. ఆమెకు రెండు గర్భాశయాలు ఉండడం, ఒకేసారి రెండింటి ద్వారానూ ఆమె గర్భం దాల్చడం, ఒకేసారి కవలలకు జన్మనివ్వడం అత్యంత అరుదని వైద్యులు చెప్పారు. ప్రపంచంలో ఇలా 0.3 శాతం మాత్రమే జరుగుతుందని పేర్కొన్నారు. ఆమెలో పుట్టుకతోనే రెండు గర్భాశయాలు ఉన్నాయని, రెండూ పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాయని గుర్తించారు. సహజ పద్ధతిలో ఒకేసారి రెండు గర్భాశయాల ద్వారా ఆమె గర్భం దాల్చడం చాలా అరుదని, ఇప్పటి వరకు ఇలాంటివి రెండే రెండు జరిగాయని, అందులో చైనాలో ఇది మొదటిదని వివరించారు. ఎనిమిదిన్నర మాసాల గర్భంతో ఉండగా ఆమె ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చిందని, బాబు 3.3 కేజీలు, పాప 2.4 కేజీల బరువుతో ఆరోగ్యంగా ఉన్నారని, నాలుగు రోజుల అనంతరం దవాఖాన నుంచి డిశ్చార్జ్ చేసినట్టు తెలిపారు.




చక్కెర వ్యాధికి చెక్!

- మహిళలో టైప్-1 డయాబెటిస్ సంపూర్ణంగా నయం
- స్టెమ్ సెల్స్ థెరపీతో చైనా శాస్త్రవేత్తల అద్భుతం

బీజింగ్, సెప్టెంబర్ 29: ప్రపంచ జనాభాలో దాదాపు 10 శాతం మంది మధుమేహంతో బాధపడుతున్నారు. 2040 నాటికి ప్రతి ఎనిమిది మందిలో ఒకరు డయాబెటిస్ బారిన పడతారని తాజా అధ్యయనాలు అంచనావేస్తున్నాయి. మనదేశంలోనూ 7 కోట్ల మందికిపైగా చక్కెర వ్యాధి బాధితులు ఉన్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దీంతో మధుమేహాన్ని అంతమొందించేందుకు ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు. ఈ క్రమంలో చైనా శాస్త్రవేత్తలు గొప్ప విజయం సాధించారు. ఓ మహిళలో టైప్ 1 డయాబెటిస్‌ను సంపూర్ణంగా నయం చేశారు. స్టెమ్‌సెల్ థెరపీ ద్వారా పెకింగ్ వర్సిటీ మెడికల్ రిసెర్చ్ సెంటర్ పరిశోధకులు ఈ ఘనత సాధించారు. పరిశోధనలో పాల్గొన్న టియాన్‌జింగ్ నగరానికి చెందిన 25 ఏండ్ల మహిళ గత ఏడాదికాలంగా స్వేచ్ఛగా తీపి పదార్థాలు తింటున్నదని వైద్యులు తెలిపారు.

ఎలా సాధ్యమైంది?

ప్రపంచంలోనే తొలిసారిగా 59 ఏండ్ల వ్యక్తికి డయాబెటిస్‌ను పూర్తిగా నయం చేసినట్టు ఈ ఏడాది ఏప్రిల్‌లో చైనా శాస్త్రవేత్తలు ప్రకటించారు. సెల్ ట్రాన్స్‌ప్లాంట్ ద్వారా ఆయనకు వ్యాధిని నయం చేసినట్టు చెప్పారు. ఈ విధానంలో రోగి స్టెమ్‌సెల్స్‌ను ప్రత్యేక కెమికల్ కాక్‌టెయిల్ ద్వారా మార్పులు చేసి, వాటిని క్లోమంలో ప్రభావితమైన కణాల స్థానంలో ట్రాన్స్‌ప్లాంట్ చేస్తారు. ఈ కణాలు ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేస్తాయి. అయితే ఎంఆర్ఐ ద్వారా వీటిని పర్యవేక్షించేందుకు కష్టంగా ఉండేది. దీంతో కొత్త విధానంలో ఈ కణాలను పొత్తి కడుపు కింద, క్లోమగ్రంథికి దగ్గరగా ట్రాన్స్‌ప్లాంట్ చేశారు. దీంతో ఎంఆర్ఐ ద్వారా సులభంగా పర్యవేక్షించవచ్చని వైద్యులు తెలిపారు. ఈ విధానం ద్వారా 25 ఏండ్ల మహిళకు టైప్ 1 డయాబెటిస్‌ను పూర్తిగా రివర్స్ చేసినట్టు వెల్లడించారు. ఇది ఇతర రోగుల్లోనూ విజయవంతమైతే అద్భుతంగా ఉంటుందని డయాబెటిక్ పరిశోధకులు, క్యోటో యూనివర్సిటీకి చెందిన డైసుకే యాబే అభిప్రాయపడ్డారు.



పాక్‌లో ఆరు మంత్రిత్వ శాఖల మూసివేత!

ఇస్లామాబాద్: తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన పాకిస్థాన్ ఐఎంఎఫ్ షరతులకు అనుగుణంగా ఖర్చులు తగ్గించేందుకు పలు ఆర్థిక సంస్కరణలు ప్రారంభించింది. ఆరు మంత్రిత్వ శాఖలను మూసివేస్తున్నామని, మరో రెండింటిని విలీనం చేస్తున్నామని ప్రకటించింది. 1.5 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను రద్దు చేస్తున్నామని ఆదివారం వెల్లడించింది. ఐఎంఎఫ్‌తో సమావేశమైన ఆర్థిక శాఖ మంత్రి ఔరంగజేబు మీడియాతో మాట్లాడుతూ జీ-20 దేశాల్లో చేరేందుకు దేశ ఆర్థిక వ్యవస్థను క్రమబద్ధీకరించాల్సి ఉందని అన్నారు. ఐటీ ఫైలింగ్ చేయని వారి క్యాటగిరీని రద్దు చేస్తామని, పన్ను చెల్లించని వారు ఇక నుంచి ఆస్తులను కానీ, వాహనాలను కానీ కొనుగోలు చేయలేరని ఆయన చెప్పారు. పెరుగుతున్న ప్రభుత్వ చెల్లింపుల చర్యల వల్ల పన్ను చెల్లింపుదారుల సంఖ్య 16 లక్షల నుంచి 32 లక్షలకు పెరిగిందని చెప్పారు. త్వరలోనే ఐటీ ఫైలింగ్ చేయని వారి క్యాటగిరీని రద్దు చేస్తామని పేర్కొన్నారు.

జమిలిపై మూడు బిల్లులు!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29: జమిలి ఎన్నికల కోసం కేంద్ర ప్రభుత్వం రెండు రాజ్యాంగ సవరణ బిల్లులు, ఒక సాధారణ బిల్లును తీసుకురానుంది. ప్రతిపాదిత మొదటి రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభ, శాసనసభ ఎన్నికలను ఒకేసారి నిర్వహించడానికి సంబంధించింది. ఇందుకోసం 82ఎ, 83(2) అధికరణలకు సవరణలు చేయాల్సి ఉంటుంది. 327 అధికరణకు సవరణ చేసి 'ఏక కాల ఎన్నికలు' అనే పదాన్ని పొందుపరచాల్సి ఉంటుంది. రాష్ర్టాల వ్యవహారాలకు సంబంధించిన ప్రతిపాదిత రెండో రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలతో పాటు పురపాలిక, పంచాయతీలకు ఎన్నికల నిర్వహణకు అవసరమైన నిబంధనలకు సంబంధించినది. మూడో బిల్లు శాసనసభలు కలిగిన కేంద్ర పాలిత ప్రాంతాలకు ఇతర రాష్ర్టాల అసెంబ్లీలు, లోక్‌సభకు పేర్కొన్న విధంగానే నిబంధనలను సరి చేయడానికి సంబంధించినది.

సీపీఎం కోఆర్డినేటర్‌గా ప్రకాశ్ కారత్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29: సీపీఎం పొలిట్ బ్యూరో, కేంద్ర కమిటీ తాత్కాలిక సమన్వయకర్తగా పార్టీ సీనియర్ నేత ప్రకాశ్ కారత్ వ్యవహరించనున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 24న మదురైలో జరిగే పార్టీ సమావేశం వరకు ఆయనే కో-ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారని కేంద్ర కమిటీ ఆదివారం తెలిపింది. పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి ఈ నెల 12న మృతి చెందడంతో ఈ తాత్కాలిక నియామకాన్ని చేపడుతున్నట్టు ఢిల్లీలో సమావేశమైన కేంద్ర కమిటీ ప్రకటించింది. కాగా పార్టీలో సీనియర్ నేత అయిన ప్రకాశ్ కారత్ 2005 నుంచి 2015 వరకు పార్టీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు.

200 బిలియన్ డాలర్ల క్లబ్‌లో జుకర్‌బర్గ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29: మెటా ఫౌండర్, సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ సంపద మరింత పెరిగింది. గత రెండేండ్లుగా ఆయన నికర ఆదాయం ఆరురెట్లు పెరిగి 201 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఆయన కంపెనీ స్టాక్ విలువ అమాంతం పెరగడంతో ఆయన సంపద కూడా అదే స్థాయిలో పెరగడంతో ఆయన ఇప్పుడు ప్రపంచంలోని కుబేరుల జాబితాలో నాలుగో స్థానానికి చేరుకున్నారు. ఆయన కంటే ముందు ఎలాన్ మస్క్, జెఫ్ బెజోస్, బెర్నార్డ్ అర్నాల్ట్ ఉన్నారు. జుకర్‌బర్గ్ సంపద 200 బిలియన్ డాలర్ల మార్కుకు చేరుకోవడం ఇదే తొలిసారి. 2022లో ఒక దశలో ఆయన సంపద 40 బిలియన్ డాలర్ల వరకు కోల్పోయినా అనూహ్యంగా పుంజుకున్నారు.

ఐదేండ్ల బాలుడిపై గ్యాంగ్ రేప్

ఆగ్రా: ఐదేండ్ల బాలుడిపై ఇద్దరు వ్యక్తులు లైంగిక దాడి చేయడమే కాక, ఆ వీడియోను సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేసిన దారుణ ఘటన యూపీలో చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి లైంగిక దాడి చేసిన ఇద్దరు, దానిని వీడియో తీసిన మరో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నలుగురు నిందితులు పరారీలో ఉన్నారు. హపూర్‌లో ఈనెల 19న ఉదయం మూడు గంటలకు జాహిద్ అనే వ్యక్తి ఇంటి నుంచి తన మనవడిని ఒక నిర్జన ప్రదేశంలోకి తీసుకెళ్లాడు. అక్కడ అతడికి మరో ముగ్గురు కలిశారు, వారిలో ఇద్దరు బాలుడిపై లైంగిక దాడి చేయగా, మిగిలిన ఇద్దరూ దానిని వీడియో తీసి సామాజిక మాధ్యమంలో అప్‌లోడ్ చేసినట్టు బాధితుడి తాత పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పంజాబ్ సీఎం మాన్‌కు అరుదైన వ్యాధి

న్యూఢిల్లీ: పంజాబ్ సీఎం భగవంత్ మాన్ అత్యంత అరుదైన 'లెప్టోస్పైరోసిస్' అనే బ్యాక్టీరియా వ్యాధి బారినపడ్డారు. కుక్కలు, ఎలుకలు మొదలైనవాటి విసర్జితాల నుంచి ఈ బ్యాక్టీరియా మనుషులకు సోకుతుందని, కలుషిత ఆహారం, నీటితో ఈ బ్యాక్టీరియా సీఎం భగవంత్ మాన్‌కు సోకినట్టు భావిస్తున్నామని న్యూఢిల్లీలోని సర్ గంగారామ్ దవాఖాన వైద్యులు తెలిపారు. ఈ వ్యాధి సోకినవాళ్లలో అధిక జ్వరంతో కూడిన ఒళ్లు నొప్పులు, తలనొప్పి, వాంతులు, దగ్గు, డయేరియా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. రెండు వారాలపాటు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స తీసుకోవటం ద్వారా ఈ వ్యాధి తగ్గుతుందని అన్నారు.

రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తాం

తాసీల్దార్ల సమావేశంలో

: మంత్రి పొంగులేటి

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి పటిష్ట విధానాన్ని రూపొందిస్తున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రెవెన్యూ వ్యవస్థ పనితీరుపై తాసీల్దార్లు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. 33 జిల్లాల తాసీల్దార్లతో షామీర్‌పేటలోని నల్సార్ లా యూనివర్సిటీలో ఆదివారం ముఖాముఖి కార్యక్రమం ని ర్వహించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్తులను కాపాడే విషయంలో రెవెన్యూ యంత్రాంగం పనితీరు మరింత మెరుగుపడాలని, ఒక్క అంగుళం ప్రభుత్వ భూమి కూడా ఆక్రమణకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాసీల్దార్లపై కేసులు నమోదు చేయాలంటే ఇకపై ముందస్తుగా కలెక్టర్ల అనుమతి తీసుకోవాలని, ఆ దిశగా డీజీపీతో చర్చించి త్వరలోనే ఆదేశాలు జారీ చేస్తామని వెల్లడించారు. మౌలిక వసతుల కల్పన, బదిలీలు తదితర సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్, మేడ్చల్-మల్కాజ్‌గిరి కలెక్టర్ గౌతమ్‌పొత్రు, తాసీల్దార్లు పాల్గొన్నారు.

నక్సల్ డంప్‌లో టీవీ!

ఛత్తీస్‌గఢ్‌లో పోలీసుల స్వాధీనం

సుక్మా: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో పోలీసులు ఆదివారం ఓ నక్సల్ డంప్ నుంచి టెలివిజన్ సెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. బస్తర్ రేంజ్ పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్ సుందర్ రాజ్ మాట్లాడుతూ, దంతేష్ పురం సమీపంలోని అడవుల్లో భద్రతా దళాలు కూంబింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఇక్కడ ఉన్న డంప్‌లో బీపీఎల్ టీవీ సెట్ దొరికినట్లు చెప్పారు. టీవీ దొరకడం ఇదే మొదటిసారి అని చెప్పారు. ఈ డంప్ నుంచి మజిల్ లోడింగ్ గన్, టిఫిన్ బాక్స్ బాంబ్, ప్రెజర్ ఐఈడీ స్విచ్, 49 సిరంజ్‌లు, మొబైల్ చార్జర్లు, మావోయిస్టు బ్యానర్లు, సాహిత్యం, మందులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సర్కారు మాఫీ.. సర్వం మాయ!

- క్రాప్‌లోన్ ఫ్యామిలీ గ్రూపింగ్ పూర్తి
- 4.25 లక్షల కుటుంబాల ఎదురుచూపులు
- ఇంకా మిగిలిన 30 రకాల సాంకేతిక సమస్యలు
- 2 లక్షలపైన రుణాలపై తేల్చని ప్రభుత్వం
- వ్యవసాయ పంటరుణాలపై వీడని నీలినీడలు

కరీంనగర్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఆగస్టులోపే అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ వర్తింపజేస్తామని ఊదరగొట్టిన రేవంత్ సర్కారు..మూడు విడతల్లో 45 నుంచి 55 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేసింది. మిగిలిన రైతులు పోరుబాట పట్టడంతో క్రాప్‌లోన్ ఫ్యామిలీ గ్రూపింగ్‌కు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో 4.25 లక్షల మంది రైతు కుటుంబాల గ్రూపింగ్ పూర్తి చేసిన అధికారులు ఆ వివరాలను ప్రభుత్వానికి అప్‌లోడ్ చేశారు. గ్రూపింగ్ పూర్తయినా వీరికి మాఫీ ఎప్పుడు చేస్తారో ప్రభుత్వం స్పష్టతనివ్వడం లేదు. మరో 30 రకాల సాంకేతిక సమస్యలతో నిలిచిపోయిన రుణమాఫీకి సర్వే ఎప్పుడు చేయాలన్న అంశంపై ఇంకా ఆదేశాలు రాలేదు. రూ.2 లక్షలపైగా రుణం తీసుకున్నవారికి మాఫీ ఎలా చేయాలో అధికారులకు, బ్యాంకర్లకు నేటికీ స్పష్టతనివ్వలేదు. దీంతో రైతులు అధికారులు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సర్కారు రోజుకో కొత్త విషయాన్ని తెరపైకి తెస్తూ .. రుణమాఫీ అంశాన్ని పూర్తిగా డైవర్ట్ చేస్తున్నదని విమర్శలు వస్తున్నాయి.

4.25 లక్షల కుటుంబాల గ్రూపింగ్

రూ.2 లక్షల వరకు పంట రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీకి మొత్తం 22,37,848 ఖాతాల్లోకి రూ.17,933.19 కోట్ల నిధులను విడుదల చేసినట్టుగా ఆగస్టు 17న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించారు. రుణమాఫీ ప్రక్రియ పూర్తయినట్టుగానే మంత్రి చెప్పడంతో రాష్ట్రవ్యాప్తంగా రుణమాఫీ వర్తించని రైతులు భగ్గుమన్నారు. ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోలతో సర్కారు దిగొచ్చింది. రుణమాఫీకాని రైతుల ఇండ్ల వద్దకు నేరుగా వ్యవసాయ అధికారులు వచ్చి వివరాలు సేకరిస్తారని ప్రకటించింది. అంతలోనే మాట మార్చి రేషన్‌కార్డు సమస్యలతో రుణమాఫీకాని రైతులను సర్వే చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సమస్య 4.25లక్షల కుటుంబాల్లో ఉన్నదని పేర్కొన్నది. జిల్లాల వారీగా వ్యవసాయ అధికారులు రైతు కుటుంబాలను రైతు వేదికల వద్దకు పిలిపించి ప్రత్యేక యాప్‌లో క్రాప్‌లోన్ ఫ్యామిలీ గ్రూపింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. 4.25 లక్షల కుటుంబాల గ్రూపింగ్ పూర్తయింది కాబట్టి.. సదరు రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలి. కానీ, ప్రభుత్వం ఈ విషయంపై ఇంతవరకు స్పష్టత ఇవ్వలేదు.



జగిత్యాల జిల్లా మల్యాలలో రుణమాఫీ కాని రైతుల నుంచి ధ్రువీకరణ పత్రాలు స్వీకరిస్తున్న అధికారులు

మిగిలిన వాటిపైనా అస్పష్టత

ఆధార్‌లో అచ్చుతప్పులు, పట్టాదారు పాస్‌పుస్తకాలు లేక ఇబ్బందులు, ఆధార్‌కు, పట్టాదారు పాసుపుస్తకానికి అలాగే బ్యాంకులో ఉన్న ఖాతానంబర్, ఆధార్ నంబర్ మధ్య తేడా, ఇన్‌వాలిడ్ ఆధార్ నంబర్, నో డేటా ఫౌండ్, ఆధార్, రుణఖాతాల్లో వేర్వేరుగా ఉంటే ఆధార్ అప్‌లోడ్ చేయడం, ఆధార్ ఫ్యామిలీ గ్రూపింగ్ లేకపోవడం, పట్టాదారు పాసుపుస్తకాలు లేకపోవడం, ఆధార్‌తో బ్యాంకు లింకేజీ లేకపోవడం వంటి సాంకేతిక సమస్యలను సాకుగా చూపి ప్రభుత్వం రుణమాఫీ వర్తింపజేయలేదు. ఈ విషయాన్ని గుర్తించిన వ్యవసాయ శాఖ గతంలోనే ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఈ పరిస్థితుల్లో రేషన్‌కార్డు సంబంధిత సమస్యలపై గ్రూపింగ్ పూర్తి చేసిన సర్కారు.. మిగిలిన సమస్యలతో రుణమాఫీ పొందని వారికి సంబంధించి ఎప్పటి నుంచి వివరాలు సేకరిస్తుంది..? ఏ ఫార్మెట్‌లో చేస్తుందన్న దానిపై స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో సదరు రైతుల్లో అయోమయం నెలకొంది. అసలు.. మాఫీ చేస్తారా? చేయరా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

మీనమేషాలెందుకు?

రుణమాఫీకి కట్టుబడి ఉన్నట్టుగా చెపుతున్న సర్కారు.. 31 అంశాలతో రుణమాఫీ కాని రైతుల వివరాలను ఒకేసారి సేకరించి.. అందులో అర్హులను నిర్ధారిస్తే సరిపోయేది. కానీ, ప్రభుత్వం దీనిని సాగదీస్తున్నది. ఆగస్టులోపు రూ.2 లక్షల పంట రుణాలను పూర్తిస్థాయిలో మాఫీ చేస్తామని చెప్పిన సర్కారు... సర్వేలు, వివరాల సేకరణ పేరుతో కాలం దాటవేసే ప్రయత్నం చేస్తున్నది. ఒక్కో అంశం వారీగా సర్వేలు చేస్తే.. మరో ఏడాది పట్టినా.. రుణమాఫీ ప్రక్రియ పూర్తికాదన్న అభిప్రాయాలను అధికారులే వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి రుణమాఫీ చేయాలన్న లక్ష్యం ఉంటే.. వ్యవసాయశాఖాధికారులకు తోడు రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖలను అనుసంధానం చేసి.. వారం పది రోజుల్లో రుణమాఫీ కాని రైతుల పూర్తి వివరాలను సేకరించవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం అనుసరిస్తున్న దాటవేత, నాన్చివేత ధోరణి వల్ల లక్షలాది మంది రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

నెలదాటినా మాఫీ కాలె



రామన్నపేట గ్రామీణ బ్యాంకులో లక్షన్నర రుణం తీసుకున్న. రేషన్ కార్డులేదని రుణమాఫీ కాలేదన్నరు. ఆగస్టు 29న ఫొటోలు దిగి.. పత్రాలపై సంతకాలు చేసి ఇచ్చినం. నెలరోజులైనా ఏ స్పందన లేదు.

-ముస్కు గంగారెడ్డి, రైతు రాంపూర్, జగిత్యాల జిల్లా

మాకేమీ తెలియదంటున్నరు



నాకు, నా భార్య రమకు కలిపి పంట రుణం 1.99 లక్షల రుణం ఉంది. రేషన్ కార్డులేని కారణంగా రుణమాఫీ వర్తించలేదన్నరు. కుటుంబ సభ్యులతో ఫొటో దిగి ధ్రువీకరణ పత్రం ఇచ్చాం. ఇప్పటి వరకు.. అడుగు ముందుకు పడలే, ఎవరిని అడిగినా తెలియదంటున్నరు.

-కొమ్ముల కమలాకర్‌రెడ్డి, ముత్యంపేట గ్రామం, జగిత్యాల జిల్లా

'సెల్ఫీ'లతోనే సరిపెట్టేస్తారా?

- దమ్మపేట మండలంలో 3,300 మందికి కాని రుణమాఫీ
- 2,800 మందికి ఫ్యామిలీ గ్రూపింగ్.. 500 మంది పెండింగ్

దమ్మపేట, సెప్టెంబర్ 29: రుణమాఫీకాని రైతుల అర్హతను ఫ్యామిలీ గ్రూపింగ్ ద్వారా తేల్చుతామని వ్యవసాయ అధికారులు ఇంటింటికీ వెళ్లి సెల్ఫీలు దిగి ఆ ఫొటోను, రైతుల వివరాలను ప్రభుత్వ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఆగస్టు 15 తరువాత మొదలైన ఈ ప్రక్రియ రెండు నెలలు కావస్తున్నా రోజుల తరబడి కొనసాగుతూనే ఉంది. భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలాన్ని పరిశీలిస్తే.. మండలంలో సుమారు 11,300 మంది రైతులు రుణమాఫీకి అర్హులని ప్రభుత్వమే తేల్చింది. వీరిలో అనేక కారణాలు చెబుతూ సుమారు 3,300 మందికి రుణమాఫీకి దూరం చేసింది. రైతుల ఆందోళనల అనంతరం వారిలో 2,800 మంది రైతుల ఫ్యామిలీ గ్రూపింగ్ ప్రక్రియ పూర్తయింది. ఇంకా సుమారు 500 మంది రైతుల ఫ్యామిలీ గ్రూపింగ్‌ను నిర్ధారించి సెల్ఫీలు దిగాల్సి ఉంది. దీంతో 'సెల్ఫీలతోనే సరిపెట్టేస్తారా?' అంటూ అర్హులైన రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. 'మా అర్హత తేల్చేదెన్నడు? రుణమాఫీ చేసేదెప్పుడు? అంటూ నిట్టూరుస్తున్నారు.



రైతు ఫ్యామిలీతో సెల్ఫీ తీసుకుంటున్న భద్రాద్రి జిల్లా దమ్మపేట ఏవో చంద్రశేఖర్‌రెడ్డి

- దేవుడా.. ఈ ముఖ్యమంత్రిని మన్నించు



రుణమాఫీ అంశంపై మాట తప్పిన ముఖ్యమంత్రిని మన్నించాలంటూ భద్రాద్రి జిల్లా ఇల్లెందు మండల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం వినూత్న నిరసన తెలిపారు. ఇల్లెందు మండలంలోని ఒడ్డుగూడెంలోని హనుమాన్ ఆలయం వద్ద హనుమంతుడి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. 'రుణమాఫీ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నెరవేర్చలేదు. అటు రైతులను, ఇటు మిమ్ములను మోసం చేశారు. మీరే దయ చూపి ఆయన్ను క్షమించండి' అంటూ వేడుకున్నారు. – ఇల్లెందు రూరల్

రుణమాఫీ తర్వాతే రైతు భరోసా

మొదటిపేజీ తరువాయి...

ఈ రెండింటికీ ప్రభుత్వం లంకె పెట్టింది. రుణమాఫీ పూర్తి చేసిన తర్వాతే రైతుభరోసా గురించి ఆలోచిస్తామని స్వయంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఇటీవల ఖమ్మం పర్యటనలో 'రుణమాఫీకి రూ.18 వేల కోట్లు ఇచ్చినం. ఇంకా రూ. 13వేల కోట్లు ఇవ్వాల్సి ఉంది. అమౌంట్ సమకూరే వెసులుబాటు ఆధారంగా రైతులకు డేట్ ఇస్తాం. ఆ తర్వాత రైతులు మిగిలిన అమౌంట్ చెల్లించగానే రుణమాఫీ మొత్తం రైతుల ఖాతాలో వేస్తాం. ఇక ఇది(రుణమాఫీ) పూర్తయిన తర్వాత అది(రైతుభరోసా) వస్తది' అంటూ కుండబద్దలు కొట్టారు.

రుణమాఫీ పూర్తయ్యేదెప్పుడు?

రుణమాఫీతో రైతుభరోసాకు లింకు పెట్టడంపై సర్వత్రా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రుణమాఫీ పూర్తయ్యేదెప్పుడు... రైతుభరోసా ఇచ్చేదెప్పుడు అని రైతులు ప్రశ్నిస్తున్నారు. రుణమాఫీ పూర్తి చేసేందుకే ఇంకా రూ. 13 వేల కోట్లు కావాలి. 2 లక్షలకుపైగా రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం ఇంకా కుటుంబ నిర్ధారణ దశలోనే ఉన్నది. దీనికి ప్రత్యేకంగా గైడ్‌లైన్ జారీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికీ సడీసప్పుడు చేయడం లేదు. ఈ నేపథ్యంలో రూ.2 లక్షల రుణమాఫీ ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రుణమాఫీకి లింకు పెట్టిన రైతుభరోసా కూడా వచ్చే పరిస్థితిలేదనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతున్నది.



వారంలో కోతలు

పంటల సాగు సమయంలో ఇవ్వాల్సిన రైతుభరోసా పెట్టుబడి సాయం.. పంటలు కోతకొస్తున్నా అందకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో వారంలో కొన్ని జిల్లాల్లో వరి కోతలు మొదలుకానున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వంలో రైతుభరోసా పంపిణీపై కనీసం చర్చ జరగడంలేదని తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డిగానీ, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుగానీ రైతుభరోసాపై సమీక్ష కూడా చేయకపోవడం విమర్శలకు బలాన్నిస్తున్నది. పెట్టుబడి కోసం ప్రభుత్వం సాయం చేయకపోవడంతో రైతులు అప్పో సొప్పో చేసి పంటలు సాగు చేసుకున్నారు. మరో పది రోజుల్లో బతుకమ్మ, దసరా పండుగలు ఉన్నాయి. కనీసం ఈ సమయానికైనా ప్రభుత్వం రైతుభరోసా డబ్బులు వేస్తే రైతులు మళ్లీ అప్పు చేయకుండా ఉండే పరిస్థితి ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రైతుభరోసాకు కనీసం రూ. 11వేల కోట్లు కావాలి. కానీ రుణమాఫీకే అపసోపాలు పడుతున్న ప్రభుత్వం రైతు భరోసా ఇస్తుందనే నమ్మకం లేదని రైతులు చెబుతున్నారు.

సబ్సిడీ గ్యాస్..అంతా తూచ్

ఎనిమిది నెలలు గడుస్తున్నా అర్హులందరికీ అందని రూ. 500కే సిలిండర్ స్కీం

- రాష్ట్రవ్యాప్తంగా 64 లక్షల మంది లబ్ధిదారుల గుర్తింపు
- వర్తిస్తున్నది 44.6లక్షల మందికే
- మరో 20 లక్షల మందికి మొండిచెయ్యే



హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తేతెలంగాణ): అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ఆర్భాటంగా ప్రకటించిన రేవంత్ ప్రభుత్వం ఆచరణలో విఫలమవుతున్నది. ఇందుకు రూ.500కే సబ్సిడీ గ్యాస్ స్కీమే నిదర్శనంగా నిలుస్తున్నది. ఈ పథకం ప్రారంభమై ఎనిమిది నెలలు గడిచినా అర్హులందరికీ అందడంలేదు.

ఆరు గ్యారెంటీల్లో భాగంగా..

ప్రభుత్వం ఫిబ్రవరి 27న రూ. 500కే సిలిండర్ పథకానికి శ్రీకారం చుట్టింది. తెల్ల రేషన్ కార్డులు ఉన్నవారందరికీ వర్తింపజేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా ప్రకటించారు. ఎనిమిది నెలలు కావస్తున్నా ఈ హామీ ఆచరణకు నోచుకోలేదు. రాష్ట్రవ్యాప్తంగా 89.9లక్షల మందికి తెల్ల రేషన్‌కార్డుదారులు ఉండగా, 1.20 మందికి గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. సర్కారు నిబంధనల ప్రకారం 64లక్షల మంది లబ్ధిదారులను ఈ పథకానికి అర్హులుగా గుర్తించారు. అయితే ఈ స్కీం కోసం 58 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. సుమారు 5 లక్షల మంది మొదటి విడతలో అర్జీలు పెట్టలేకపోయారు. మొదట 39.9 లక్షల మందికి ఈ స్కీంను వర్తింపజేశారు. మళ్లీ దరఖాస్తులు స్వీకరించి ఆగస్టులో మరో 4.46లక్షల మంది లబ్ధిదారులను చేర్చారు. అంటే మొత్తంగా సుమారు 44.1లక్షల మందికే వర్తింపజేస్తున్నారు. మిగిలిన 20 లక్షల మంది గ్యాస్ సబ్సిడీ పథకం అందడంలేదు.

ఆర్థిక భారం తప్పించుకొనేందుకే కోత..

గ్యాస్ సబ్సిడీ పథకాన్ని అర్హులందరికీ వర్తింపజేసేందుకు ఏటా సుమారు రూ. 4వేల కోట్లు ఖర్చుచేయాల్సి వస్తుందని పౌరసరఫరాల శాఖ అధికారులు అంచనా వేశారు. అంటే ప్రతినెలా రూ.333కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది. అధికారంలోకి వచ్చేందుకు అడ్డగోలు హామీలిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంత మొత్తాన్ని వ్యయం చేసే పరిస్థితుల్లో లేదు. అంచనా వేసిన బడ్జెట్‌లో కేవలం సగం మాత్రమే ఖర్చు చేస్తున్నది. ఈ పరిస్థితుల్లో ఆర్థిక భారాన్ని తప్పించుకొనేందుకే గ్యాస్ సబ్సిడీ స్కీం లబ్ధిదారుల్లో కోతలు విధిస్తున్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక లబ్ధిదారులకు సబ్సిడీ నగదు రెండు రోజుల్లోనే జమయ్యేలా చూస్తామని సీఎం ప్రకటించారు. రెండు, మూడు నెలల పాటు ఆయిల్ కంపెనీలకు రాయితీ డబ్బులు ఇస్తామని, తర్వాత నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ చేస్తామని చెప్పారు. కానీ సిలిండర్ పొందిన వారం, పది రోజులకు గానీ నగదు ఖాతాల్లో పడడంలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. గ్యాస్ ఏజెన్సీలు, ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అటకెక్కిన వన మహోత్సవం

- హరితహారం పేరు మార్చిన ప్రభుత్వం
- 20.02 కోట్ల మొక్కలు నాటుతామని ప్రతిజ్ఞ
- ఆ తర్వాత 13 కోట్లకు లక్ష్యం కుదింపు
- అయినా ఇప్పటి వరకు నాటింది 5 కోట్లే
- అనుకూల వాతావరణం ఉన్నా అనాసక్తి



హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): హరితహారం కార్యక్రమం పేరు మార్చి దానికి వన మహోత్సవం అని పేరు పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు దానిని అటకెక్కించింది. పర్యావరణం, నదులు, ప్రకృతికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని గొప్పలు చెప్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నది. వన మహోత్సవంలో ఈ ఏడాది 20.02 కోట్ల మొక్కలు నాటుతామని ప్రకటించి ఆ తర్వాత లక్ష్యాన్ని 13 కోట్లకు కుదించింది. ఈ ఏడాది ఆశించిన దానికంటే అధిక వర్షాలు కురిసి మొక్కలు నాటేందుకు అనుకూలమైన వాతావరణం ఉన్నప్పటికీ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించకపోవడం విమర్శలకు తావిస్తున్నది. బీఆర్‌ఎస్ పాలనలో 9 విడతలు నిర్వహించిన హరితహారంలో దాదాపు 283 కోట్ల మొక్కలు నాటారు. పచ్చదనం-పరిశుభ్రతలో తెలంగాణ దేశానికి రోల్ మాడల్‌గా నిలిచింది. కాంగ్రెస్ ప్రభుత్వం జూన్ 9న హరితహారం పేరును 'వన మహోత్సవం'గా మార్చింది. మొదటి విడత జూలై 8న వన మహోత్సవాన్ని అధికారికంగా ప్రారంభించింది. అప్పటి నుంచి ఆదివారం వరకు రాష్ట్ర వ్యాప్తంగా 5 కోట్ల మొక్కలు కూడా నాటలేకపోయింది.

నిధులు కేటాయించకపోవడం వల్లే

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన హరితహారం కార్యక్రమానికి ప్రతి ఏటా ప్రత్యేకంగా నిధులు కేటాయించేది. నర్సరీలలో మొక్కలు పెంచడానికి, గుంతలు తవ్వడానికి, మొక్కలను గ్రామాల్లోకి సరఫరా చేయడానికి అవసరమయ్యే నిధులను కార్యక్రమానికి ముందు రోజే విడుదల చేసేది. ఈ నిధులతో రాష్ట్రవ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమానికి అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేసేవారు. కానీ ఈ ఏడాది వన మహోత్సవానికి అలాంటి ముందస్తు ప్రణాళిక, ఏర్పాట్లు లేకపోవడం, నిధులు కేటాయించకపోవడంతో క్షేత్రస్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా మొక్కలు నాటేందుకు ఆసక్తి చూపలేదు. కార్యక్రమ అమలు కోసం నిధులు విడుదల చేయాలని ప్రభుత్వానికి అటవీశాఖ ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు.

తగ్గిన ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యం

ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక ఏర్పాటు చేయకపోవడం, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల వన మహోత్సవం విఫలమైనట్టు అటవీశాఖ అధికారులు అంతర్గత చర్చల్లో అభిప్రాయపడుతున్నారు. గతంలో ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అటవీశాఖతో నిత్యం కార్యక్రమ అమలుపై పర్యవేక్షణ ఉండేదని, ఈ ఏడాది అలాంటి పర్యవేక్షణ లోపించడంతోనే వన మహోత్సవం ఆశించిన స్థాయిలో విజయవంతం కాలేదని అటవీశాఖ భావిస్తున్నది. దీనికితోడు క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యం చేయడానికి ప్రజాప్రతినిధులు ఆసక్తి చూపలేదని తెలిసింది.



సూపర్ లగ్జరీ ఎలక్ట్రిక్ బస్సులో ప్రయాణిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఆర్టీసీలో మూడు వేల ఉద్యోగాలు భర్తీ చేస్తాం

- డీజిల్ బస్సులను దశలవారీగా తొలగిస్తాం
- ఉద్యోగుల బకాయిలను దసరాలోగా బాండ్ల రూపంలో చెల్లిస్తాం: పొన్నం

కరీంనగర్ తెలంగాణచౌక్, సెప్టెంబర్ 29: ఆర్టీసీలో త్వరలో మూడు వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో రీజియన్‌కు కేటాయించిన 35 సూపర్ లగ్జరీ ఎలక్ట్రిక్ బస్సులను సంస్థ వైస్ చైర్మన్, ఎండీ సజ్జనార్, మానకొండూర్, చొప్పదండి, జగిత్యాల ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సంజయ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసి సభలో మంత్రి మాట్లాడారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల్లోకి తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నదని తెలిపారు. అందులో భాగంగా డీజిల్ భారాన్ని తగ్గించుకోవడంతో పాటు కాలుష్యనివారణకు 2,500 ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేయగా, వెయ్యి బస్సులు అందుబాటులోకి వచ్చినట్టు తెలిపారు. ఉద్యోగుల బకాయిలను దసరాలోగా బాండ్ల రూపంలో చెల్లిస్తామని పేర్కొన్నారు.

అమృత్‌పాల్ సింగ్ తండ్రి కొత్త రాజకీయ పార్టీ

అమృత్‌సర్: ఖలిస్థాన్ అనుకూల వాది అమృత్‌పాల్ సింగ్ తండ్రి తార్సెమ్ సింగ్ పంజాబ్‌లో ఓ రాజకీయ పార్టీని ఏర్పాటు చేయబోతున్నారు. ఆయన ఆదివారం స్వర్ణ దేవాలయంలో ప్రార్థనల అనంతరం ఈ విషయాన్ని వెల్లడించారు. అమృత్‌పాల్ పంజాబ్‌లోని ఖదూర్ సాహిబ్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. ఆయనపై జాతీయ భద్రత చట్టం ప్రకారం కేసు నమోదైంది. ఆయన ప్రస్తుతం అస్సాంలోని దిబ్రుగఢ్ జైలులో ఉన్నారు. పంజాబ్‌లో నాలుగు శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికలు త్వరలో జరుగుతాయి. ఈ తరుణంలో తార్సెమ్ ఈ ప్రకటన చేశారు.

అనాథల్లా అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లు!

- కడుపునిండా తిండికి నోచని బాలురు
- అరకొర వసతులు.. అధ్వాన పరిస్థితులు
- నాలుగు జిల్లాల్లో ప్రారంభమే కాని పాఠశాలలు



హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): అనాథలు, నిరాశ్రిత, విధివంచిత బాలురకు ఆశ్రయాన్నిస్తున్న అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లు (యూఆర్‌ఎస్) అనాథల్లా మారాయి. వీటిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఫలితంగా పాఠశాలల్లోని బాలురు కడుపునిండా తిండికి నోచడం లేదు. అక్కడి అరకొర వసతులు, అధ్వాన పరిస్థితులు కలవరపెడుతున్నాయి. బడిబయటి బాలురను బడిబాట పట్టించి వారి బంగారు భవితకు బాటలు వేయడానికి 2017లో జిల్లా కేంద్రాల్లో అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లను అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటుచేసింది. విధి వంచితులు, అనాథలు, బాల వలస కార్మికులు, నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన బాలుర కోసం వీటిని నెలకొల్పారు. బాలికలకు కేజీబీవీల లాంటివే బాలుర కోసం, పూర్తి రెసిడెన్షియల్ స్థాయిలో యుఆర్‌ఎస్‌లను ప్రారంభించారు. రాష్ట్రంలో 29 యూఆర్‌ఎస్‌లు ఉండగా, వీటిల్లో 2,500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరి కోసం 173 మంది సీఆర్టీలను నియమించారు. 84 కేజీబీవీల్లో ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేశారు. కానీ, యూఆర్‌ఎస్‌లను 8వ తరగతి వరకే నిర్వహిస్తున్నారు. ఒక్క యూఆర్‌ఎస్‌కు కూడా అప్‌గ్రేడ్ చేయలేదు. ములుగు, నారాయణపేట, మహబూబాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో కొత్త యూఆర్‌ఎస్‌లను ప్రారంభించాల్సి ఉండగా, ఇంతవరకు ఆరంభానికి నోచుకోలేదు.

రోజూ రూ.35 చొప్పున మెస్‌చార్జీ

అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లలోని ప్రతి విద్యార్థికి కేవలం నెలకు రూ.1,049.50, అంటే రోజూ రూ.35 చొప్పున చెల్లిస్తున్నారు. ఈ మెస్‌చార్జీలతో నాణ్యమైన భోజనం పిల్లలకు అందించలేకపోతున్నారు. 2022-23 విద్యా సంవత్సరం వరకు కేజీబీవీ విద్యార్థినులతో సమానంగా మెస్‌చార్జీలను చెల్లించేవారు. రానురాను కేజీబీవీ విద్యార్థినులకు రూ.1,225 ఇస్తుండగా అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్ల విద్యార్థులకు మాత్రం కేవలం రూ.1049.50తోనే సరిపెడుతున్నారు. రోజువారీ మెనూను రూపొందించనేలేదు. ఏరోజు ఏమి పెట్టాలో, ఎన్ని గ్రాములు ఇవ్వాలో సూచించనేలేదంటే ఈ స్కూళ్ల పట్ల అధికారులెంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

సొంత భవనాలు అసలే లేవు!

యూఆర్‌ఎస్‌లు ఏర్పాటై ఏడేండ్లు గడుస్తున్నా స్థల సేకరణ, సొంత భవనాలు లేకపోవడం గమనార్హం. ఖమ్మం మినహా మిగతా పాఠశాలలు అద్దె భవనాల్లో, పాతబడిన ప్రభుత్వ భవనాల్లో, అరకొర వసతుల మధ్యే కొనసాగుతున్నాయి. 13 సర్కారు బడుల ప్రాంగణాల్లో, 11 అద్దె భవనాల్లో, 5 ఇతర భవనాల్లో కొనసాగుతున్నాయి. ఏ ఒక్క పాఠశాలలో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, డార్మెటరీలు, వంటగది, భోజనశాలలు లేవు. విద్యార్థులకు ట్రంక్ పెట్టెలు, బెడ్ షీట్లు, దుప్పట్లు, ఇవ్వడమే లేదు. మంచినీటి కోసం ఆర్వో ప్లాంట్లు గానీ, చలికాలంలో విద్యార్థులకు వేడినీటి కోసం హీటర్లు గానీ ఇవ్వడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు సమీక్షించి, తగు వసతులు కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఇక నిమిషాల్లో సాయిల్ టెస్ట్ ఫలితాలు

- ఐఐటీ ఖరగ్‌పూర్‌తో కలిసి నూతన విధానాన్ని డెవలప్ చేసిన ఇక్రిశాట్
- 80 శాతం ఆక్యురసీతో మట్టి నాణ్యత వెల్లడి



హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ) : వ్యవసాయ రంగానికి అధునాతన సాంకేతికతను అందిస్తున్న ఇక్రిశాట్.. ఐఐటీ ఖరగ్‌పూర్‌తో కలిసి మరో వినూత్న టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. సాగు దిగుబడి, పంటల రోగ నిరోధకతను పెంచడంలో కీలకమైన మట్టిలోని పోషకాలను సమర్థవంతంగా గుర్తించే సులభమైన విధానాన్ని డెవలప్ చేసింది. అధునాతన టెక్నాలజీతో పనిచేస్తూ 80 శాతం కచ్చితమైన ఫలితాలను వెల్లడించే సాయిల్ టెస్ట్ మేనేజ్‌మెంట్ పేరిట ప్రత్యేక సాంకేతికతను డిజైన్ చేశారు. డిఫ్యూజ్ రిఫ్లెక్టెన్స్ స్పెక్ట్రోస్కోపీ(డీఆర్‌ఎస్)విధానంలో పనిచేస్తూ నిమిషాల్లోనే మట్టి నాణ్యత ఫలితాలను పొందవచ్చని, భూసారాన్ని బట్టి పంట రకాలను ఎంపిక చేసుకోవచ్చని చెప్తున్నారు.

అధునాతన టెక్నాలజీతో భూసార పరీక్షలు..

అధునాతన టెక్నాలజీతో సాయిల్ టెస్టింగ్ చేసేందుకు వీలుగా ప్రత్యేక ల్యాబోరేటరీని ఇక్రిశాట్‌లో ఏర్పాటుచేశారు. ఏకకాలంలో 250కి పైగా శాంపిళ్లను పరీక్షించేందుకు వీలుగా దీన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. దీని ద్వారా ప్రాథమిక మట్టి నాణ్యత, మట్టిలోని స్థూల, సూక్ష్మ పోషకాలను అంచనా వేసేందుకు 14 రకాల పరీక్షలను నిర్వహించవచ్చు. ప్లాస్మా ఆప్టికల్ విధానం ద్వారా మట్టి నాణ్యతను తెలుసుకునే వీలుంది. ఇప్పటివరకు ఈ ల్యాబొరేటరీ ద్వారా 2,86,449 మట్టి శాంపిళ్లను విశ్లేషణ చేయగా, 4.5 లక్షల పంటలను అధ్యయనం చేశారు. ప్రస్తుతం తెలంగాణతోపాటు దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి మట్టి నాణ్యత పరీక్షలు నిర్వహిస్తూ ఆయా ప్రాంతాల వాతావరణ, నీటి లభ్యత ఆధారంగా నేలకు అవసరమైన పోషకాలను సూచిస్తున్నారు.



మాట్లాడుతున్న విజయకుమార్‌రెడ్డి

తీన్మార్ మల్లన్నపై టీపీసీసీకి ఫిర్యాదు చేస్తాం

కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి

కల్వకుర్తి, సెప్టెంబర్ 29 : సీఎం రేవంత్‌రెడ్డిని నోటికొచ్చినట్టు దూషిస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీపీసీసీకి ఫిర్యాదు చేయనున్నట్టు నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన కల్వకుర్తిలో మీడియాతో మాట్లాడారు. ఇతర పార్టీల్లో ఇబ్బందులకు గురై, కేసుల పాలైన మల్లన్నను కాంగ్రెస్ పార్టీ అక్కున చేర్చుకొని ఎమ్మెల్సీ టికెట్ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఒక పార్టీలో ఉన్నప్పుడు ఎలా నడుచుకోవాలో తెలియకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సీఎం రేవంత్‌తోపాటు ఎమ్మెల్యే నారాయణరెడ్డిని చులకన చేసి మాట్లాడటం సరికాదని సూచించారు. తీన్మార్ మల్లన్నపై టీపీసీసీకి ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు.

దసరా, దీపావళికి 650 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : దసరా, దీపావళి నేపథ్యంలో తెలంగాణలోని సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజనల్ రైల్వే తోపాటు ఏపీలోని విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజనల్ రైల్వే ఆధ్వర్యంలో 650 రైళ్లు ఏర్పాటు చేసినట్టు అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైళ్లు నవంబర్ చివరకు వరకు నడుస్తాయని పేర్కొన్నారు.

తిరుమలలో మళ్లీ చిరుత కలకలం

సీసీటీవీలో రికార్డయిన దృశ్యాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ): తిరుమలలో చిరుత సంచారం మరోసారి కలకలం రేపింది. శ్రీవారిమెట్టు ప్రాంతంలోని కంట్రోల్ రూం వద్దకు రాత్రి చిరుత రావడంతో సెక్యూరిటీ సిబ్బంది భయంతో లోనికి వెళ్లి తాళాలు వేసుకున్నారు. వెంటనే అప్రమత్తమై అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. రెండు రోజులుగా రాత్రి 10 నుంచి ఉదయం 5గంటల సమయంలో చిరుత శ్రీవారి మెట్టు ప్రాంతంలో సంచరించినట్టు అటవీ అధికారులు గుర్తించారు.

విజయవాడకు ఈ-గరుడ బస్సులు

సోమవారం నుంచి అందుబాటులోకి

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ పటాన్‌చెరు-బీహెచ్‌ఈఎల్-రామచంద్రాపురం నుంచి విజయవాడ వెళ్లే ప్రయాణికులకు టీఎస్ఆర్టీసీ శుభవార్త చెప్పింది. బీహెచ్‌ఈఎల్ డిపో నుంచి ఓఆర్ఆర్ మీదుగా విజయవాడ వెళ్లేందుకు రెండు ఈ-గరుడ బస్సులను సోమవారం నుంచి అందుబాటులోకి తీసుకు వస్తున్నామని టీజీఎస్ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. ఈ బస్సులు రామచంద్రాపురం, నిజాంపేట్ క్రాస్‌రోడ్స్, జేఎన్టీయూ రైతుబజార్, శిల్పారామం, సైబరాబాద్ కమిషనరేట్, టెలికంనగర్ మీదుగా ఓఆర్ఆర్ నుంచి విజయవాడ వెళ్తాయని తెలిపారు. ప్రతి రోజూ రాత్రి 9.30, 10.30 గంటలకు రామచంద్రాపురం నుంచి బయల్దేరుతాయన్నారు.

ప్రతి గుడిలో జమ్మిచెట్టు నాటాలి

చిలుకూరు, స్కందగిరి ఆలయాల్లో మొక్కలు నాటిన పండితులు



చిలుకూరు ఆలయ ఆవరణలో మొక్క నాటుతున్న ప్రధాన అర్చకుడు రంగరాజన్ తదితరులు

హైదరాబాద్, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ): ప్రతి గుడి ఆవరణలో జమ్మి చెట్టును నాటాలని చిలుకూరు బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రధాన అర్చకులు రంగరాజన్, స్కంద సుబ్రహ్మణ్య స్వామి దేవాలయ పండితులు కోరారు. గ్రీన్‌ఇండియా ఛాలెంజ్ వ్యవస్థాపకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ ప్రారంభించిన 'గుడి గుడికో ఓ జమ్మి చెట్టు' కార్యక్రమంలో భాగంగా ఆదివారం సికింద్రాబాద్‌లోని స్కందగిరి సు బ్రహ్మణ్య స్వామి, చిలుకూరు బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయాల్లో జమ్మి చెట్టును నాటారు. కార్యక్రమంలో పవన్‌కుమార్, బీఆర్ఎస్ మొయినాబాద్ మండల జనరల్ సెక్రటరీ నర్సింహాగౌడ్, యూత్ వైస్ ప్రెసిడెంట్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో సీజేఐ డీవై చంద్రచూడ్

సీజేఐ కుటుంబ సభ్యులకు వేదాశీర్వచనం చేసిన అర్చకులు

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆదివారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి స్వాగతం పలికారు. రంగనాయకుల మండపంలో చీఫ్ జస్టిస్ దంపతులకు అర్చకులు వేదాశీర్వచనం చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సీవీఎస్వో శ్రీధర్, డిప్యూటీ ఈవో లోకనాథం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు స్వాగతం పలుకుతున్న టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి

'గాంధీ' కళాశాలకు విజయభారతి భౌతికకాయం

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 29: ప్రముఖ రచయిత్రి బోయి విజయభారతి (85) భౌతికకాయాన్ని ఆదివారం సికింద్రాబాద్‌లోని గాంధీ వైద్య కళాశాల అనాటమీ విభాగానికి అప్పగించారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆమె అమీర్‌పేట్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో శనివారం కన్నుమూశారు. విజయభారతి మృతికి మాజీ సీఎం కేసీఆర్ సంతాపం ప్రకటించారు. సాహిత్య, సామాజిక అధ్యయనశీలిగా ఆమె చేసిన కృషిని స్మరించుకున్నారు. విజయభారతి 1941లో తూర్పు గోదావరి జిల్లా రాజోలులో ప్రముఖ రచయిత, పద్మభూషణ్ దివంగత బోయి భీమన్న, నాగరత్నమ్మకు జన్మించారు. 1968లో మానవహక్కుల నేత, న్యాయవాది దివంగత బొజ్జా తారకంను వివాహం చేసుకున్నారు. ఆమె కుమారుడు రాహుల్ బొజ్జా ప్రస్తుతం తెలంగాణ ఐఏఎస్ కేడర్‌లో నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శిగా పని చేస్తున్నారు. విజయభారతి కోఠి ఉమెన్స్ కాలేజీలో పీజీ చదివారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా పనిచేశారు.




రచయిత్రి బోయి విజయభారతి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఝాన్సీ, ప్రొఫెసర్ సుధారాణి, డాక్టర్ దయాఅరుణ తదితరులు

పలువురి నివాళి..

ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, మహబూబ్‌నగర్ కలెక్టర్ బోయి విజయేంద్ర, సీనియర్ ఐఏఎస్‌లు దాన కిశోర్, కొప్పుల రాజు, ఆఫీసర్స్ ఫోరం కన్వీనర్ సిద్దోజీరావు, దళిత స్త్రీశక్తి కన్వీనర్ గెడ్డం ఝాన్సీ, పీవోడబ్ల్యూ సంధ్య, ప్రొఫెసర్ సుధారాణి, సీనియర్ జర్నలిస్ట్ బండారు రాజు, డాక్టర్ దయా అరుణ, టీపీసీసీ కార్యదర్శి దుర్గం భాస్కర్, డాక్టర్ కోయి కోటేశ్వర్‌రావు, ఏఐఎస్ఎఫ్ నేత స్టాలిన్, డాక్టర్ భూపెల్లి నారాయణతోపాటు అభ్యుదయవాదులు, దళిత సంఘాల నాయకులు, విజయభారతి పార్థివదేహానికి కుందన్‌బాగ్‌లోని రాహుల్ బొజ్జా నివాసంలో నివాళులర్పించారు.

బెర్లిన్ మారథాన్‌లో ఐజీ రమేశ్



హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): 50వ బెర్లిన్ మారథాన్‌లో హైదరాబాద్‌కు చెందిన ఐజీ రమేశ్ పాల్గొన్నారు. ఆదివారం నిర్వహించిన మారథాన్‌లో 42.195 కిలోమీటర్ల (26.2 మైళ్లు) దూరం పరుగును 5 గంటలు 40 నిమిషాల్లో చేరుకున్నట్టు ఐజీ రమేశ్ 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు.

బజ్జీలు ఉద్దెర ఇవ్వలేదని..

ముఖంపై వేడి నూనె చల్లిన దుండగుడు • ఇద్దరికి తీవ్ర గాయాలు

కేటీదొడ్డి, సెప్టెంబర్ 29 : బజ్జీలు ఉద్దెర ఇవ్వలేదని కడాయిలో ఉన్న వేడివేడి వంట నూనెను ముఖంపై చల్లగా.. ఇద్దరు గాయపడిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం గువ్వలదిన్నెలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాసులు కథనం మేరకు.. గువ్వలదిన్నెకు చెందిన బొజ్జప్ప గౌడ్ బజ్జీల దుకాణం నడుపుతున్నాడు. అదే గ్రామానికి చెందిన వినోద్ మద్యం తాగి బజ్జీలు ఉద్దెర ఇవ్వాలని గొడవ చేశాడు. ఉద్దెర ఇవ్వనని బొజ్జప్పగౌడ్ చెప్పడంతో వినోద్ కడాయిలోని వేడి నూనెను బొజ్జప్ప గౌడ్‌పై చల్లాడు. బొజ్జప్పతోపాటు పక్కనే ఉన్న వీరేశ్ ముఖంపై నూనె పడగా తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం కర్నూల్ దవాఖానకు తరలించారు. వీరేశ్ భార్య శంకరమ్మ ఫిర్యాదు మేరకు వినోద్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఈవో శ్యామలరావుతో సిట్ దర్యాప్తు బృందం భేటీ

తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంపై రెండోరోజు ఆదివారం సిట్ సభ్యులు తిరుపతి పోలీస్ అతిథిగృహంలో సమావేశమయ్యారు. డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఎస్పీ హర్షవర్ధన్ రాజు నేతృత్వంలో టీటీడీ బోర్డు దగ్గర నుంచి అధికారులు, సిబ్బంది పాత్ర వరకు అన్ని అంశాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టారు. టీటీడీ ఈవో శ్యామలరావుతో సిట్ చీఫ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి 45 నిమిషాలపాటు చర్చించారు. ఏఆర్ డెయిరీకి సంబంధించి పూర్తి వివరాలను టీటీడీ నుంచి తీసుకున్నారు. మరో రెండు రోజులపాటు ఈ విచారణ కొనసాగుతుందని త్రిపాఠి వెల్లడించారు.

లడ్డూ కల్తీ దోషుల్ని శిక్షించాలి

సినీనటుడు సుమన్

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : తిరుమల లడ్డూ కల్తీ అంశంపై టాలీవుడ్ హీరో సుమన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అనంతపురం జిల్లా గుంతకల్లులో జరిగిన ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న సుమన్ ఈ వివాదంపై స్పందించారు. ప్రస్తుతం సిట్ విచారణ జరుగుతోందని, లడ్డూ కల్తీ నిజమని తేలితే దోషుల్ని శిక్షించాలని టీటీడీ ముందు డిమాండ్ పెట్టారు. తిరుమల దర్శనానికి వెళ్లే వారి డిక్లరేషన్ అంశం వ్యక్తిగతంగా ఆలోచించుకోవాలని సూచించారు. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించారని ఆరోపించారు.

బీసీ రిజర్వేషన్ అమలు చేసేదాకా పోరాడుతాం

- కుల గణన చేపట్టకపోతే మళ్లీ దీక్ష చేస్తా
- బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ వెల్లడి

కరీంనగర్ విద్యానగర్, సెప్టెంబర్ 29 : కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి సభలో బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా పోరాడుతామని బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ స్పష్టం చేశారు. ఆదివారం కరీంనగర్‌లో పలు బీసీ సంఘాల నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హామీల అమలు విషయంలో ఎందుకు జాప్యం చేస్తున్నారో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏటా రూ.20 వేల కోట్ల బడ్జెట్ విడుదల చేస్తామని చెప్పి ఎందుకు మోసం చేశారని ప్రశ్నించారు. గత నెల 25న హైదర్‌గూడలోని కేంద్ర కార్యాలయంలో ఆమరణ దీక్ష చేపట్టిన తర్వాత పోలీసులు అరెస్ట్ చేసి అనేక ఇబ్బందులు పెట్టారని తెలిపారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన తర్వాత ఆమరణ దీక్ష విరమించినట్టు చెప్పారు. దీక్ష విరమించి 20 రోజులు గడుస్తున్నదని, వెంటనే ప్రక్రియ చేపట్టకపోతే మళ్లీ ఆమరణ దీక్షకు సిద్ధమని హెచ్చరించారు.

భద్రాద్రిలో 4 నుంచి శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

భద్రాచలం, సెప్టెంబర్ 29 : భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో వచ్చే నెల 4 నుంచి 12వ తేదీ వరకు శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. తొమ్మిది రోజులపాటు రోజుకో అలంకారంలో శ్రీలక్ష్మీతాయారు అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. 12న విజయదశమి సందర్భంగా భద్రాద్రి రామయ్యకు పట్టాభిషేకం, విజయోత్సవం, ఆయుధపూజ, శ్రీరామ లీలా మహోత్సవం నిర్వహిస్తారు. 17న శబరి స్మృతియాత్ర సైతం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆశ్వయుజ మాసంలో నిర్వహించే ఉత్సవాలకు సంబంధించిన నివేదికను ఆలయ ఈవో రమాదేవికి వైదిక బృందం అందజేశారు.

ఈడీ అదుపులో సాహితీ వెంచర్స్ లక్ష్మీనారాయణ

- ప్రీలాంచ్ పేరుతో 3వేల కోట్ల స్కామ్
- సీసీఎస్ పోలీసుల కేసుతో రంగంలోకి ఈడీ

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): సాహితీ ఇన్‌ఫ్రా టెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీనారాయణను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకున్నది. ప్రీ లాంచ్ పేరిట ఈ సంస్థ రూ.3వేల కోట్ల స్కామ్‌కు పాల్పడినట్టు తెలిసింది. సీసీఎస్ పోలీసులు ఈ సంస్థపై ఇప్పటికే 50 కేసులు నమోదు చేయగా, తొమ్మిది ప్రాజెక్టుల పేరుతో బాధితుల నుంచి పెద్దఎత్తున డబ్బులు వసూలు చేసిందని విచారణలో వెల్లడైనట్టు సమాచారం. దీంతో రంగంలోకి దిగిన ఈడీ.. లక్ష్మీనారాయణను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నది. 2019-2022 మధ్య పలు రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల పేరుతో ఈ సంస్థ పలువురి నుంచి రూ.వేల కోట్లు వసూలు చేసినట్టు తెలిసింది.



రాబడి

మీ రిటైర్మెంట్ అనంతరం ఆనందకర జీవితాన్ని సొంతం చేసుకోవడానికున్న చక్కని ఆర్థిక సాధనాల్లో నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) ఒకటి. అయితే ఇందులో తగిన యాన్యుటీ ప్లాన్‌ను ఎంచుకొనే బాధ్యత మాత్రం పెన్షనర్‌దే. ఎన్‌పీఎస్ 2024 హ్యాండ్‌బుక్ వివరాల ప్రకారం 2004 జనవరి 1న ఈ స్కీం ప్రారంభమైన దగ్గర్నుంచి పదవీ విరమణ సమయంలోనే 1,65,320 మంది యాన్యుటీ ప్లాన్లను ఎంచుకున్నట్టు తేలింది.

ఎన్‌పీఎస్‌లో సరైన ప్లాన్?

ప్రస్తుతం ఎన్‌పీఎస్ సబ్‌స్క్రైబర్ల కోసం 15 రకాల యాన్యుటీ ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే ఎల్ఐసీ, ఎస్బీఐ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్, కొటక్ మహీంద్రా లైఫ్, మ్యాక్స్ లైఫ్, బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్, శ్రీరామ్ లైఫ్, టాటా ఏఐఏ లైఫ్, ఆదిత్యా బిర్లా సన్ లైఫ్ తదితర 15 జీవిత బీమా సంస్థలు యాన్యుటీ సర్వీస్ ప్రొవైడర్లుగా పనిచేస్తున్నాయి. యాన్యుటీ రేట్లు, ఆప్షన్స్‌నుబట్టి ఈ ప్లాన్లు మారుతూ ఉంటాయి. ప్రస్తుతమున్న యాన్యుటీ ప్లాన్లలో ఐదు రకాలే పాపులర్. వాటిలో యాన్యుటీ ఫర్ లైఫ్ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్, జాయింట్ లైఫ్ యాన్యుటీ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్, ఎన్‌పీఎస్-ఫ్యామిలీ ఇన్‌కమ్ ఆప్షన్ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్, యాన్యుటీ ఫర్ లైఫ్ వితౌట్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్, జాయింట్ లైఫ్ యాన్యుటీ వితౌట్ రిటర్న్ పర్చేజ్ ప్రైస్.



ఎంచుకోండిలా..

యాన్యుటీ ఫర్ లైఫ్ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్లో సబ్‌స్క్రైబర్‌కు జీవితాంతం యాన్యుటీ వస్తుంది. ఒకవేళ చనిపోతే ఇది ఆగుతుంది. నామినీకి ప్లాన్ కొన్న ధరలో 100 శాతం తిరిగొస్తుంది.

జాయింట్ లైఫ్ యాన్యుటీ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్లో సబ్‌స్క్రైబర్‌కు జీవితాంతం యాన్యుటీ వస్తుంది. ఒకవేళ చనిపోతే వారి భాగస్వామికి వస్తుంది. వీరూ చనిపోతే నామినీకి ప్లాన్ కొన్న ధర మొత్తం తిరిగొస్తుంది.

ఎన్‌పీఎస్-ఫ్యామిలీ ఇన్‌కమ్ ఆప్షన్ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్లో సబ్‌స్క్రైబర్‌కు, వారు చనిపోతే వారి భాగస్వామికి, వీరూ చనిపోతే సబ్‌స్క్రైబర్ మీద ఆధారపడ్డ తల్లిదండ్రులకు యాన్యుటీ చెల్లింపులు జరుగుతాయి. వీరి తదనంతరం సబ్‌స్క్రైబర్ పిల్లలు లేదా లీగల్ వారసులకు ప్లాన్ కొన్న ధరను మొత్తంగా చెల్లించడం జరుగుతుంది.

యాన్యుటీ ఫర్ లైఫ్ వితౌట్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్లో సబ్‌స్క్రైబర్ జీవించి ఉన్నంత వరకే యాన్యుటీ వస్తుంది. చనిపోతే భాగస్వామికి, నామినీలకూ రాదు.

జాయింట్ లైఫ్ యాన్యుటీ వితౌట్ రిటర్న్ పర్చేజ్ ప్రైస్లో సబ్‌స్క్రైబర్, వారి భాగస్వామి జీవించి ఉన్నంతదాకా యాన్యుటీ వస్తుంది. వీరు చనిపోతే నామినీలకు ఏమీ రాదు. వీటన్నింటిలో మనకు ఏది ఉత్తమం అనుకుంటే దాన్ని ఎంచుకోవడం లాభదాయకం.

ఇవి గుర్తుంచుకోండి..

యాన్యుటీని కొనేముందు మన భవిష్యత్తు ఆర్థిక అవసరాలు ఏమిటన్నదానిపై అవగాహన ఉండాలి.

అందుబాటులో ఉన్న యాన్యుటీ, పేఔట్ ఆప్షన్లు, నిబంధనలు, యాన్యుటీ కాంట్రాక్ట్ షరతులనూ తెలుసుకోవాలి.

వయసు, కొనే ధరనుబట్టి యాన్యుటీ రేట్లు ఆధారపడి ఉంటాయి.


నెల, త్రైమాసిక, అర్ధ వార్షిక, వార్షికవారీ చెల్లింపులను ఎంచుకోవచ్చు.

పెన్షనర్ మరణానంతరం భాగస్వామికి కూడా పెన్షన్ వచ్చే ప్లాన్‌ను ఎంచుకుంటే పెన్షన్ తక్కువగా వస్తుంది.

కొన్న ధరను తిరిగి చెల్లించనక్కర్లేని ప్లాన్‌ను ఎంచుకుంటే పెన్షన్ ఎక్కువగా వస్తుంది.

ఒక్కసారి యాన్యుటీ ఆప్షన్‌ను ఎంచుకొంటే ఇక మారదు. కాబట్టి ఎంచుకొనేటప్పుడే అన్ని చూసుకొని నిర్ణయం తీసుకోవాలి.

చిన్న పెట్టుబడి.. పెద్ద రాబడి



మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్‌లో ఇన్వెస్ట్ చేస్తారా?

త్వరపడండి.. మరో 6 నెలలే సమయం

మీరు ఒక మహిళ అయితే, నమ్మకమైన రిటర్నులతో సురక్షిత పెట్టుబడిని కోరుకుంటున్నట్టైతే.. మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎంఎస్ఎస్‌సీ)ను తీసుకోవచ్చు. కనీస పెట్టుబడి రూ.1,000 నుంచి మొదలవుతుంది. వడ్డీరేటు కూడా 7.5 శాతంగా ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న చాలా ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీలు) లేదా పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్స్ (పీపీఎఫ్)లపై పొందే వడ్డీలకన్నా ఇది ఎక్కువే. అంతేగాక తమ ఆడబిడ్డల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు లేదా సంరక్షకులకున్న అత్యుత్తమ పెట్టుబడి సాధనంగానూ దీన్ని పేర్కొనవచ్చు. దీనికి రెండేండ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. దీంతో చదువు కోసం పొదుపు, చిరు వ్యాపారాల కోసం ప్రణాళికల వంటి స్వల్పకాలిక ఆర్థిక లక్ష్యాల సాధనకూ చక్కగా ఉపయోగపడుతుందనే చెప్పాలి.

ఏమిటి ఈ పథకం?

మహిళా సాధికారతే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించారు. మహిళలు, ఆడపిల్లల అవసరాలకు పొదుపును ప్రోత్సహించడంలో భాగంగా 2023 ఏప్రిల్‌లో కేంద్ర ప్రభుత్వం ఈ స్కీంను ప్రారంభించింది. ఇందులో సురక్షిత, అధిక రాబడిగల పెట్టుబడులకు అవకాశాలుంటాయి. అయితే ఈ స్కీం పరిమిత కాలమే అందుబాటులో ఉంటుంది. వచ్చే ఏడాది మార్చిదాకే లభిస్తుంది.

ప్రధాన ఫీచర్లు..

వార్షిక వడ్డీరేటు: 7.5 శాతం. ప్రతీ మూడు నెలలకోసారి లెక్కించి జమ చేస్తారు.

అర్హత: మహిళలు, ఆడపిల్లలకు మాత్రమే ఈ స్కీంలో పెట్టుబడికి వీలుంటుంది. మైనర్ల కోసం తల్లిదండ్రులు, వారి సంరక్షకులూ ఈ పథకాన్ని తీసుకోవచ్చు.

కాలపరిమితి: రెండేండ్లు. స్వల్పకాలిక లక్ష్యాలకు ఇది చక్కని సాధనం.

పెట్టుబడి: కనిష్ఠం రూ.1,000. గరిష్ఠం రూ.2 లక్షలు. ఒకేసారి డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

ఏమిటి దీని ప్రత్యేకత?

- ఈ పథకంలో పెట్టుబడులపై ఏటా గరిష్ఠంగా 7.5 శాతం వడ్డీరేటును పొందవచ్చు. సేవింగ్స్ అకౌంట్స్, ఎఫ్‌డీలు, పీపీఎఫ్‌లతో పొందే వడ్డీరేటు కంటే ఇది ఎక్కువ. పీపీఎఫ్‌లో కూడా 7.1 శాతం వడ్డీరేటే వస్తున్నది. మహిళా సాధికారత దృష్ట్యానే ఈ స్కీంకు అన్నింటి కంటే ఎక్కువ వడ్డీరేటును ఆఫర్ చేస్తున్నారు.
- పెట్టుబడి మొదలైన ఏడాది తర్వాత అందులో 40 శాతం వరకు తిరిగి వెనక్కి తీసుకునే వెసులుబాటు ఈ పథకంలో ఉన్నది. అత్యవసర సమయాల్లో ఈ సొమ్మును వాడుకోవచ్చు. అలాగే ఇది కేంద్ర ప్రభుత్వ పథకం. కాబట్టి అత్యంత సురక్షితమైన పెట్టుబడిగా దీన్ని పేర్కొనవచ్చు. నిర్భయంగా మహిళలు తమ కష్టార్జితాన్ని ఇందులో మదుపు చేయవచ్చు.

ఎలా పెట్టుబడి పెట్టాలి?

పోస్టాఫీస్ లేదా ప్రభుత్వ రంగ బ్యాంకులో ఖాతా ద్వారా మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్‌లో పెట్టుబడులకు దిగవచ్చు. పోస్టాఫీసుల్లోనైతే దగ్గర్లోని పోస్టాఫీస్‌కు వెళ్లి అక్కడ ధరఖాస్తు ఫారంను నింపాలి. మీ వ్యక్తిగత వివరాలు, పెట్టుబడి మొత్తంతోపాటు ఆధార్, పాన్, చిరునామా తదితర అవసరమైన ఇతర కేవైసీ డాక్యుమెంట్లను సమర్పించాలి. పెట్టుబడి మొత్తాన్ని నగదుగానైనా చెక్కు రూపంలోనైనా ఇవ్వవచ్చు. దీంతో ఎంఎస్ఎస్‌సీని అందుకోవచ్చు.

బ్యాంకుల్లోనైతే మీకు దగ్గర్లోని ప్రభుత్వ బ్యాంకుల శాఖలకు వెళ్లి అప్లికేషన్ ఫారాన్ని నింపి, కేవైసీ డాక్యుమెంట్ల జీరాక్స్‌లను సమర్పించాలి. నగదు, చెక్కు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ ద్వారా పెట్టుబడులు పెట్టవచ్చు. ప్రాసెసింగ్ అనంతరం సర్టిఫికెట్ మీ చేతికి వస్తుంది. కాగా, పెట్టుబడి పెట్టిన 6 నెలల తర్వాత మీ ఖాతాను మీరు ముగించవచ్చు. కానీ వడ్డీరేటు 5.5 శాతమే వర్తిస్తుంది. రూ.2 లక్షలు పెట్టుబడిగా పెడితే రెండేండ్ల తర్వాత రూ.2,32,044 వస్తుంది.

డిపాజిట్	వడ్డీ ఆదాయం	చివరకు వచ్చే మొత్తం
₹ 1,000	₹ 160	₹ 1,160
₹ 2,000	₹ 320	₹ 2,320
₹ 3,000	₹ 481	₹ 3,481
₹ 5,000	₹ 801	₹ 5,801
₹ 10,000	₹ 1,602	₹ 11,602
₹ 20,000	₹ 3,204	₹ 23,204
₹ 30,000	₹ 4,807	₹ 34,807
₹ 50,000	₹ 8,011	₹ 58,011
₹ 1,00,000	₹ 16,022	₹ 1,16,022
₹ 1,50,000	₹ 24,033	₹ 1,74,033
₹ 2,00,000	₹ 32,044	₹ 2,32,044

చదువు కోసం మదుపు..

నేడు పిల్లల విద్య కోసం చేస్తున్న ఖర్చుల భారం అంతా ఇంతా కాదు. తల్లిదండ్రులకు ఇదో పెద్ద సమస్యలా తయారైంది. అయితే సరైన ప్రణాళికతో పెట్టుబడులు పెడుతూపోతే దీన్ని అధిగమించవచ్చు. దీనికున్న అవకాశాలను పరిశీలిస్తే..

ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లు


పిల్లల ఉన్నత విద్య వంటి దీర్ఘకాల లక్ష్యాల సాధనకు ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ చక్కని మార్గం. సిప్ ద్వారా మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టే పెట్టుబడులు ఈక్విటీల్లోకి వెళ్తాయి. చిన్న మదుపరులకూ ఇవి ఉపయుక్తంగా ఉంటాయి. అయితే ఈ పెట్టుబడులు మార్కెట్ ఒడిదొడుకులకు లోబడి ఉంటాయన్నది గుర్తుంచుకోవాలి.

ఎడ్యుకేషనల్ స్కీములు

వివిధ మ్యూచువల్ ఫండ్స్.. పిల్లల విద్యకయ్యే ఖర్చుల కోసం రకరకాల పథకాలను అమలు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఈక్విటీ, డెట్ లేదా బంగారంపై పెట్టుబడులు పెడుతూ ఆకర్షణీయ రాబడులను పొందవచ్చు.

ఫిక్స్‌డ్ డిపాజిట్లు

ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లతో పోల్చితే ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ) తక్కువ రాబడులనే అందిస్తాయి. కానీ ఇవి సురక్షితమైనవి, నిర్దేశిత రాబడులనూ అందుకోవచ్చు.



విద్యా రుణాలు

ఉన్నత విద్య కోసం తల్లిదండ్రులు విద్యా రుణాలనూ తీసుకోవచ్చు. ఇతర రుణాలతో పోల్చితే వీటికి కొన్ని వెసులుబాట్లుంటాయి. మారటోరియం పీరియడ్ ఉంటుంది. విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత రుణ చెల్లింపులను ప్రారంభించుకోవచ్చు. పాత పన్ను విధానం కింద ఐటీ చట్టంలోని సెక్షన్ 80ఈతో పన్ను మినహాయింపూ లభిస్తుంది.



ఆటుపోట్లకు ఆస్కారం!

దేశీయ స్టాక్ మార్కెట్లలో రికార్డ్ రన్ కొనసాగుతున్నది. మునుపెన్నడూలేని గరిష్ఠాల్లో సూచీలు కదలాడుతున్నాయి. ఇన్వెస్టర్లు పెట్టుబడుల దిశగానే పోతున్నారు. గత వారం ట్రేడింగ్‌లో ఎక్కువ రోజులు ఈక్విటీ మార్కెట్లు లాభాల్లోనే నడిచాయి. ఈ క్రమంలోనే వారం మొత్తంగా సూచీలు భారీగానే ఎగిశాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,027.54 పాయింట్లు లేదా 1.21 శాతం పెరిగి 85,571.85 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 388 పాయింట్లు లేదా 1.50 శాతం పుంజుకొని 26,178.95 దగ్గర ముగిసింది. ఈ నేపథ్యంలో లాభాల స్వీకరణకు అవకాశాలు కనిపిస్తున్నాయి. శుక్రవారం మార్కెట్లు నష్టపోవడం ఇందుకు సంకేతంగా తీసుకోవచ్చని మెజారిటీ నిపుణులు సూచిస్తున్నారు. ఆల్‌టైమ్ హై దరిదాపుల్లో ఉండటం వల్ల సెల్లింగ్ ప్రెషర్ ఎక్కువగా ఉంటుందన్న విషయాన్ని వారు గుర్తుచేస్తున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 25,800 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 25,600 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 26,400-26,600 మధ్యకు వెళ్లవచ్చు.

చివరగా..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

మరో రెండురోజులు వర్షాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో మరో రెండు రోజులుపాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కుమ్రంభీం-ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, ఆదిలాబాద్, మహబూబాబాద్, నిర్మల్, సిద్దిపేట, యాదాద్రి-భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, జయశంకర్‌భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ, జనగామలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

పంటల్లో జన్యుమార్పిడిని వ్యతిరేకిద్దాం

- దక్షిణాది రాష్ట్రాల రైతు సంఘాల నిర్ణయం

హైదరాబాద్, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ) : సహజత్వానికి భిన్నంగా పంటల్లో జరిగే జన్యుమార్పిడిని వ్యతిరేకించాలని, ఈ విధానం నిలిపివేతకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని రైతు సంఘాలు నిర్ణయించాయి. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్‌రెడ్డి అధ్యక్షతన జన్యుమార్పిడి పంటలపై దక్షిణాది రాష్ట్రాల రైతు సంఘం నాయకులు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో జన్యుమార్పిడి విధానాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించారు. జన్యుమార్పిడితో రైతులు విత్తన స్వాతంత్ర్యం కోల్పోవడమే కాకుండా విత్తనాలు కార్పొరేట్ రంగం చేతుల్లోకి వెళ్తాయని ఆవేదన వ్యక్తంచేశారు. జన్యుమార్పిడి పంటల మూలంగా ప్రజల ఆరోగ్యం దెబ్బతినడంతోపాటు పర్యావరణానికి ప్రమాదం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇదే విషయంపై దేశవ్యాప్తంగా రైతులతోపాటు వినియోగదారులను కలుపుకొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి జన్యు మార్పిడి పంటల ఆలోచన విధానానికి స్వస్తి పలికేలా ముందుకుసాగుదామని నిర్ణయించారు. సమావేశంలో తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల రైతు సంఘాల నేతలు పాల్గొన్నారు.

రూ.400 ఇసుక 2వేలు!

- టీజీఎండీసీలో భారీ కుంభకోణం..
- ప్రభుత్వ సంస్థల పేరుతో బుకింగ్
- ఆన్‌లైన్ లొసుగులతో కృత్రిమ కొరత
- లోడింగ్‌కూ వెయ్యి చొప్పున వసూలు



హైదరాబాద్, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ) : తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎండీసీ)లో భారీ కుంభకోణం వెలుగుచూసింది. అధికారుల 'అమ్యామ్యాల' కారణంగా రూ.400 ఉన్న టన్ను ఇసుక ధర.. వినియోగదారుకు చేరేసరికి రూ.2000 దాటుతున్నది. వర్షాల సీజన్‌లో ఈ ధర మరింత పెరుగుతున్నది. ఆన్‌లైన్‌లో లొసుగులను ఆసరాగా అధికారులు, దళారులు కుమ్మక్కై ఇసుక దందా యథేచ్ఛగా సాగిస్తున్నారు. కోట్లాది రూపాయల ప్రజల సొమ్మును జేబుల్లో నింపుకొంటున్నారు.

గాడి తప్పిన ఆన్‌లైన్ విధానం

ఇసుక వ్యాపారంలో అక్రమాలు అరికట్టేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. దళారుల ప్రమేయం లేకుండా టీజీఎండీసీ వెబ్‌సైట్‌కు వెళ్లి ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకుంటే ఇసుకను ఇంటికి చేర్చడం దీని ముఖ్యోద్దేశం. ప్రభుత్వం మారిన తర్వాత ఈ వ్యవస్థ గాడితప్పింది. ప్రస్తుతం టన్ను ఇసుకను టీజీఎండీసీ రూ.406కు విక్రయిస్తుండగా, రవాణా ఖర్చులు కలుపుకొని టన్ను రూ.800 నుంచి 1000 వరకు అందాలి. కానీ, రూ.1800 నుంచి కొన్ని సందర్భాల్లో రూ. 2,500 వరకూ వినియోగదారు చెల్లించాల్సి వస్తున్నది. టన్ను ఇసుకపై రూ.1000 నుంచి రూ.1500 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఎవరైనా నేరుగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకొని తెచ్చుకుందామంటే.. దళారులు లేనిదే బుకింగ్ సాధ్యం కాదు. కొన్ని ఎంపికచేసిన మీ-సేవా కేంద్రాల్లో 'బాట్ సాఫ్ట్‌వేర్' ద్వారానే బుక్ అవుతుంది. బుకింగ్ కోసం దళారులకు రూ. 5000 చొప్పున సమర్పించుకోవాలి. స్టాక్‌యార్డ్‌ల వద్ద ఉచితంగా లోడ్ చేయాల్సి ఉన్నా అక్కడ ఒక్కో ట్రిప్పునకు రూ.1000 సమర్పించాలి. ఈ అక్రమ వసూళ్లను నిలిపివేయాలని, తమకే బుకింగ్ వెసులుబాటు కల్పించాలని ఇటీవల లారీ యజమానులు టీజీఎండీసీ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు.

బల్క్ బుకింగ్‌ల పేరుతో భారీ మోసం

పెద్ద మొత్తంలో ఇసుక అవసరమైన ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్ బిల్డర్లు, కాంట్రాక్టర్లు బల్క్‌గా బుక్ చేసుకునే వీలుంది. నిర్ధారిత ధర చెల్లించి వారు బుక్ చేసుకున్న పరిమాణం వరకు ఇసుక రవాణా చేసుకోవచ్చు. ఇదే టీజీఎండీసీలోని కొందరు అధికారులు, దళారులకు వరంలా మారంది. ప్రభుత్వ, ప్రైవేట్ బిల్డర్ల పేరుతో భారీగా ఇసుక బుక్ చేసుకొని అధిక ధరకు లారీ యజమానులకు విక్రయిస్తున్నారు. గత ఆగస్టు ఆరో తేదీన కొందరు దళారులు వాటర్‌బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పేరుతో 1.4లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక బుక్ చేయగా, వాస్తవాలను పరిశీలించకుండానే టీజీఎండీసీ అధికారులు మూడు రోజుల్లోనే మంజూరు ఇచ్చారు. బుక్ చేసుకున్న దళారులు ఆ ఇసుకను దాదాపు 150 మంది లారీ యజమానులకు అధికరేటుకు విక్రయించగా, ఇప్పటికే సుమారు 40వేల మెట్రిక్ టన్నుల ఇసుకను లారీ యజమానులు రవాణా చేశారు. ఈ మధ్య విషయం బయటకు పొక్కి వాటర్‌బోర్డు నుంచి ఎలాంటి ఇసుక బుకింగ్ లేదని టీజీఎండీసీ ఉన్నతాధికారులకు తెలియడంతో వెంటనే వారు తాము ఇచ్చిన మంజూరును రద్దుచేశారు. దీంతో దళారులకు 1.4లక్షల టన్నులకు డబ్బులు చెల్లించిన లారీ యజమానులు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. ఇసుక మంజూరు రద్దయినందున తాము దళారులకు చెల్లించిన మొత్తాన్ని వాపస్ ఇవ్వాలని, లేకుంటే ఇసుకను రవాణా చేసుకునే వెసులుబాటు కల్పించాలని టీజీఎండీసీని కోరుతున్నారు.

బల్క్ బుకింగ్‌లు నిత్యకృత్యం

టీజీఎండీసీలో బల్క్ బుకింగ్‌ల బాగోతం ఎంతోకాలంగా కొనసాగుతున్నది. ఇప్పుడు వెలుగులోకొచ్చింది మచ్చుకు ఒక్కటి మాత్రమే. అధికారులు, దళారులు కుమ్మక్కై బల్క్ బుకింగ్ చేయడం, అనంతరం లారీ యజమానులకు అధికరేటుకు విక్రయించడం మామూలే అని లారీ యజమానులు చెప్తున్నారు. తాజాగా వ్యవహారం బయటకు పడి మంజూరు రద్దవడంతో వివాదం తలెత్తిందని, లేదంటే ఇది ఎప్పటిలానే కొనసాగేదని పేర్కొంటున్నారు. తాము సొంతంగా బుక్ చేసుకునే అవకాశం లేదని, ఒక్కో ట్రిప్పుకు రూ.5000 వరకు దళారులకు సమర్పిస్తేనే తమకు ఇసుక మంజూరు లభిస్తున్నదని, కొందరు అధికారులు, దళారులు కుమ్మక్కై ఈ దందా కొనసాగిస్తున్నారని వాపోతున్నారు. టీజీఎండీసీ ద్వారా ప్రతి నెట సగటున వానకాలంలో అయితే 20లక్షల మెట్రిక్ టన్నులు, మిగిలిన కాలాల్లో 40లక్షల మెట్రిక్ టన్నుల చొప్పున ఇసుక విక్రయాలు జరుగుతున్నాయి. టీజీఎండీసీ టన్ను ఇసుకు రూ.406కు విక్రయిస్తుంటే, వినియోగదారుల రూ. 2000చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తున్నది. దీన్నిబట్టి దోపిడీ ఏ స్థాయిలో ఉన్నదదో అర్థం చేసుకోవచ్చు.



చితికిన చేనేత.. ఏదీ చేయూత?

- నేతన్నకు మళ్లీ గుండెకోత
- ఆర్థికంగా కోలుకోలేని దెబ్బలు
- పదేండ్లు ప్రశాంతం.. పది నెలల్లో జీవితాలు ఛిద్రం
- చేనేత కార్మికుల సమస్యలు పట్టని సర్కారు
- గతంలో మాదిరి చీరల తయారీ అప్పగించాలని వేడుకోలు
- 'చేనేత చేయూత'లో డబ్బులు జమచేయాలని నాయకుల డిమాండ్

చేనేతల బతుకులు మళ్లీ ఛిద్రమవుతున్నాయి.. చేయూతనందించాల్సిన సర్కారు ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నది. పదేండ్లపాటు కేసీఆర్ చేనేత రంగానికి సంక్షేమ రంగులు అద్దితే.. కొత్తగా వచ్చిన సర్కారు పది నెలల్లో నేతన్నను కోలుకోలేని దెబ్బతీసిందని సర్వత్రా మండిపడుతున్నారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ): పది నెలలుగా చేనేత కార్మికులు ఉపాధి కోసం ఎదురుచూస్తున్నారు. సరైన గిరాకీ లేక ఆర్థికంగా చితికిపోతున్నారు. రాష్ట్రంలో చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చేనేత రంగాన్ని సర్కారు పూర్తిగా విస్మరించినట్లు సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేతన్నల ఆర్థిక పరిస్థితులు దయనీయంగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో మాదిరిగా ప్రస్తుత ప్రభుత్వం చేనేత కార్మికులకు పని కల్పించడం లేదని వాపోతున్నారు. పదేండ్ల క్రితం నాటి అవస్థలు మళ్లీ మొదలయ్యాయని మదనపడుతున్నారు. ఉపాధి కరువవ్వడంతో ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు దాపురించాయని చేనేత కార్మిక సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చేయూతనివ్వాల్సిందే..

పది నెలలుగా సరైన గిరాకీ లేకపోవడంతో 'చేనేత చేయూత' పథకం కింద రికరింగ్ డిపాజిట్ ఖాతా-1 అకౌంట్‌లో నెలవారీగా కార్మికులు డబ్బులు జమ చేయలేకపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 5000 మందికి పైగా చేనేత కార్మికులది ఇదే పరిస్థితి. ఈ నేపథ్యంలో ఆర్‌డీ-1 అకౌంట్‌లో ప్రస్తుతం జమ చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఇలా చేస్తే ఆర్‌డీ-2 అకౌంట్ నుంచి డబ్బుల మొత్తం డబుల్ అవుతాయి. రూ.2000 జమ చేస్తే, తిరిగి రూ.4000 నేతన్న ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుంది. ఈ విధానానికి అవకాశం కల్పించాలని హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ శాఖ అధికారులు, ప్రభుత్వాన్ని చేనేత కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేనేత మిత్ర పథకం ద్వారా నూలు సబ్సిడీ 40శాతంతో నేరుగా వీవర్‌కు రూ.2వేలు, వర్కర్‌కు రూ.500 అందించింది. ఈ పథకం ద్వారా 2023 అక్టోబర్ వరకు నేతన్నలకు లబ్ధి చేకూరింది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నూలుకు ఎలాంటి రాయితీ ఇవ్వడం లేదు.

నేతన్నల డిమాండ్లు ఇవే..

- చేనేత మిత్ర పథకాన్ని అమలు చేయాలి. నవంబర్ నుంచి రావాల్సిన బకాయిలు చెల్లించాలి.
- చేనేత రుణమాఫీ రూ.2లక్షల వరకు వర్తింపజేయాలి. మాఫీ లబ్ధి పొందని వారికి నగదు సాయం చేయాలి.
- 80 ఏండ్ల వయసు ఉన్న నేతన్నలకు ఇన్సూరెన్స్ పథకం వర్తింపజేయాలి.
- చేనేత కార్మికుల వద్ద నిల్వ ఉన్న వస్త్రాలను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసి ఆదుకోవాలి.
- డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలి. ఇంటి స్థలం ఉంటే రూ.5లక్షల ఆర్థిక సాయం చేయాలి.

ఆరోగ్యకరమైన జీవనశైలితో గుండె పదిలం

- స్టార్ హాస్పిటల్స్ గ్రూప్ ఎండీ డాక్టర్ గోపీచంద్

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ): ఆరోగ్యకరమైన జీవనశైలితో గుండె జబ్బులకు దూరంగా ఉండొచ్చని స్టార్ హాస్పిటల్స్ గ్రూప్ ఎండీ పద్మశ్రీ డాక్టర్ గోపీచంద్ మన్నం అన్నారు. వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకొని జూబ్లీహిల్స్‌లోని హోటల్ దసపల్లాలో ఆదివారం హార్ట్ టు హార్ట్ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమాన్ని డాక్టర్ గోపీచంద్, జాయింట్ ఎండీ డాక్టర్ రమేశ్ గూడపాటి, ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ హాస్యనటుడు పద్మశ్రీ బ్రహ్మానందంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపీచంద్ మాట్లాడుతూ 16 ఏండ్ల అనుభవంలో మా దవాఖానలో ఐదు లక్షల మంది రోగులకు విజయవంతంగా చికిత్స చేశామన్నారు.



హాస్యనటుడు బ్రహ్మానందంకు జ్ఞాపికను అందజేస్తున్న స్టార్ హాస్పిటల్స్ గ్రూప్ ఎండీ పద్మశ్రీ డాక్టర్ గోపీచంద్ మన్నం, తదితరులు

43వేల గుండె శస్త్రచికిత్సలు, 7వేల పీడియాట్రిక్ హార్ట్ సర్జరీలు చేశామని, కార్డియాక్ సర్జరీల్లో 99.8 శాతం సక్సెస్ రేటు సాధించామని వెల్లడించారు.

సీపీఎం జాతీయ కార్యదర్శి ఎన్నికకు ముహూర్తం

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): ఇటీవల అనారోగ్యంతో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి చెందారు. ఆ పోస్టును ఎవరికి ఇస్తారనే చర్చ ప్రస్తుతం జోరుగా సాగుతున్న క్రమంలో.. సీపీఎం జాతీయ కార్యదర్శి ఎన్నికకు ముహూర్తం ఖరారు చేసినట్లు ప్రకటించారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో సీపీఎం 24వ అఖిలభారత మహాసభలు మధురైలో జరగనున్నాయి. ఈ అఖిలభారత మహాసభల్లో సీపీఎం నూతన ప్రధాన కార్యదర్శి ఎన్నిక ఉంటుందని, కొత్త ప్రధాన కార్యదర్శి ఎన్నిక వరకు పొలిట్‌బ్యూరోకు, సెంట్రల్ కమిటీకి.. సమన్వయకర్తగా ప్రకాశ్‌కారత్ వ్యవహరించనున్నట్లు సీపీఎం వర్గాలు తెలిపాయి.

9 ఏండ్ల బాలికపై లైంగికదాడి

- నిందితుడి ఇంటికి గ్రామస్థుల నిప్పు
- సిద్దిపేట జిల్లా గురువన్నపేటలో ఉద్రిక్తత
- గ్రామంలో 144 సెక్షన్ విధించిన పోలీసులు
- బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పల్లా పరామర్శ

కొమురవెల్లి, సెప్టెంబర్ 29: బాలికపై ఓ ట్రాక్టర్ డ్రైవర్ లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు, బాలిక తల్లిదండ్రులు నిందితుడి ఇంటికి నిప్పుపెట్టారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఘటన ఆదివారం సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం గురువన్నపేటలో చోటుచేసుకుంది. గురువన్నపేట ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న బాలిక(9) శుక్రవారం ఇంట్లో తన చెల్లెళ్లతో ఆడుకుంటున్నది. అదే సమయంలో పక్క ఇంట్లో ఉండే ట్రాక్టర్ డ్రైవర్ ఎండీ షర్ఫుద్దీన్ (20) ఇంట్లోకి ప్రవేశించి బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయం ఎవరికీ చెప్పొద్దని బాలికను బెదిరించాడు. దీంతో భయపడిన బాలిక ఇంట్లో ఎవరికీ చెప్పలేదు. శనివారం బాలిక అలసటగా ఉండటంతో రాత్రి కుటుంబ సభ్యులు ఏమైందని అడగగా సైకిల్‌పై నుంచి పడినట్టు చెప్పింది. వెంటనే విషయాన్ని బాలిక చెల్లెళ్లు తల్లిదండ్రులకు తెలుపడంతో వారు 100కు ఫోన్ చేశారు. చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్సై రాజు నిందితుడిని అరెస్ట్ చేశారు. ఆదివారం ఉదయం విషయం తెలుసుకున్న గ్రామస్థులు నిందితుడి ఇంటి వద్దకు చేరుకున్నారు. నిందితుడి ఇంటికి నిప్పు అంటించి వాహనాలను ధ్వంసం చేశారు. వెంటనే పోలీసులు మంటలను అదుపులోకి తెచ్చారు. గ్రామంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, 144 సెక్షన్ విధించారు. జిల్లా డీసీపీ(అడ్మిన్) మల్లారెడ్డి గ్రామాన్ని సందర్శించారు. విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వెంటనే సీపీ అనురాధకు ఫోన్ చేసి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాలిక తల్లితో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బీజేపీ నాయకులు భారీగా తరలివచ్చి గ్రామంలో ఆందోళన నిర్వహించారు.

ఫోక్ సింగర్ మల్లిక్ తేజపై కేసు

లైంగికదాడికి యత్నించాడని సహచర గాయని ఫిర్యాదు

జగిత్యాల కలెక్టరేట్, సెప్టెంబర్ 29: జానపద సింగర్, రైటర్ మల్లిక్‌తేజ తనపై లైంగికదాడికి యత్నించాడని సహచర గాయని ఆదివారం జగిత్యాలలోని టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు. జగిత్యాల జిల్లా చిన్నాపూర్‌కు చెందిన సింగారపు మల్లేశం అలియాస్ మల్లిక్‌తేజతో కలిసి ఆరేండ్ల క్రితం ఓ యూట్యూబ్ చానల్ ప్రారంభించి పాటలు పాడుతున్నామని, చానల్ మంచి ఆదరణ పొంది లక్షల వ్యూస్ రావడంతో ఆదాయం సైతం భారీగా వచ్చేదని తెలిపింది. తనకు కొంత నగదు మాత్రమే ఇవ్వడంతో మరో యూట్యూబ్ చానల్ ప్రారంభించానని, తనకు తెలియకుండానే యూట్యూబ్ చానల్ పాస్‌వర్డ్, 2 లక్షల వ్యూస్ ఉన్న ఇన్‌స్టాగ్రామ్ పాస్‌వర్డ్‌లను సైతం మార్చి వేధించాడని, తరచూ ఫోన్‌చేసి పెండ్లి చేసుకోవాలని బెదిరిస్తున్నాడని పేర్కొన్నది. జిల్లా కేంద్రంలోని తమ కార్యాలయానికి వచ్చి లైంగికదాడికి యత్నించాడని, తనపై స్వగ్రామంలో దుష్ప్రచారం చేస్తూ వేధిస్తున్నాడని మహిళా సింగర్ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మల్లిక్‌తేజపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.



మల్లిక్ తేజ

గోదావరిలో యువకుడి గల్లంతు

ధర్మపురి రూరల్, సెప్టెంబర్ 29: దుర్గామాత మాలాధరణ కోసం గోదావరిలో పుణ్యస్నానం చేసేందుకు వచ్చిన ముగ్గురు యువకులు ప్రమాదవశాత్తు ఆదివారం వరదలో కొట్టుకుపోయారు. గమనించిన జాలర్లు ఇద్దరిని కాపాడగా.. ఒకరు గల్లంతయ్యారు. దసరా నవరాత్రుల సందర్భంగా దుర్గామాత మాలధారణ కోసం జగిత్యాల జిల్లా రాయపట్నం వద్ద గోదావరి నదిలో పుణ్యస్నానం చేసేందుకు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన రాగుల పవన్‌కుమార్, స్నేహితులు కొట్టె నవిత్‌వర్మ, బొగే అశ్విన్ కలిసి ద్విచక్రవాహనంపై వచ్చారు. మధ్యాహ్నం 2.30 గంటలకు గోదావరి నదిలో స్నానం చేస్తుండగా.. వరద ఉధృతంగా ప్రవహించడంతో ముగ్గురు కొట్టుకుపోయారు. వెంటనే అక్కడున్న జాలర్లు గమనించి కొట్టె నవిత్‌వర్మ, బొగే అశ్విన్‌ను కాపాడారు. రాగుల పవన్ కుమార్ కొట్టుకుపోయాడు. అతడి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. పవన్‌కుమార్ తండ్రి రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ధర్మపురి ఎస్సై గంగుల మహేశ్ తెలిపారు.

గురుకుల సమస్యల పోరాటానికి తాత్కాలిక బ్రేక్

- దసరా తర్వాత ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం
- ప్రభుత్వానికి గురుకుల టీచర్ల జేఏసీ హెచ్చరిక

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని 1,022 గురుకులాల్లో నెలకొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, నాన్‌టీచింగ్ సమస్యల పరిష్కారం కోసం టీచర్లు గత రెండు వారాలుగా వివిధ పద్ధతుల్లో పోరాటాలు చేస్తున్నారు. ఈ క్రమంలో విద్యాసంస్థలకు దసరా సెలవులు రావడంతో ప్రస్తుతం తమ పోరాటాలకు తాత్కాలిక బ్రేక్ వేసినట్టు గురుకుల టీచర్ల జేఏసీ తరఫున టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు జంగయ్య, చావ రవి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గురుకులాల్లో సమస్యలు పెరిగిపోయాయని, వాటి పరిష్కారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టి పెట్టకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. గురుకులాల్లో కొత్త టైంటేబుల్ అమలు, అద్దె భవనాల్లో గురుకులాల కొనసాగింపు తదితర సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు. దసరా సెలవుల తర్వాత ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా ఇద్దరు రైతులు మృతి

జడ్చర్ల, సెప్టెంబర్ 29 : విద్యుత్తు స్తంభాలు తీసుకెళ్తున్న ట్రాక్టర్ బోల్తాపడగా.. ఇద్దరు రైతులు మృతి చెందారు. ఈ ఘటన ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గంగాపూర్‌లో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. జడ్చర్ల మండలం చిన్న ఆదిరాలకు చెందిన రైతులు బోరు బావుల వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసేందుకు జడ్చర్ల నుంచి ట్రాక్టర్‌లో స్తంభాలను తీసుకెళ్తున్నారు. గంగాపూర్ ప్రధాన రహదారిపై అదుపుతప్పి ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడగా.. ట్రాలీలో కూర్చున్న రైతులు పెరుమళ్ల జంగయ్య, ఎద్దుల జంగయ్యపై స్తంభాలు పడ్డాయి. దీంతో పెరుమళ్ల జంగయ్య (60) అక్కడికక్కడే మృతి చెందగా, ఎద్దుల జంగయ్య(40) మహబూబ్‌నగర్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతూ మరణించాడు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

పోలీసు స్టేషన్ల నిర్వహణకు పైసల్లేవ్?

కొన్ని నెలలుగా మెయింటెనెన్స్ అలవెన్సుల బకాయి

- జంట నగరాల్లో ప్రతి స్టేషన్‌కు నెలకు రూ.75 వేలు
- జిల్లా కేంద్రాల్లోని స్టేషన్లకు నెలకు రూ.50 వేలు
- మండల కేంద్రాల్లోని స్టేషన్లకు నెలకు రూ.25 వేలు
- ఇప్పటికే రూ.కోట్లు పెండింగ్.. ప్రభుత్వం విడుదల చేయక ఖర్చుల కోసం పోలీసుల సతమతం
- స్టేషన్‌కు వచ్చేవారి డబ్బులపై మళ్లీ ఆధారం



హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కొన్ని పోలీస్ స్టేషన్లలో మళ్లీ నేతలు ఇచ్చే డబ్బుల కోసం ఆశగా ఎదురుచూసే పరిస్థితులు వచ్చాయి. స్టేషన్‌కు వచ్చినవాళ్లు ఎంతోకొంత చేతిలో పెట్టకపోతారా? ఈ నెలకు సరిపడా ఛాయ్‌లు, బిస్కెట్లు, పనోళ్లకు డబ్బులు, ఇతర అవసరాలు తీరకపోతాయా? అంటూ కొందరు పోలీసు అధికారులు వేయికండ్లతో ఎదురుచూసే దుస్థితి వచ్చింది. స్టేషన్‌లో ఉండే నిందితులకు తిండి కూడా పెట్టలేకపోతున్నారు. పందేండ్లలో ఎప్పుడూ లేనిది.. మళ్లీ పాత రోజుల్లో అడిగినట్టు.. 'ఏంటన్నా ఏమీ ఇవ్వకుండానే వెళ్తున్నావ్' అనే దారుణ పరిస్థితికి వచ్చారు. కారణం.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల పోలీసు స్టేషన్ల ఖర్చుల కోసం నిధులు విడుదల చేయకపోవటమే. అవును.. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీస్ స్టేషన్ల మెయింటెనెన్స్ కోసం ప్రతి నెల ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వటం లేదు. దీంతో పోలీస్ స్టేషన్ ఖర్చుల కోసం పోలీసు అధికారులు మళ్లీ నేతలు ఇచ్చే దక్షిణలపైనే ఆధారపడుతున్నారు. కొందరు ఆ డబ్బులను సొంతానికి సైతం వాడుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

బీఆర్‌ఎస్ హయాంలో ప్రతి నెల మెయింటెనెన్స్ అలవెన్స్

రాష్ట్ర ఏర్పాటుకు ముందు పోలీస్ స్టేషన్ నిర్వహణకు ప్రభుత్వాలు ఎలాంటి డబ్బులు ఇచ్చేవి కావు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో పోలీసులు సైతం ఎంతోకొంత వసూలు చేయాల్సి వచ్చేది. ఇది కాస్తా.. స్టేషన్ ఖర్చుల కోసం పట్టిపీడించే స్థాయికి వచ్చింది. అయితే, ఆ దుస్థితి నుంచి పోలీసు వ్యవస్థను బయటపడేసేందుకు కేసీఆర్ సర్కారు.. రాష్ట్రంలోని ప్రతి పోలీస్‌స్టేషన్‌కు ప్రతి నెల మెయింటెనెన్స్ కింద డబ్బులు కేటాయించింది. హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయం నుంచి పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్, ఎక్కడో సరిహద్దుల్లో ఉండే మండల పోలీస్‌స్టేషన్‌కు కూడా క్రమం తప్పకుండా డబ్బులు విడుదల చేసింది. దీంతో ఖర్చుల కోసం స్టేషన్‌కు వచ్చే వారిని పీడించడం తగ్గిపోయింది. జంట నగరాలలోని ఒక్కో పోలీస్ స్టేషన్‌కు నెలకు రూ.75 వేలు, జిల్లాకేంద్రాలలో ఒక్కో పోలీస్ స్టేషన్‌కు రూ.50 వేలు, మండల కేంద్రాలలోని ఒక్కో పోలీస్ స్టేషన్‌కు నెలకు రూ.25 వేలు మంజూరు చేశారు. ఈ పద్ధతి తెలంగాణలో మినహా మరే రాష్ట్రంలోనూ లేదు.

కొన్ని నెలలుగా నిధులు పెండింగ్

పోలీస్ స్టేషన్ల నిర్వహణకు ప్రస్తుతం ప్రభుత్వం కొన్ని నెలలుగా నిధులు విడుదల చేయకపోవటంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ పెండింగ్ నిధులు కొన్ని కోట్ల రూపాయల వరకు ఉన్నట్టు తెలిసింది. బీఆర్‌ఎస్ హయాంలో కట్టిన కొత్త పోలీస్ స్టేషన్లు, జిల్లా పోలీస్ స్టేషన్లు, కమిషనరేట్లు, ఎస్పీ ఆఫీసులు చూడ్డానికి ఇంద్రభవనాల్లా ఉన్నా.. పోలీసులు మళ్లీ కక్కుర్తికొద్దీ చేతులు చాస్తుండటంతో కొందరు నేతలు 'ప్రతి నెల మేం ఇవ్వాలా?' అని కొన్ని స్టేషన్లలో ఎదురు ప్రశ్నించే స్థితికి పరిస్థితి దిగజారిందని వాపోతున్నారు. 'ఏ పోలీస్ స్టేషన్ చూసినా ఏమున్నది గర్వకారణం.. మళ్లీ డబ్బులు అడుక్కునే దుస్థితికి దిగజారినం' అని కొందరు నిజాయితీపరులైన అధికారులు చెప్తున్నారు.

ఆర్టీఐ కమిషనర్ల నియామకమెప్పుడు?

- పదినెలలైనా పట్టని కాంగ్రెస్ సర్కారు
- కమిటీ వేసి 2 నెలలైనా స్క్రూటినీపై నిర్లక్ష్యం
- పెండింగ్‌లోనే 10వేల అప్పీళ్లు
- ఆఫీసుల చుట్టూ ప్రజల ప్రదక్షిణలు

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తేతెలంగాణ): పాలనలో పారదర్శకత కోసం 2005లో కేంద్రం తెచ్చిన సమాచార హక్కు చట్టం తెలంగాణలో నిర్వీర్యమవుతున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు దాటినా సమాచార హక్కు చట్టం అమలు, ప్రధాన కమిషనర్, కమిషనర్ల నియామకాలను పట్టించుకోవడంలేదు. నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తులు స్వీకరించి రెండు నెలలు దాటినా అడుగు ముందుకు పడడంలేదు. అప్పీళ్లు పేరుకుపోగా ప్రజలు ఆర్టీఐ ఆఫీస్ చుట్టూ తిరిగి వేసారిపోతున్నారు. అధికారంలోకి రాగానే ప్రధాన కమిషనర్, కమిషనర్లను నియమిస్తామంటూ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఆర్భాటంగా ప్రకటించారు. ప్రధాన కమిషనర్ పదవీకాలం 2020 ఆగస్టు 24న, కమిషనర్ల పదవీకాలం 2023 ఫిబ్రవరి 24న ముగిసింది. ప్రధాన కమిషనర్, కమిషనర్లు లేక 10 వేలకుపైగా అప్పీళ్లు పెండింగ్‌లో పడ్డాయి.

జూన్‌లో నోటిఫికేషన్..400 మంది దరఖాస్తు

ఆర్టీఐ ప్రధాన కమిషనర్, కమిషనర్ల నియామకానికి జూన్ 12న నోటిఫికేషన్ ఇచ్చింది. 400కు పైగా దరఖాస్తులు వచ్చాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2023 జూలైలో ఆర్టీఐ కమిషనర్ల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేయగా 350 దరఖాస్తులు వచ్చాయి. అంటే ఏడు పోస్టుల కోసం 750 మంది పోటీపడుతుండగా, 1:3 చొప్పున షార్ట్‌లిస్ట్ తయారీకి చీఫ్ సెక్రటరీ చైర్‌పర్సన్‌గా ముగ్గురు అధికారులతో కమిటీ ఏర్పాటైంది. కమిటీ వేసి రెండు నెలలు దాటినా స్క్రూటినీ కూడా చేపట్టలేదు.

కమిషనర్ల ఎంపిక ఇలా..

సెక్షన్ 15(1)కింద తెలంగాణలో 2017 లో సమాచార కమిషన్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో ప్రధాన కమిషనర్‌తోపాటు 10 మంది సభ్యులను నియమించే అవకాశం ఉం టుంది. వీరిని ముఖ్యమంత్రి నేతృత్వంలోని హైలెవల్ కమిటీ ఎంపిక చేస్తుంది. ఇందులో డిప్యూటీ సీఎం, ప్రతిపక్ష నేత సభ్యులుగా ఉ న్నారు. ఈ కమిటీ సుప్రీం మార్గదర్శకాల మే రకు ప్రధాన కమిషనర్, కమిషనర్లను సెలెక్ట్ చేస్తుంది. ప్రజాసేవలో నిమగ్నమైన వారు, విస్తృత విషయ పరిజ్ఞానం ఉన్నవారు, పాలనాదక్షత, జర్నలిజం, ప్రసార మాధ్యమాల రంగాల్లో విశేష సేవలందించిన వారిని ఎంపి క చేయాల్సి ఉంటుంది.

రాజకీయ నేతలకే ప్రాధాన్యం!

కాంగ్రెస్ సర్కారు ఆది నుంచీ పాలనకంటే రాజకీయాలపైనే ఫోకస్ పెట్టింది. వివిధ కార్పొరేషన్ల చైర్మన్ల నియామకంలోనూ రాజకీయ నేతలకే పెద్దపీట వేసింది. ఇటీవల ప్రధాన ప్రతిపక్షానికి ఇవ్వాల్సిన పీఏసీ చైర్మన్‌ను బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన ఎమ్మెల్యేకే కట్టబెట్టింది. ఇదే కోవలో సమాచార ప్రధాన కమిషనర్, ఆరుగురు కమిషనర్లను సైతం పొలిటికల్ నేపథ్యమున్నవారికే ఇస్తారా? అను మానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆస్తిపంచివ్వాలని తండ్రి హత్య

- కత్తి, ఇటుకలతో కొడుకు, కూతుళ్ల దాడి



మల్లయ్య (ఫైల్)

వేములవాడ, సెప్టెంబర్ 29: ఆస్తి పంచివ్వాలని కొడుకు, కూతుర్లు కత్తి, ఇటుకలతో దాడి చేసి తండ్రిని హతమార్చారు. ఈ దాడిలో తీవ్ర గాయాలై పినతల్లి దవాఖానలో చికిత్స పొందుతున్నది. ఈ ఘటన ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో చోటుచేసుకున్నది. పట్టణంలోని చెక్కపెల్లి రహదారిలో మామిండ్ల మల్లయ్య(53)-బాలవ్వ దంపతులకు ముగ్గురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. బాలవ్వ 15 ఏండ్ల క్రితం మృతిచెందడంతో మల్లయ్య పద్మను రెండో పెండ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. కొద్ది రోజులుగా ఆస్తి పంపకాల విషయంలో మొదటి భార్య కూతుర్లు, కొడుకుతో మల్లయ్యకు వివాదం నడుస్తున్నది. ఆదివారం పంచాయతీ కోసం కుల సంఘం పెద్దలను పిలిపించారు. రెండో భార్య పిల్లలు చిన్నవాళ్లని, వారు పెద్దయ్యాక ఆస్తి పంచుతానని మల్లయ్య చెప్పి పంచాయితీ మధ్యలోనే వెళ్లిపోయాడు. దీంతో బాలవ్వ కొడుకు, కూతుర్లు, అల్లుండ్లు మల్లయ్య నివాసానికి చేరుకున్నారు. అక్కడ చిన్నపాటి గొడవ జరగగా క్షణికావేశానికి లోనై కత్తి, ఇటుకలతో దాడి చేయగా మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. అడ్డుగా వచ్చిన పద్మకు తీవ్ర గాయాలు కాగా.. దవాఖానకు తరలించారు. ఏఎస్పీ శేషాద్రినీరెడ్డి, సీఐ వీర ప్రసాద్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

పిచ్చికుక్కల దాడిలో 30 మందికి గాయాలు

రేగొండ, సెప్టెంబర్ 29 : పిచ్చికుక్కల దాడిలో 30 మందికి పైగా తీవ్ర గాయాలైన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం దుంపిల్లపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. బాగిర్తిపేట, దుంపిల్లపల్లి గ్రామాల్లో ఆదివారం సాయంత్రం సుమారు 50 కుక్కలు స్వైర విహారం చేశాయి. ఇండ్ల ముందు కూర్చున్న వృద్ధులు, పిల్లలపై దాడి చేసి గాయపరిచాయి. గ్రామస్థులు వారిని 108 వాహనంలో పరకాల దవాఖానకు తరలించారు.

జిందగీ
చింతన
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 30 సెప్టెంబర్ 2024
www.ntnews.com

జగద్గురువైన శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీత రూపంలో సమస్త మానవాళికీ ఒక దివ్యమైన బహుమతిని ప్రసాదించాడు. ప్రస్తుత యుగంలో కురుక్షేత్రాన్ని తలపించే మన రోజువారీ జీవితాలకు మార్గనిర్దేశం చేసే దిక్సూచి గీత. ధర్మం క్షీణించి, అధర్మం ప్రబలినపుడల్లా, లోకంలో శాంతి సౌభాగ్యాల కోసం ధర్మాన్ని పునఃస్థాపించడానికి తాను యుగయుగాన అవతరిస్తానని గీతాచార్యుడు ప్రకటించి ఉన్నాడు.

ఈ క్షణమే మొదలుపెడదాం

మరి శ్రీకృష్ణుడు ఇప్పుడు ఎక్కడున్నాడు? ప్రపంచంలో నానాటికీ అధర్మం, అశాంతి, నేరాలు, అసంతృప్తి పెరిగిపోవడం మనం చూస్తున్నాం. మరి ఇటువంటి పరిస్థితుల్లో శ్రీ కృష్ణుడు ఎక్కడున్నాడని చాలామంది ప్రశ్నిస్తుంటారు. ఈ క్షణంలోనూ ఆయన మన మధ్యే ఉన్నాడు. మనందరికీ నిత్యం అందుబాటులోనే ఉంటున్నాడు! ప్రస్తుత యుగంలో కృష్ణపరమాత్మ తన పవిత్ర నామ రూపంలో ఈ లోకాన అవతరించాడని శాస్త్రాలు వివరిస్తున్నాయి.

కలికాలే నామ రూపే కృష్ణావతార
నామ హోయితే హయ సర్వ-జగత్-నిస్తార||

ప్రస్తుత కలియుగంలో భగవంతుడి పవిత్ర నామం, హరేకృష్ణ మహామంత్రమే పరమాత్మ అవతార స్వరూపం. ఆ పవిత్ర నామాన్ని జపించినంత మాత్రాన భగవంతుడితో ప్రత్యక్షానుభూతి లభిస్తుంది. సమస్త కర్మ ఫలాల నుంచి విముక్తి లభిస్తుంది. (చైతన్య చరితామృతం 17.22)

దోష నిధి అయిన కలియుగానికి ఒక గొప్ప గుణం కూడా ఉంది. అదేమిటంటే.. కృష్ణనామ స్మరణమే!

కలేర్దోషనిధే రాజన్నస్తి హ్యేకో మహాన్గుణః
కీర్తనాదేవ కృష్ణస్య ముక్తసఙ్గః పరం వ్రజేత్
(శ్రీమద్భాగవతం 12.3.51)

రాజా! కలియుగం దోషసాగరమే అయినప్పటికీ దీనిలో ఉన్న ఒక మహాగుణం ఏమంటే.. కేవలం హరేకృష్ణ నామాన్ని కీర్తించడం. ఈ మహామంత్రాన్ని స్మరించడం చేత మనుషులు భవబంధ విముక్తులై పరంధామానికి చేరగలుగుతారు.

శ్రీకృష్ణుడి పవిత్ర నామం ఒక్కటే కలియుగంలో మోక్షానికి గల ఏకైక మార్గమని సమస్త వైదిక శాస్త్రాలూ వివరిస్తున్నాయి.

నామ విను కలికాలే నాహి ఆర ధర్మ
సర్వ మంత్ర సార నామ, ఏయ్ శాస్త్ర మర్మ||
(చైతన్య చరితామృత, ఆది లీల 7.14)

ప్రస్తుత కలియుగంలో పవిత్ర భగవన్నామ ఉచ్చారణ కన్నా.. గొప్పదైన ధర్మం మరొకటి లేదు. ఇదే సమస్త వైదిక సూక్తుల సారం. సమస్త శాస్త్రాల మర్మం. ఆ పవిత్ర మహామంత్రం:

హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే
హరే రామ హరే రామ రామ రామ హరే హరే

హరేకృష్ణ మహామంత్రంలోని ఈ పదహారు పదాలు ప్రత్యేకంగా కలి కల్మషాలను నిర్మూలిస్తాయి. కలి దోషాల నుంచి తమను తాము రక్షించుకునేందుకు ఈ పదహారు నామాలు కాకుండా, ఇందుకు ప్రత్యామ్నాయం మరొకటి కనిపించదని భాగవతుల సందేశం. ఈ మహామంత్రాన్ని జాతి, కుల, మత, ప్రాంత, వర్ణ, లింగ, వయో భేదాలేవీ లేక ప్రతిఒక్కరూ జపించవచ్చు. జపించడం అంటే మృదువుగా మంత్రాన్ని ఉచ్చరిస్తూ, భక్తిశ్రద్ధలతో వినడం. ఈ మంత్రం కేవలం మనసులో ఆంతరికంగా జపించేది కాదు. జిహ్వా, పెదాలను కది



లిస్తూ, మంత్రాన్ని ఉచ్చరిస్తూ శ్రద్ధతో వినాలి. మంత్రాన్ని జపించేటప్పుడు ఉద్దేశపూర్వకంగా ఏ విషయాన్ని గురించి ఆలోచించకూడదు. కేవలం జపిస్తూ మంత్రాన్ని వినాలి. భగవన్నామ శబ్ద ప్రకంపనల్లోనే భగవంతుడు సాక్షాత్కరించి ఉంటాడు. ప్రతిరోజూ నిర్ణీత సంఖ్యలో మంత్రాన్ని జపించాలి. తొలుత చిన్న సంఖ్యతో ప్రారంభించి, క్రమంగా పెంచవచ్చు. ఒక్క మాల అంటే 108 సార్లు జపించాలి. ఆపై జపసంఖ్యను పెంచుతూ నిత్యం 16 మాలలు చేయడం అలవాటుగా చేసుకోవాలి. ఈ ఉత్కృష్టమైన మంత్రాన్ని పఠించడానికి మంచిరోజు కోసమో, సుముహూర్తం కోసమో వేచి చూడాల్సిన అవసరం లేదు. ఆ మంత్రాన్ని పఠించాలనే ఉద్దేశం కలగడమే భగవత్ అనుగ్రహానికి సంకేతం. కాబట్టి, శీఘ్రమే ప్రతి ఒక్కరూ హరేకృష్ణ మంత్రాన్ని జపించండి. ఆనందంగా జీవించండి.

... శ్రీమాన్ సత్యగౌరచంద్రదాస ప్రభూజీ
93969 56984

ఇస్లాం బోధ


నైతికతే పరమావధి

నైతిక విలువలు లేని విశ్వాసం అసంపూర్ణం. అందుకే .. 'విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్‌కు భయపడండి. సత్యవంతులకు తోడ్పడండి' అంటుంది ఖురాన్. అల్లాహ్ మీద విశ్వాసం ఉంచడంతోపాటు నైతిక విలువలు పాటించడం వల్ల మేలు కలుగుతుంది. కేవలం నమాజ్, రోజా తదితర ఆరాధనలను నిష్ఠగా పాటించి నిత్య జీవితంలో నైతికతను పాటించకపోతే అలాంటివారు స్వర్గ ప్రవేశానికి అర్హులు కారు. ఇతరులను పరుషంగా తిట్టినా, వారి మనసులను గాయపరచినా, తమ స్వార్థం కోసం ఇతరులపై దౌర్జన్యం చేసినా.. అలాంటి వ్యక్తుల పుణ్యఫలాలు బాధితులకు బదిలీ అవుతాయి. ఇలా ఇతరుల మనసు నొప్పించే వ్యక్తి ప్రవక్త(స) దృష్టిలో నిజమైన ముఫ్లిస్ (దరిద్రుడు). నమాజ్, ఉపవాసాల పట్ల శ్రద్ధాసక్తులు



చూపుతూ నైతికత కలిగి దానధర్మాలు చేస్తూ, ఇతరుల మనసు గాయపడకుండా నడుచుకునే వారు స్వర్గానికి వెళ్లడానికి అర్హత పొందుతారు. ఇస్లామీయ జీవన విధానంలో, వ్యక్తిత్వ నిర్మాణంలో నైతిక విలువలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. అందుకే ఈ విషయాలను ప్రవక్త(స) నిరంతరం బోధనల ద్వారా తన సహచరుల హృదయాల్లో నాటుకొనేలా కృషి చేశారు. విశ్వాసం, సంక్షేమం, నైతికత విడివిడి అంశాలు కావని.. ఈ మూడింటి సమ్మిళిత రూపమే ఇస్లాం అని తెలిపారు. ఆ భావనను తాత్వికంగా, సైద్ధాంతికంగా, భావజాల పరంగా ప్రచారం గావించారు. 'నోరు తెరిస్తే అబద్ధం చెప్పేవాడు, ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చని వాడు, తనకు అమానతుగా ఇచ్చిన దానిని కాజేసేవాడు, ఘర్షణ పడినప్పుడు తిట్టేవాడు కపట స్వభావి' అని ప్రవక్త(స) తెలిపారు.

... ముహమ్మద్ ముజాహిద్
96406 22076



జితం సర్వం జితేరసే

శుక యోగి పరీక్షిత్తుతో.. రాజా! నందరాజు ఏకాదశీ పుణ్యతిథి దినాన ఉపవసించి ఉపేంద్రుని- విష్ణువుని విధి విధానంగా ఉపాసించాడు. అసురవేళ అని తెలియక వేకువ కాకముందే, ద్వాదశి గడియలు దాటిపోతాయేమోనని ఆకుల- కలవరపడుతూ స్నానానికై వెళ్లి యమునా జలంలో దిగాడు. వెంటనే జలానికి అధిదేవత అయిన వరుణుని దూత నందరాజుని పట్టి బంధించి వరుణ నగరానికి పట్టుకుపోయాడు. తెల్లవారి బృందావనంలో నందుని కానక గోపకులెల్లరూ కలతచెందారు. గ్రద్దన- వేగంగా బలరామకృష్ణులను పెద్దగా కేకలు పెట్టి పిలిచారు. అది వరుణ భృత్యుని మోసపు కృత్యమని గ్రహించి సత్య సంకల్పుడు- నందుని పట్టి కృష్ణుడు అగత్యం- అత్యవసరంగా వరుణలోకానికి వెళ్లాడు. ఆ సమయాన వారి(జల) పతి వరుణదేవుడు తన లోకానికి విచ్చేసిన దానవారిని, వారిజాక్షుడు శౌరిని వీక్షించి వినయంతో వందించి పూజించాడు. 'ప్రభూ! ఈ రూపంగా మీరు నా గృహానికి అపురూపంగా- అపూర్వంగా విజయం చేశారు' అని ఆప్యాయంగా పలికాడు.



ఉ|| 'ఏ విభు పాదపద్మ రతులెన్నడు నెవ్వరు బొందలేని పెంద్రోవ జరింతు రట్టి బుధతోషక! నీ వరుదెంచుటం బ్రమోదా వృతమయ్యె జిత్తము గృతార్థత నొందె మనోరథంబు నీ సేవ బవిత్ర భావమును జెందె శరీరము నేడు మాధవా!'


'పుండరీకాక్షా! పండితులను నిండుగా ప్రమోద- ఆనంద పరచువాడా! ఏ పరమేశ్వరుని పాదపద్మాల యందు సేదతీరిన వారు ఎప్పుడూ, ఎవ్వరూ పొందలేని పెంద్రోవ- గొప్ప దారిలో నడువ గలుగుతారో, అట్టి నీ మేలైన రాకతో నా డెందం- మనసు అమంద- అపరిమిత ఆనందంతో నిండిపోయింది. నా కోరిక తీరింది. నీ సేవ వల్ల నా శరీరం పావనమైంది. మహానుభావా! లోకాలన్నిటినీ అలవోకగా కప్పివేయగల మాయ నీకు అధీనమై ఉంటుంది. నీవు ఒప్పిదమై- సర్వాంగ సుందరమై విరాజిల్లు మంగళమూర్తివి. సద్బుద్ధి గలవారిని సంరక్షించడంలో సర్వదా సంసిద్ధుడవై ఉంటావు. ఘనమైన తపమే మహాధనంగా గల సన్మనస్కులకు- సజ్జనులకు నీవు సార్వభౌముడవు. ఓ వనమాలీ! అనఘా! (పాప రహితుడా!) నా పాపం, తను (దేహ) తాపం తొలగటానికి నీకు సాగిలపడి మ్రొక్కుతాను'. 'పురుషోత్తమా! నీవు పితృభక్తి పరాయణుడవు, మాయాదూరుడవు. పవిత్ర హృదయులైన భక్తులయందు ప్రేమ కలవాడవు. నా భృత్యుడు ఇంచుకైనా వివేకం లేక, నీ తండ్రి అని ఎంచక, ఈయనను నా వద్దకు తెచ్చాడు. దయతో నీ జనకుని గొనిపొమ్ము. కృపానిధీ! నా అపచారం మన్నించి నన్ను, నా భటుణ్ణీ కాపాడు' అని వేడుకుంటున్న వరుణుణ్ని కరుణించి వాసుదేవుడు, తన జనకుని తోడుకొని గోకులానికి తిరిగి వచ్చాడు.

మూలంలో వరుణుడు అశరణ శరణుని కృష్ణుని ప్రస్తుతించే ప్రసంగంలో 'పితృవత్సల!' అని మాత్రమే ఉండగా పోతన 'జనక వత్సల, నిర్మల, భక్తవత్సలా' అని విస్తరించాడు. గోపకులందరూ శ్రీకృష్ణుని సాక్షాత్ విష్ణువుగా భావించారు. 'తన ఏకాంత- అనన్య ప్రేమీ భక్తులు మాత్రమే దర్శించగల తన మాయాతీతమైన పరంధామాన్ని- బ్రహ్మమనే నామం కల స్వస్థానాన్ని మాకు కూడా చూపితే ఎంతో బాగుండు కదా!' అని ఆశపడ్డారు. సర్వజ్ఞుడైన భగవానుడు తన బంధువుల మనోభావం గ్రహించి దయతో ఇలా తలచాడు.

ఆ|| 'ప్రకృతి కామ కర్మ పరవశమై యుచ్చ నీచ గతుల బొంది నెఱయ బ్రమసి తిరుగుచున్న జనము తెలియనేరరు నిజ గతి విశేషమీ జగంబు నందు'

ఈ సంసారంలో జీవులు అజ్ఞానం వల్ల తమ దేహాలనే ఆత్మగా భ్రమించి బహువిధాల కోరికలతో సతమతమవుతూ, వాటిని తీర్చుకోడానికి అనేక కర్మలలో తగులుకొని, తత్ఫలంగా ఉత్తమ, అధమ (దేవ, మనుష్య, పశు పక్ష్యాది) జన్మలను పొంది భ్రాంతితో సంచరిస్తున్నారు. వాస్తవికమూ, అసాధారణమూ అయిన నా నిజస్వరూప విశేషాలను గ్రహించ లేకుండా ఉన్నారు.

మ|| 'అని చింతించి దయాళుడైన హరి మాయాదూరమై జ్యోతియై యని రూప్యంబయి, సత్యమై యెఱుకయై, ఆనందమై బ్రహ్మమై యనఘాత్ముల్ గుణ నాశమందు గను నిత్యాత్మీయ లోకంబు గ్రక్కున జూపెం గరుణార్ద్ర చిత్తుడగుచున్ గోపాలక శ్రేణికిన్'




మన పోతన మధురిమ 184 వ భాగం

'రాజా! అలా భావించి దయా స్వరూపుడైన ఆ దామోదరుడు, మాయకు అతీతము, పరంజ్యోతీ స్వరూపము, ఇదం- ఇత్థం- ఇది, ఇట్టిది అని నిరూపించరానిది, సత్యము- త్రికాలలో నశించనిది, జ్ఞానానందమయ పరబ్రహ్మము, త్రిగుణ రహితులు సమాధి నిష్ఠులైన పరమ పుణ్యాత్ములు మాత్రమే దర్శించ గలిగిన తన శాశ్వతలోకాన్ని దయతో వారికి చూపించదలచాడు. పరమాత్మ, పూర్వం అక్రూరునికి తన స్వరూపాన్ని చూపించిన, యమునలోని 'బ్రహ్మహ్రదం' అనే మడుగు వద్దకు తీసుకువెళ్లాడు. నందాది గోపకులందరూ అందులో మునిగి పరంధామాన్ని దర్శించారు. పరమానందం పొందారు. వేదాలన్నీ రూపుదాల్చి యశోదానందనుని కృష్ణుని కీర్తిస్తుండగా చూచి వారు విస్మయం చెందారు. హంస స్వరూపుడైన పరమాత్ముని అవలోకించి- తిలకించి, అర్చించి పులకించారు.' పై మత్తేభ వృత్తంలో మూలశ్లోకానికి చాల విధేయమైన ఉత్తమ అనువాదం అందించి కవి సత్తముడు పోతన తన వాగ్జాలంలో భావుక భక్తుల చిత్తాలను బంధించాడు.

'ఆదిదేవో మహాదేవో దేవేశో దేవభృద్గురుః' (విష్ణు సహస్ర నామ స్తోత్రం)- శ్రీకృష్ణుని దేవాధి దేవత్వాన్ని నిరూపించటానికి భాగవత దశమ స్కంధంలో చతుర్ముఖ బ్రహ్మ, ఇంద్ర, వరుణుల పరాభవం ప్రస్తావించబడింది. బ్రహ్మకి, నేను సృష్టికర్తను అన్న అభిమానం. ఆయన మాయం చేసిన గోపబాలుర, దూడల రూపాలను కైటభారి కృష్ణుడు తానే ధరించి హాటకగర్భు (బ్రహ్మదేవు)ని ఆట కట్టించాడు. గోవర్ధనలీలలో 'నేను నాక (స్వర్గ) పతిని, లోక పాలుణ్ని, వర్ష అధి దేవతని' అన్న పాకశాసను (ఇంద్రు)ని అహంకారాన్ని నిరాకరించాడు. ఇప్పుడు వరుణ లోకం నుండి తన జనకుని క్షేమంగా తెచ్చుకొన్న ఈ వరుణ పరాభవ ప్రసంగం ద్వారా శ్రీకృష్ణుని రాసక్రీడకు ద్వారం తెరువబడింది. రాసలీలకు ముందుగా ముఖద్వారంగా కానవచ్చే ఈ ఘట్టం పరిమాణంలో ఊన- చిన్నదైనా మహిమలో ఘనమై మిక్కిలి మనన యోగ్యమైనది.

'వరుణుడు మన రసనేంద్రియానికి- నాలుకకు అధిపతి- ఏలిక. ఆయన దూతలు షడ్రుచులు- ఉప్పు, పులుపు, తీపి, చేదు, కారం, వగరు అనేవి. రసనేంద్రియాన్ని- జిహ్వని జయించనిదే ఎవ్వరూ రాసలీలలో ప్రవేశానికి నోచుకోలేరు. షడ్రసాల వ్యసనపరునికి వాసుదేవుని భాసురమైన రాసరసం- బ్రహ్మానందం లభించదు. నందుడు జీవులకు ప్రతినిధి. జీవుడు కృష్ణభక్తి అనే కాళింది (యమున)లో స్నానానికి దిగగానే వరుణ సేవకులైన షడ్రసాలు- ఆరు రుచులు అతనిని బంధించడానికి పూనుకొంటాయి. జీవాత్మ శబ్ద, స్పర్శాది లౌకిక- భౌతిక విషయ రసాలకు వశమై ఉన్నంతవరకు అలౌకిక- నిర్విషయమైన బ్రహ్మరసాన్ని ఆస్వాదించజాలదు. షడ్రసాలను జయించడానికి భక్తిరసాన్ని ఆశ్రయించాలి, సాధించాలి. ఈ కాలంలో మానవుని ఎక్కువ సమయం జిహ్వేంద్రియ, గుహ్యేంద్రియ (ఉపస్థ)ములను తృప్తిపరచడంతోనే- రస, స్పర్శ సుఖానుభవంతోనే గడచిపోతుంది అని డోంగ్రే మహారాజ్ ఈ లీలా పరమార్థాన్ని చాలా చక్కగా వక్కాణించారు. 'వయసిగతే కః కామ వికారః'- తిరిగి రాని యవ్వనం తరిగిపోతే మరుని- కాముని వికారమన్నా కనుమరుగై పోతుందేమో కాని రసనేంద్రియం మాత్రం అంతకంతకూ మెరుగుపడుతూ- పెచ్చరిల్లుతూ చచ్చేవరకు కచ్చ(కక్ష) కట్టి వ్యసనాన్ని- కష్టనష్టాలను కలిగిస్తూనే ఉంటుంది. 'సాధకుడు సంయమం పాటిస్తూ వివేకంతో ఆహారం స్వీకరించక ఇతర ఇంద్రియాలను శీఘ్రతరంగా తరించ- జయించ గలిగినా రసనేంద్రియం- నాలుక మాత్రం అంత తేలికగా వశం కాదు. తిండి పెట్టక మాడిస్తే దాని కండబలం పెరిగి ఇంకా చండ ప్రచండమవుతుంది. ఉద్ధవా! 'జితం సర్వం జితేరసే'- నాలుకను లొంగ తీసుకుంటే ఇంద్రియాలన్నీ వంది మాగధుల వలె వంగి-వంగి వందనాలు చేస్తాయి' అని భాగవతం ఏకాదశ స్కంధంలో ఉద్ధవునికి భగవానుని మహోపదేశం. నమోస్తు తే వ్యాస విశాల బుద్ధే!

(సశేషం)



తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

కథాసుధ

శరీరం విలువ



ఓ రాజు భటులతో కలిసి వేట కోసం అడవికి వెళ్లాడు. జంతువులను వేటాడుతూ రాజు దారి తప్పాడు. సూర్యాస్తమయం కావస్తున్నా.. భటులు తమ రాజును కలుసుకోలేకపోయారు. అప్పటికే రాజు బాగా అలసిపోయాడు. చీకట్లు ముసురుకుంటుండటంతో ఆయనకు విశ్రాంతి తీసుకోవాలనిపించింది. ఇంతలో ఓ సాధువు కనిపించాడు. తను విశ్రమించడానికి ఏదైనా వసతి చూపాల్సిందిగా సాధువును కోరాడు రాజు. పక్కనే ఉన్న తన చిన్న గుడిసె చూపించి, అందులో విశ్రాంతి తీసుకోమని చెప్పాడు సాధువు. ఆ మాటకు రాజుకు కోపం వచ్చింది. 'నేనెవరో తెలుసా! ఈ రాజ్యానికి రాజును. ఏనుగు చచ్చినా బతికినా వెయ్యే అన్నట్లు ఎక్కడ ఉన్నా నేను రాజునే' అన్నాడు. సాధువు నవ్వుతూ 'బొందిలో ప్రాణం ఉన్నంతవరకే ఈ శరీరానికి విలువని మరిచారు రాజా! మీరు మరి కొద్ది దూరం వెళ్లండి. ఇంకేదైనా వసతి దొరుకుతుందేమో...' అన్నాడు. చీకటి పడతుండటం, దారి తెలియక పోవడంతో సాధువును సాయం రావాల్సిందిగా కోరాడు రాజు. ఇద్దరూ నడక ప్రారంభించారు. కాసేపటికి పెద్ద గులాబీ తోట మధ్యలో ఓ రైతు ఇల్లు వారికి కనిపించింది. ఇద్దరూ వెళ్లి రైతును కలిసి పరిచయం చేసుకుని విషయం వివరించారు. రైతు వారిని లోనికి ఆహ్వానించాడు. వారికి పాలు, పండ్లు ఇచ్చాడు. అక్కడికి వంద అడుగుల దూరంలో చిన్న కొలను ఉంది. అక్కడ పడుకోవడానికి అనువైన స్థలాన్ని రాజుకు చూపాడు రైతు. అటుగా వెళ్తుంటే రాజు చెప్పులు తెగిపోయాయి. రైతే స్వయంగా వాటిని తన ఇంట్లో పెట్టించాడు. రాజు కొలను ఒడ్డున ప్రశాంతంగా నిద్రించాడు. తెల్లవారడంతోనే రాజు, సాధువు ఇద్దరూ నిద్రలేచారు. కళ్లు నులుముకుంటూ.. 'రాత్రంతా శరీరం విలువ గురించి మీరన్న మాటలే మెదిలాయి. నేను రాజును కదా, నా ప్రాణం పోయాక, ప్రజలు నన్ను పట్టించుకోరా?' అని అడిగాడు రాజు. సాధువు నవ్వి 'మీరు నాకు సహకరిస్తే ఇప్పుడే రుజువు చేస్తాను!' అన్నాడు. రాజును ప్రాణం పోయిన వాడిలా నటించమన్నాడు. రాజు అలాగే శవంలా పడుకున్నాడు. సాధువు రైతు దగ్గరికి వెళ్లి.. 'రాజు చనిపోయాడని, భటులు వచ్చేంతవరకు రాజు మృతదేహాన్ని మీ ఇంటి వరండాలో ఉంచమ'ని కోరాడు. రైతు కనికరం లేకుండా, సాధువు ముఖం మీదే తలుపు వేశాడు. 'అలా చేస్తావేం! ఎంతైనా మన రాజుగారు కదా!' అన్నాడు సాధువు. 'రాజైనా, భటుడైనా.. ఊపిరి పోయాక మిగిలేది శవమే కదా! ఎవరైనా మృతదేహాన్ని ఇంట్లో పెట్టుకుంటారా?' అని కేకలేశాడు. ఇదంతా ప్రత్యక్షంగా అనుభవించిన రాజుకు జ్ఞానోదయం అయ్యింది. తెగిన చెప్పులకున్న విలువ కూడా ప్రాణం లేని శరీరానికి ఉండదని తెలుసుకున్నాడు.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు
93936 62821

ఉపనిషత్ వాక్యం

ముగ్గురు దొంగలు

'ప్రకృతిః త్రిగుణావలంబినీ' అంటుంది యోగసారోపనిషత్తు. అంటే ప్రకృతి త్రిగుణాలను ఆధారంగా చేసుకొని సంచరిస్తున్నదని భావం. ప్రకృతి అంటే లోకాన్ని నడిపించే మాయ. ఇదీ పరబ్రహ్మంలో ఒక భాగమే! మాయతోనే మనసు లేదా మాయే మనసు.. అనుకోవచ్చు. మనసనేది త్రిగుణాలతో కూడి ఉంటుంది. మనుషుల నడుమ వ్యవహారాలలో అనేక భేదాలు గోచరించడానికి ఇవే కారణం. సత్వరజస్తమో గుణాలే త్రిగుణాలు. వీటి నిష్పత్తులలోని భేదాలే ఒక్కొక్కరి ప్రత్యేక వ్యక్తిత్వాలు.

ఒకసారి ఒకతను దట్టమైన అరణ్యంలో ప్రయాణిస్తున్నాడు. ఇంతలో ముగ్గురు దొంగలు అటకాయించి అతణ్ని నిలువుదోపిడీ చేశారు. ఒక దొంగ కత్తి దూసి నరకబోయాడు. మరొకడు అడ్డుకొని 'అంత పని చేయకు. వీడి కాళ్లు చేతులు కట్టి పారవేస్తే సరి. మనం పారిపోవచ్చు' అన్నాడు. అలాగే చేసి అక్కడినుంచి వెళ్లిపోయారు దొంగలు. కాసేపటికి ఇద్దరు దొంగల కళ్లుగప్పి మూడో దొంగ తాము బంధించిన బాటసారి దగ్గరికి వచ్చాడు. అతని కట్లు విప్పాడు. 'బాధ పడకు. నాతో రా!' అన్నాడు. వెంటబెట్టుకుని అడవి దాటించి అతని ఊరు వెళ్లే దారి మీద వదిలేశాడు. 'తిన్నగా వెళ్తే మీ ఊరు చేరుకుంటావు' అన్నాడు. బాటసారి అతనికి కృతజ్ఞతలు చెప్పాడు. 'మీరు ఎంతో దయామయులు. మా ఇంటికి వచ్చి ఆతిథ్యం స్వీకరిస్తే చాలా సంతోషిస్తాం' అని ప్రాధేయపడ్డాడు. అప్పుడు ఆ దొంగ 'అమ్మ బాబోయ్! నేను రాకూడదు. వస్తే రక్షకభటులు పట్టుకుంటారు కదా!' అన్నాడు. రామకృష్ణ పరమహంస ఒకసారి మహేంద్రనాథ దత్తకు ఈ కథ చెప్పి 'సంసారమే మహారణ్యం. సత్వ రజ స్తమో గుణాలే ముగ్గురు దొంగలు. తమో గుణం నాశనం చేస్తుంది. రజో గుణం బంధిస్తుంది. సత్వ గుణం మాత్రం వీటన్నిటి నుంచి తప్పిస్తుంది. అయినా బ్రహ్మ జ్ఞానాన్ని కలిగించజాలదు. 'అదిగో పరబ్రహ్మం' అని దూరం నుంచి చూపించి నిష్క్రమిస్తుంది' అని వివరించాడు.



... డా.వెలుదండ సత్యనారాయణ

లంక జయకేతనం

2-0తో సిరీస్ క్లీన్‌స్వీప్ • 15 ఏండ్ల తర్వాత కివీస్‌పై చరిత్రాత్మక విజయం



గాలె: స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగిన రెండు టెస్టు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను శ్రీలంక 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. గాలె వేదికగా జరిగిన రెండో టెస్టులో లంకేయులు కివీస్‌పై ఇన్నింగ్స్ 154 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించి 15 ఏండ్ల తర్వాత న్యూజిలాండ్‌పై టెస్టు సిరీస్‌ను గెలుచుకోవడం విశేషం. ఆట నాలుగో రోజు ఓవర్ నైట్ స్కోరు 199/5వ వద్ద ఇన్నింగ్స్ ఆరంభించిన టిమ్ సౌథీ సేన.. 81.4 ఓవర్లలో 360 పరుగులకు ఆలౌట్ అయింది. తొలి ఇన్నింగ్స్ (88 ఆలౌట్)తో పోలిస్తే కాస్త మెరుగ్గానే ఆడినా పర్యాటక జట్టుకు పరాభవం తప్పలేదు. లంక ఫీల్డర్లు పలు క్యాచ్‌లు జారవిడిచినా, స్టంప్ అవుట్స్ నుంచి తప్పించుకున్నా న్యూజిలాండ్ బ్యాటర్లు వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయారు. గ్లెన్ ఫిలిప్స్ (78), మిచెల్ సాంట్నర్ (67), టామ్ బ్లండెల్ (60) ఇన్నింగ్స్ ఓటమి నుంచి తప్పించడానికి పోరాడారు. లంక బౌలర్లలో తొలి టెస్టు ఆడిన నిషాన్ పీరిస్ (6/170) రాణించగా లెఫ్టార్మ్ స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య (3/139) లోయరార్డర్ పనిపట్టాడు. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 182 పరుగులు చేసిన కమిందు మెండిస్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు రాగా సిరీస్‌లో 18 వికెట్లు పడగొట్టిన జయసూర్యకు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' దక్కింది. ఈ విజయంతో వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో లంక మూడో స్థానం (55.56 శాతం)లోకి దూసుకొచ్చింది. ఈ జాబితాలో భారత్ (71.67), ఆస్ట్రేలియా (62.5) తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి.

వర్షం లేకున్నా ఆట సాగలె..

మూడో రోజూ అదే కథ • భారత్, బంగ్లాదేశ్ టెస్టు



కాన్పూర్: భారత్, బంగ్లాదేశ్ మధ్య కాన్పూర్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో మూడో రోజు ఆట కూడా రద్దైంది. ఆదివారం వర్షం లేకపోయినా ఉదయం నుంచి ఎండ బాగానే కాసినా మైదానం చిత్తడిగా ఉండటంతో ఆట సాధ్యం కాలేదు. దీంతో వరుసగా రెండు రోజులూ ఒక్క బంతి కూడా పడకుండానే ఆట రద్దవడం గమనార్హం. తొలి రోజు 35 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమవగా రెండు రోజుల పాటు మ్యాచ్‌కు అంతరాయం కలిగించిన వరుణుడు మూడో రోజు కాస్త తెరిపినిచ్చినా ఔట్ ఫీల్డ్ అనువుగా లేకపోవడంతో మ్యాచ్ సాగలేదు. వర్షం లేకపోవడంతో మ్యాచ్‌ను ఆస్వాదిద్దామని భావించి స్టేడియానికి పోటెత్తిన కాన్పూర్ వాసులకు నిరాశ తప్పలేదు. ఉదయం 9 గంటలకు ఒకసారి 10 గంటలకు మరోసారి మైదానాన్ని పరిశీలించిన అంపైర్లు ఔట్ ఫీల్డ్ చిత్తడిగా ఉండటంతో మ్యాచ్‌ను నిర్వహించడం కష్టమని ప్రకటించారు. గ్రౌండ్ సిబ్బంది మైదానాన్ని ఆరబెట్టేందుకు కృషి చేసినా ఫలితం లేకుండా పోయింది. మధ్యాహ్నం 2 గంటలకు మళ్లీ పరిశీలనకు వచ్చిన మ్యాచ్ నిర్వాహకులు మైదానం అలాగే ఉండటంతో మూడో రోజు ఆటను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. ఏదైనా అద్భుతం జరిగితే తప్ప ఈ మ్యాచ్ డ్రాగా ముగియడం ఖాయంగా కనిపిస్తోంది. అదే జరిగితే భారత్ వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల మీద ప్రభావం పడే అవకాశముంది.

క్వార్టర్స్‌కు అల్కారజ్

• చైనా ఓపెన్




బీజింగ్: టాప్ సీడ్ కార్లోస్ అల్కారజ్ (స్పెయిన్) చైనా ఓపెన్‌లో క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. బీజింగ్‌లో జరుగుతున్న ఈ టోర్నీ పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో రెండో సీడ్‌గా బరిలోకి దిగిన అల్కారజ్.. 6-1, 6-2తో టాలన్ గ్రీక్‌స్పూర్ (నెదర్లాండ్స్)ను ఓడించాడు. ప్రత్యర్థి నుంచి కనీస ప్రతిఘటన కూడా లేకుండానే ఈ స్పెయిన్ కుర్రాడు మ్యాచ్‌ను ముగించాడు. క్వార్టర్స్‌లో అతడు కరెన్ కచనోవ్ (రష్యా)తో తలపడాల్సి ఉంది. మహిళల డబుల్స్‌లో అమెరికా టెన్నిస్ క్రీడాకారాణి కోకో గాఫ్ 7-5, 6-2తో కేటీ బౌల్టర్ (బ్రిటన్)ను చిత్తుచేసి ప్రిక్వార్టర్స్‌కు చేరింది. రౌండ్-32లో మరో టాప్ సీడ్ జెస్సికా పెగుల 6-7 (9/11), 6-1, 6-2తో వెరొనిక (రష్యా)ను ఓడించింది.

డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడమే..!

కాన్పూర్: వరుణుడు తెరిపినిచ్చాడు.. రోజంతా ఎండ కాచింది.. స్టేడియాన్ని కప్పి ఉంచే కవర్లూ కనిపించలేదు.. అయినా కాన్పూర్ టెస్టులో మూడోరోజు మాత్రం ఒక్క బంతీ పడలేదు. ఆట ఎప్పుడు మొదలవుతుందా? తమ అభిమాన క్రికెటర్లను ఎప్పుడెప్పుడు చూస్తామా? అని వందలాది కిలోమీటర్లు ప్రయాణించి కాన్పూర్‌కు చేరిన ఫ్యాన్స్‌కు నిరాశ తప్పలేదు. దీనికి ప్రధాన కారణం 'గ్రీన్‌పార్క్'లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడమేనన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండో టెస్టు రెండో రోజు వర్షం కురిసినా ఆదివారం రాత్రి నుంచి అక్కడ వరుణుడు శాంతించి రోజంతా సాధారణ ఉష్ణోగ్రతలే నమోదయ్యాయి. కానీ మూడుసార్లు మైదానాన్ని పరిశీలించిన మ్యాచ్ నిర్వాహకులు ఔట్‌ఫీల్డ్ తడిగా ఉండటంతో ఆట సాగదని తేల్చేశారు. మైదానంలోని థర్టీ యార్డ్ సర్కిల్‌తో పాటు డీప్ మిడ్‌వికెట్ వద్ద లోపలి భాగం తడిగా ఉన్నట్టు మ్యాచ్ రిఫరీ జెఫ్ క్రో అభిప్రాయపడ్డారు. అయితే దీనిపై పిచ్ క్యూరేటర్ శివ్ కుమార్ మాత్రం మరో విధంగా స్పందించాడు. 'వాళ్లు (పరిశీలనకు వచ్చిన వారు) మూడుసార్లు మైదానాన్ని పరిశీలించారు కానీ అసలు సమస్య ఏంటో మాకు చెప్పలేదు. ఒకవేళ అలా చెప్పుంటే మేం అందుకు తగ్గ చర్యలు తీసుకునేవాళ్లం. మీకు ఏదైనా సమస్య ఉంటే మాకు చెప్పండి అని కూడా చెప్పాను' అని తెలిపాడు. తాజా పరిస్థితుల నేపథ్యంలో కాన్పూర్ ఇక టెస్టు మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదంలో పడింది. యూపీ రాజధాని లక్నోలోని ఏకనా స్టేడియంలో అధునాతన వసతులు కలిగి ఉండటంతో ఇకనుంచి గ్రీన్ పార్క్‌కు ఆతిథ్య హక్కులు దక్కడం కష్టమేనని తెలుస్తోంది.

భారత షూటర్లకు స్వర్ణాలు



లిమా (పెరూ): ఇంటర్నేషనల్ షూటింగ్ స్పోర్ట్ ఫెడరేషన్ (ఐఎస్‌ఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో లిమా వేదికగా జరుగుతున్న జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్లు అదరగొట్టారు. పురుషులు, మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్స్‌లో స్వర్ణ పతకాలు గెలుచుకున్నారు. పురుషుల విభాగంలో ఉమేశ్, ప్రద్యుమ్న సింగ్, ముకేశ్‌తో కూడిన భారత త్రయం.. 1,726 పాయింట్లు సాధించి స్వర్ణాన్ని ముద్దాడింది. ఇటలీకి రజతం దక్కగా రొమానియా కాంస్యం సాధించింది. మహిళల కేటగిరీలో కనిష్క, లక్షిత, అంజలి.. 1,708 పాయింట్లతో బంగారు పతకాన్ని నెగ్గారు. అజర్‌బైజాన్, ఉక్రెయిన్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. మహిళల వ్యక్తిగత ఈవెంట్‌లో కనిష్క కాంస్యం సాధించింది. ఇక పురుషుల వ్యక్తిగత 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్ చేరిన ఉమేశ్, ప్రద్యుమ్న.. 6, 8 స్థానాల్లో నిలిచారు.

సిరీస్ ఆసీస్‌దే..

లండన్: ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను ఆసీస్ 3-2తో కైవసం చేసుకుంది. ఆదివారం బ్రిస్టోల్‌లోని కౌంటీ గ్రౌండ్ వేదికగా జరిగిన ఆఖరి వన్డేలో ఆస్ట్రేలియా.. 49 పరుగుల తేడా (డక్‌వర్త్‌లూయిస్ పద్ధతిలో)తో గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్.. 49.2 ఓవర్లలో 309 పరుగులు చేసింది. అనంతరం వర్షం కురిసే సమయానికి కంగారూలు.. 20.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 165 పరుగులు చేశారు. ట్రావిస్ హెడ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ అవార్డులు లభించాయి.

హైదరాబాద్‌లో పికిల్‌బాల్ చాంపియన్‌షిప్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: వచ్చే ఏడాది జనవరిలో హైదరాబాద్ వేదికగా ఆసియన్ ఓపెన్ పికిల్‌బాల్ చాంపియన్‌షిప్‌ను నిర్వహించనున్నట్టు అమెచ్యూర్ తెలంగాణ పికిల్‌బాల్ అసోసియేషన్ (ఏటీపీఏ) అధ్యక్షుడు రావుల శ్రీధర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసియా వ్యాప్తంగా అండర్-12, 14, 16, 19+, 35+, 60+ కేటగిరీలలో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పోటీలను నిర్వహించనున్నట్టు ఏటీపీఏ తెలిపింది.

బోర్డు సంపన్నం.. వసతులు అధ్వానం..

ముంబై: ప్రపంచ క్రికెట్‌ను కనుసైగతో శాసించగల బీసీసీఐ అత్యంత సంపన్న బోర్డులలో ఒకటి. ఐపీఎల్ పుణ్యమా అని వేల కోట్ల రూపాయలు ఆర్జిస్తున్న బీసీసీఐ.. మైదానాల్లో కనీస వసతులు కల్పించడంలో దారుణంగా విఫలమవుతోంది. 2023 ఐపీఎల్ ఫైనల్ సందర్భంగా ప్రపంచంలోనే అత్యధిక సీటింగ్ సామర్థ్యం కలిగిన అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో మైదానాన్ని డస్టర్లు, ఫ్యాన్లతో ఆరబెట్టడం విమర్శలకు తావిచ్చింది. ఇటీవలే అఫ్గానిస్థాన్, న్యూజిలాండ్ మధ్య నోయిడా వేదికగా అర్ధాంతరంగా ముగిసిన ఏకైక టెస్టులోనూ ఇదే కథ. అఫ్గాన్ క్రికెట్ బోర్డు కోరడంతో నోయిడాలో మ్యాచ్ నిర్వహణకు బీసీసీఐ అంగీకారం తెలిపింది. అక్కడా వర్షం లేకున్నా ఔట్ ఫీల్డ్ తడిగా ఉండటంతో ఐదు రోజుల్లో కనీసం టాస్ కూడా పడకుండానే మ్యాచ్ రద్దవడంతో సోషల్ మీడియాలో బీసీసీఐపై ట్రోలింగ్ వెల్లువెత్తింది. తాజాగా కాన్పూర్‌లోనూ ఇదే పునరావృతమవుతుండటంతో బీసీసీఐ క్రికెట్ అభిమానుల ఆగ్రహానికి గురవుతోంది. కోటానుకోట్ల రూపాయలు ఆర్జిస్తున్న బోర్డు.. స్టేడియాలలో కనీసం మ్యాచ్ నిర్వహణకు అవసరమయ్యే వసతులనూ సమకూర్చడం లేదని అభిమానులు వాపోతున్నారు.



కొత్త ఎన్‌సీఏ ప్రారంభం

బెంగళూరు విమానాశ్రయానికి చేరువలో సీవోఈ.. క్రికెటర్లకు వరం: వీవీఎస్ లక్ష్మణ్

బెంగళూరు: ప్రపంచంలోనే అత్యంత ధనిక బోర్డు అయిన భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) బెంగళూరులోని తమ కొత్త నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)ను ఆదివారం అట్టహాసంగా ప్రారంభించింది. బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి జై షా దీనిని అధికారంగా ప్రారంభించారు. కొత్త ఎన్‌సీఏకు బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ)గా పేరుపెట్టింది. ప్రపంచ ప్రమాణాలతో కూడిన అత్యాధునిక సౌకర్యాలతో సీవోఈను ఏర్పాటు చేసినట్టు బీసీసీఐ తెలిపింది. ప్రస్తుతమున్న ఎన్‌సీఏను బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియానికి సమీపాన ఉన్న ప్రదేశంలో నిర్వహిస్తుండగా.. తాజాగా ప్రారంభించిన సీవోఈను కెంపెగౌడ విమానాశ్రయం సమీపంలో సుమారు 40 ఎకరాల విశాల ప్రాంగణంలో నిర్మించారు.కొత్తగా ప్రారంభించిన సీవోఈకి హెడ్‌గా వ్యవహరిస్తున్న హైదరాబాదీ వీవీఎస్ లక్ష్మణ్ ఇక్కడి వసతులు భారత ఔత్సాహిక క్రికెటర్లకు ఓ వరమని అభివర్ణించాడు.



వసతులెన్నో..

సీవోఈలో మూడు ప్రపంచ స్థాయి గ్రౌండ్‌లు, 86 ప్రాక్టీస్ పిచ్‌లు (ఇండోర్ 41, ఔట్‌డోర్ 45), అత్యాధునిక సౌకర్యాలతో కూడిన రిహాబిటేషన్ సెంటర్, అండర్‌వాటర్ పూల్ స్పా, సకల సౌకర్యాలు కలిగిన జిమ్, ఒలింపిక్ ప్రమాణాలతో కూడిన స్విమ్మింగ్ పూల్, ఆరు ఔట్‌డోర్ రన్నింగ్ ట్రాక్‌లు వంటి ఎన్నో వసతులున్నాయి. మూడు ప్రధాన గ్రౌండ్లలో ఒకదానిని ముంబైలోని ఎర్రమట్టితో నిర్మించగా మిగతా వాటిని మాండ్య (కర్నాటక), కలహండి (ఒడిషా)లోని నల్లమట్టితో తయారుచేశారు. మెయిన్ గ్రౌండ్‌ను ఇంగ్లీష్ కౌంటీ గ్రౌండ్స్ తరహాలో రూపొందించారు. ఇక్కడ మ్యాచ్‌లను ఆడించేందుకు వీలుగా ఫ్లడ్‌లైట్లు, ఇతర వసతులూ కల్పించారు. యూకే, ఆస్ట్రేలియా నుంచి ప్రీమియం టర్ఫ్‌లతో 8 పిచ్‌లను తయారుచేశారు. సీవోఈని కేవలం క్రికెటర్లకే కాకుండా అథ్లెటిక్స్, ఇతర క్రీడల క్రీడాకారులూ ఉపయోగించుకునేలా తీర్చిదిద్దారు.

వారసుడిని త్వరగా గుర్తించండి!

బీసీసీఐ కార్యదర్శిగా త్వరలో ఆ పదవి నుంచి తప్పుకోనున్న జై షా వారసుడిని వీలైనంత త్వరగా గుర్తించాలని బోర్డు సభ్యులు అతడిని కోరినట్టు సమాచారం. బీసీసీఐ 93వ వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం) సందర్భంగా ఈ అంశం చర్చలోకి వచ్చింది. జై షా ఐసీసీ చైర్మన్ పదవి చేపట్టనున్న నేపథ్యంలో ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని సభ్యులు అభ్యర్థించినట్టు తెలుస్తోంది. ఈ పదవి రేసులో రోహన్ జైట్లీ (ఢిల్లీ), అషిష్ షెలార్ (ముంబై), దేవ్‌జిత్ సైకియా (గుజరాత్) రేసులో ఉన్నట్టు సమాచారం. ఇక ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్‌లో జనరల్ బాడీ రిప్రజెంటేటివ్స్‌గా అర్జున్ సింగ్ ధుమాల్, అవిశేక్ దాల్మియా ఎంపికయ్యారు. ఆంధ్రా మాజీ క్రికెటర్ వి. చాముండేశ్వరినాథ్ ఇండియన్ క్రికెటర్స్ అసోసియేషన్ (ఐసీఏ) ప్లేయర్ రిప్రజెంటేటివ్‌గా నామినేట్ అయ్యారు.

చిత్రం



700 మంది డ్యాన్సర్లతో పాట

దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లో కూడా సత్తా చాటుతున్నది కన్నడ సోయగం రష్మిక మందన్న. 'పుష్ప' 'యానిమల్' చిత్రాలతో ఆమె హిందీ బెల్ట్‌లో తిరుగులేని ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. ప్రస్తుతం రష్మిక మందన్న చారిత్రక చిత్రం 'ఛావా'లో నటిస్తున్నది. విక్కీ కౌశల్ కథానాయకుడు. ఛత్రపతి శివాజీ తనయుడు శంభాజీ జీవిత కథ ఆధారంగా, ఆయన మొఘల్స్‌పై చేసిన అసామాన పోరాటం నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. లక్ష్మణ్ ఊటేకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని భారీ వ్యయంతో రూపొందిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలోని ఓ పాటను 700 మంది డ్యాన్సర్లతో తెరకెక్కించబోతున్నారని తెలిసింది. శంభాజీ మహారాజ్ పట్టాభిషిక్తుడయ్యే సందర్భంలో వచ్చే ఈ పాట కోసం సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారట. 16వ శతాబ్దం నాటి సంగీత వాయిద్యాలతో మరాఠీ జానపద శైలిలో ఏ.ఆర్.రెహమాన్ ట్యూన్ సిద్ధం చేశారని తెలిసింది. మహారాష్ట్రలోని రాయ్‌ఘడ్ కోటలో ఈ పాటను చిత్రీకరించబోతున్నారు. 700 మంది డ్యాన్సర్లు, 1000 మందికిపైగా జూనియర్ ఆర్టిస్టులతో ఈ పాటను కన్నులపండువగా తీర్చిదిద్దబోతున్నామని దర్శకుడు లక్ష్మణ్ ఊటేకర్ చెప్పారు. ఇందులో కథానాయిక రష్మిక మందన్న నృత్యాలు ప్రధానాకర్షణగా నిలుస్తాయని అన్నారు. శివాజీ సావంత్ రాసిన 'ఛావా' నవల ఆధారంగా అదే పేరుతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. డిసెంబర్ 6న ప్రేక్షకుల ముందుకురానుంది.



బహిర్భూమికి ఓ చరిత్ర ఉంది

నోయల్, రిషిత నెల్లూరు జంటగా నటిస్తున్న చిత్రం 'బహిర్భూమి'. రాంప్రసాద్ కొండూరు దర్శకుడు. మచ్చ వేణుగోపాల్ నిర్మాత. అక్టోబర్ 4న సినిమా విడుదల కానుంది. హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. మంచి టీమ్‌తో అందరికీ నచ్చేలా తీసిన సినిమా ఇదని హీరో నోయల్ చెప్పారు. ' 'బహిర్భూమి' పేరుకు ఓ చరిత్ర ఉంది. అప్పట్లో బహిర్భూమి కోసం రెండు ఊళ్ల మధ్య గొడవలు జరిగేవి. ఈ పేరెందుకు పెట్టామో మూవీ చూస్తే తెలుస్తుంది.' అని దర్శకుడు అన్నారు. ఈ సినిమా నిర్మించినందుకు గర్వంగా ఉందని, అక్టోబర్ 4న సినిమాను విడుదల చేస్తున్నామని, త్వరలో ఇతర భాషల్లో కూడా విడుదల చేస్తామని నిర్మాత తెలిపారు.

అందరూ చూడాల్సిన సినిమా

తెలంగాణ నేపథ్య కుటుంబకథాచిత్రం 'లగ్గం'. సాయి రోనక్, ప్రగ్యా నగ్రా, రాజేంద్రప్రసాద్, రోహిణి ప్రధాన పాత్రధారులు. రమేశ్ చెప్పాల రచన, దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రానికి వేణుగోపాల్‌రెడ్డి నిర్మాత. అక్టోబర్ 25న ఏషియన్ సురేష్ ప్రొడక్షన్స్ ద్వారా చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం రిలీజ్ డేట్ పోస్టర్‌ని హీరో సుధీర్‌బాబు విడుదల చేసి, టీమ్‌కి శుభాకాంక్షలు అందించారు. కుటుంబం అంతా కలిసి చూడాల్సిన చిత్రమిదని రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆడపిల్ల తండ్రులు కూతుళ్లకి పెళ్లి చేసే ముందు ఈ చిత్రం చూడాలని ఎల్బీ శ్రీరామ్ తెలిపారు.







రొమాంటిక్ హీరోగా..?

బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ తెరంగేట్రానికి రంగం సిద్ధమైన విషయం తెలిసిందే. ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో మోక్షజ్ఞ తొలి చిత్రం తెరకెక్కనుంది. అయితే.. ఇది ఏ తరహా సినిమా అనేది అభిమానుల్లో నెలకొని ఉన్న ప్రశ్న. సాధారణంగా నందమూరి అభిమానులు మాస్ సినిమాలనే ఎక్కువగా ఇష్టపడతారు. మరి మోక్షజ్ఞని ప్రశాంత్‌వర్మ మాస్ అవతార్‌లోనే ప్రజెంట్ చేస్తున్నాడా?.. అంటే.. ఫిల్మ్ వర్గాలు కాదనే చెబుతున్నాయి. ఈ సినిమాలో మోస్ట్ రొమాంటిక్‌గా మోక్షజ్ఞని చూపించబోతున్నారట ప్రశాంత్‌వర్మ. అందుకు తగ్గట్టుగా రొమాంటిక్ లవ్‌స్టోరీనే ఆయన ఎంచుకున్నారట. ఈ సినిమాలోని ఓ ప్రత్యేక పాత్రలో బాలకృష్ణగానీ, కల్యాణ్‌రామ్‌గానీ నటించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇందులో హీరోయిన్‌గా ముందు శ్రీలీల పేరు వినిపించింది. కానీ.. దర్శకుడు ప్రశాంత్‌వర్మ ఆలోచన మాత్రం వేరేలా ఉందట. కచ్చితంగా హిట్ కొట్టాలనే తలంపుతో.. ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్‌కి ఎక్కువ సమయం తీసుకుంటున్నారు ప్రశాంత్‌వర్మ. దసరా రోజున ఈ సినిమా షూటింగ్ లాంఛనంగా ప్రారంభమయ్యే అవకాశం ఉంది. రెగ్యులర్ షూటింగ్‌కి మాత్రం టైమ్ పట్టేలా ఉందని సమాచారం.

తెలుగులో అలియా 'జిగ్రా'



యాక్షన్ ప్యాక్ట్ రోల్‌లో అలియాభట్ నటించిన బాలీవుడ్ చిత్రం 'జిగ్రా'. ఆపదలో ఉన్న తమ్ముడి కోసం అక్క చేసే పోరాటమే ఇతివృత్తంగా రూపొందిన ఈ చిత్రానికి వాసన్ బాలా దర్శకుడు. కరణ్ జోహార్, అపూర్వ మెహతా, షాహీన్ భట్, సోమెన్ మిశ్రాలతో కలిసి అలియాభట్ నిర్మించిన ఈ పాన్ ఇండియా చిత్రం అక్టోబర్ 11న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ద్వారా రానా దగ్గుబాటి ఈ సినిమాను తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా తెలుగు ట్రైలర్‌ని అగ్రహీరో రామ్ చరణ్ విడుదల చేశారు. 'జిగ్రా' తెలుగు ప్రేక్షకులకు గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించనున్నదని, అన్ని భాషల్లో సినిమాను విడుదల చేస్తామని, ఏషియన్ సురేశ్ సంస్థ ద్వారా రానా దగ్గుబాటి ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేయడం ఆనందంగా ఉందని నిర్మాతల్లో ఒకరైన అపూర్వ మెహతా అన్నారు. రానా మాట్లాడుతూ ' 'జిగ్రా' కథలోని సోల్‌కి ఏ భాష వారైనా కనెక్ట్ అవుతారు. ఇది కేవలం యాక్షన్ సినిమానే కాదు. కుటుంబంలోని అనుబంధాలను తెలిపే సినిమా. అక్కా, తమ్ముళ్లుగా అలియా, వేదాంగ్ రైనా అద్భుతంగా నటించారు.' అని రానా చెప్పారు.



అరుదైన గౌరవం

'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాతో ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చుకున్నారు హీరో రామ్‌చరణ్. త్వరలో ఆయనకు మరో గొప్ప గౌరవం కూడా దక్కబోతున్నది. సింగపూర్‌లోని ప్రతిష్ఠాత్మక మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియం వారు రామ్‌చరణ్ మైనపు బొమ్మను ఏర్పాటు చేయబోతున్నారు. చరణ్‌తోపాటు ఆయన పెంపుడు శునకం రైమీ కూడా ఈ విగ్రహంలో భాగం కావటం విశేషం. దీనికి సంబంధించిన ఫొటోషూట్ ఇప్పటికే పూర్తయింది. త్వరలోనే ఈ విగ్రహాన్ని రూపొందించి, ఆవిష్కరిస్తామని ఐఫా వేదికగా టూస్సాడ్స్ టీమ్ ప్రకటించింది. టూస్సాడ్స్ కుటుంబంలో తానూ భాగం కావడం గౌరవంగా భావిస్తున్నానని రామ్‌చరణ్ అన్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్‌మీడియాలో బాగా వైరల్ అవుతున్నది. స్టార్ హీరోల మైనపు బొమ్మలను ఇతర దేశాల మ్యూజియమ్స్‌లో ఏర్పాటు చేయడం తరచుగా జరుగుతున్న విషయమే. బాలీవుడ్‌లో అమితాబ్ దగ్గర్నుంచి ఖాన్స్ త్రయం, హృతిక్ రోషన్.. ఇలా చాలామంది మైనపు బొమ్మలను ఇతర దేశాల మ్యూజియమ్స్‌లో ఏర్పాటు చేశారు. తెలుగు హీరోల్లో ఆ గౌరవాన్ని దక్కించుకున్న హీరోల్లో మహేశ్‌బాబు, ప్రభాస్, అల్లు అర్జున్ ఉన్నారు. ఇప్పుడు వారి సరసన రామ్‌చరణ్ కూడా చేరబోతున్నారు.

'మా' సభ్యులకు ఫ్రీ హెల్త్ చెకప్

మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ సభ్యులందరికీ ఫ్రీ మాస్టర్ హెల్త్ చెకప్ క్యాంప్‌ను ఆదివారం నిర్వహించారు. 'మా' ఆధ్వర్యంలో జీవీకే హెల్త్ హబ్ ద్వారా ఈ హెల్త్ క్యాంప్ జరిగింది. ఈ క్యాంప్‌లో 'మా' సభ్యులంతా పెద్ద ఎత్తున పాల్గొన్నారు. 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు మాట్లాడుతూ 'డా.శాస్త్రిగారికి, జీవీకే హెల్త్ హబ్‌కు 'మా' తరఫున కృతజ్ఞతలు. వేల ఖర్చుతో కూడుకున్న హెల్త్ చెకప్‌ను ఉచితంగా అందించడం సామాన్యమైన విషయం కాదు. ఉదయం 7గంటల నుంచి ఎంతో ఓర్పుతో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. వీరి సేవాకార్యక్రమాలు ఇకపై కూడా ఇలాగే సాగాలని ఆశిస్తున్నా' అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో మాదల రవి, శివబాలాజీ, డా.శాస్త్రి కూడా మాట్లాడారు.



చిన్న పాత్రల నుంచి స్టార్ హీరోయిన్ రేంజ్‌కి

స్టార్ స్టేటస్ సాధించిన అతికొద్ది మంది తెలుగు హీరోయిన్లలో రీతూవర్మ ఒకరు. ఎంతో శ్రమిస్తేగానీ ఆమె ఈ స్థాయికి రాలేదు. హీరోయిన్ ఫ్రెండ్స్‌లో ఒకరిగా ఆమె కనిపించిన సినిమాలు చాలా ఉన్నాయి. 'పెళ్లి చూపులు'తో హీరోయిన్ స్థాయికి చేరుకున్న రీతూ.. కనులు కనులను దోచాయంటే, వరుడు కావలెను, టక్ జగదీష్ చిత్రాలతో స్టార్ హీరోయిన్ రేంజ్‌కి ఎదిగింది. తెలుగు హీరోయిన్లలో ప్రామిసింగ్ యాక్ట్రెస్‌గా పేరు సంపాదించుకుంది. తమిళంలోనూ క్రేజీ ప్రాజెక్టులు చేస్తున్నది. ఇవే కాక హాట్‌స్టార్ కోసం ఓ వెబ్‌సిరీస్‌లో నటిస్తున్నది. ఇది తను చేస్తున్న తొలి సిరీస్. ఇదిలావుంటే.. 'స్వాగ్' సినిమాతో త్వరలో ఆమె ప్రేక్షకుల ముందుకు రానున్నది. ఇందులో వింధ్యామర వంశ మహారాణి రుక్మిణీదేవి పాత్రలో మెరవనున్నది రీతూ. ఈ సినిమాలో ఆమె పాత్ర హైలైట్‌గా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు.





యువతరం మెచ్చే మిస్టర్ ఇడియట్

అగ్ర హీరో రవితేజ తమ్ముడి కుమారుడైన మాధవ్ హీరోగా పరిచయమౌతున్న చిత్రం 'మిస్టర్ ఇడియట్'. సిమ్రాన్‌శర్మ కథానాయిక. గౌరి రోణంకి దర్శకత్వంలో జె.జె.ఆర్.రవిచంద్ర చిత్రాన్ని నిర్మించారు. త్వరలో సినిమా విడుదల కానుంది. హైదరాబాద్‌లో ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. అతిథులుగా వచ్చిన డైరెక్టర్ ప్రశాంత్‌వర్మ, బెక్కెం వేణుగోపాల్ యూనిట్‌కి శుభాకాంక్షలందించారు. యూత్ మెచ్చేలా సినిమా తీశామని, అనూప్ రూబెన్స్ మ్యూజిక్ సినిమాకు హైలైట్ అని డైరెక్టర్ గౌరి తెలిపారు. నవంబర్‌లో సినిమాని రిలీజ్ చేస్తామని నిర్మాత చెప్పారు. ఇంకా హీరోహీరోయిన్లు మాట్లాడారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.